

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 244

శనివారం 18-5-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సెమీస్‌లో సాత్విక్‌- చిరాగ్‌ జోడీ

అశ్విని-తనీషా ద్వయం కూడా.. ముగిసిన మిరాబా పోరాటం - 13లో



రూ. 7.30 డివిడెండ్‌

జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ ప్రకటన.. క్యూ4లో లాభం 65 శాతం డౌన్‌ - 13లో



వారు గెలిస్తే రాముడు టెంట్‌లోకే..

ఎన్నికల్లో ప్రతిపక్షాలను గెలిపిస్తే అయోధ్య లోని బాలరాముడు మళ్లీ టెంట్‌లోకి వెళ్లాల్సి వస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



మాకు ప్లాన్‌-బి అవసరం లేదు

ఎన్నికల్లో ఎన్డీయేకు మెజార్టీ వస్తుందని, మెజార్టీ తగ్గే ప్రశ్నే రాదని, 'ప్లాన్‌-బి' అవసరం లేదని హోం మంత్రి షా అన్నారు.

వివరాలు 6లో ▸



రాహుల్‌ను మీకు అప్పగిస్తున్నా

తన కుమారుడిని రాయ్‌బరేలీ ప్రజలకు అప్పగిస్తున్నానని, రాహుల్‌ మిమ్మల్ని నిరాశ పర్చడని కాంగ్రెస్‌ నేత సోనియా అన్నారు.

వివరాలు 6లో ▸



ఛాతీపై కొట్టి.. పొట్టలో తన్నాడు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ నివాసంలో ఆయన పీఏ తనను ఛాతీపై కొట్టి, పొట్టలో తన్ని బెదిరించాడని ఆప్‌ ఎంపీ స్వాతి మలివాల్‌ చెప్పారు.

వివరాలు 6లో ▸

వైఎస్సార్‌సీపీకే మళ్లీ అధికారం



ఈ ఎన్నికల్లో విజయంపై వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ పూర్తి ఆత్మ విశ్వాసంతో ఉందని, గతం కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల వారు తమ పార్టీకే ఓటు వేయడం ద్వారా సీఎం వైఎస్‌ జగన్‌ వైపు నిలబడ్డారని చెప్పారు. 10లో

అధికారులను మార్చిన చోటే అల్లర్లు



రాష్ట్రంలో ఏ ప్రాంతంలో అయితే జిల్లా స్థాయి ఉన్నతాధికారులను మార్చారో అక్కడే అల్లర్లు జరిగాయని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నియమించిన ఒక విశ్రాంత పోలీసు అధికారి ఏకపక్ష నిర్ణయాలే కారణమన్నారు. 2లో

చేతులు కాలాక 'సిట్‌'

ఏపీలో పరిస్థితులకు ఈసీ పక్షపాత వైఖరే ప్రధాన కారణం

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడంతో చెలరేగిన హింసాకాండ

చంద్రబాబు, పురందేశ్వరి జాబితాకు ఈసీ ఆమోదంతో రెచ్చిపోయిన పచ్చమూకలు

- అనుకూల అధికారుల అండతో తెగబడిన అల్లరి మూకలు
- శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లాక తాపీగా మేలుకున్న ఎన్నికల సంఘం
- వినీత్‌ బ్రిజ్‌లాల్‌ నేతృత్వంలో 13 మంది అధికారులతో 'సిట్‌'.. రెండు రోజుల్లో నివేదికకు ఆదేశం
- అవసరమైతే అదనపు సెక్షన్లు.. కొత్త ఎఫ్‌ఐఆర్‌ల నమోదు

2లో



టీడీపీ దాష్టీకానికి పరాకాష్ట 2లో

- కుట్ర రాజకీయానికి మహిళా వలంటీర్‌ బలి
- వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేశారనే ఆరోపణలతో ఫిర్యాదు.. ఆగమేఘాలపై కేసు నమోదు
- పోలీసుల విచారణ.. ఆందోళనతో ఆగిన గుండె

'మిల్లెట్‌ సిస్టర్స్‌' ఆదర్శం

- 20వేల మందికి జీవనోపాధితో స్ఫూర్తినిస్తున్న విజయనగరం వాసి.. సీఐఐ వుమెన్‌ ఎగ్జంప్లర్‌ 2024 అవార్డు అందుకున్న సరస్వతి మల్లువలస
- న్యూఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ నుంచి అవార్డు స్వీకరణ.. ప్రశంసాపత్రం, ట్రోఫీతో పాటు రూ.మూడు లక్షల నగదు ప్రదానం

14లో



29 అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌

నేటి నుంచి 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం

14లో

రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి రాయితీ

- నేటి నుంచి జమ చేసేందుకు ఏర్పాట్లు
- 11.57 లక్షల మంది ఖాతాల్లోకి రూ.1,289.58 కోట్లు
- ఖరీఫ్‌ 23 కరువు సాయం, మిచాంగ్‌ తుపాన్‌ పరిహారం చెల్లింపు
- ఆంక్షలు సడలించిన ఈసీ.. కోడ్‌ సాకుతో అడ్డుకున్న బాబు బృందం

5లో





విదేశీ పర్యటనకు సీఎం వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ఆయన తాడేపల్లిలోని తన నివాసం నుంచి సతీసమేతంగా గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని ప్రత్యేక విమానంలో లండన్‌ వెళ్లినట్లు సీఎంవో వర్గాలు తెలిపాయి. తిరిగి ఆయన జూన్‌ 1న రాష్ట్రానికి వస్తారని వెల్లడించాయి. కాగా విమానాశ్రయంలో సీఎం జగన్‌కు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మంత్రి జోగి రమేశ్‌, ప్రభుత్వ విప్‌లు చెవిరెడ్డి, సామినేని, ఎమ్మెల్సీలు తలశిల, అరుణ్‌కుమార్‌, ఎమ్మెల్యే విష్ణు, ఎంపీ సురేశ్‌ వీడ్కోలు పలికారు.

మినరల్‌ కాదు.. అంతా జనరలే..!

పుట్టగొడుగుల్లా వాటర్‌ ప్లాంట్లు

కొరవడిన అజమాయిషీ

అధిక శాతం ప్లాంట్లలో కానరాని యూవీ సిస్టమ్‌

యథేచ్ఛగా మినరల్‌ నీటి వ్యాపారం

పశ్చిమగోదావరి జిల్లాలో 600కు పైగా ప్లాంట్లు

రోజుకు రూ.80 లక్షలకు పైగా అమ్మకాలు



సాక్షి, భీమవరం: ఐఎస్‌ఐ సర్టిఫికెట్‌ కలిగిన రివర్స్‌ అస్మోసిస్‌ (ఆర్‌ఓ) ప్లాంటు పెట్టాలంటే వివిధ శాఖల నుంచి పదికి పైనే లైసెన్సులు పొందాలి. ల్యాబ్‌, ప్లాంట్‌ సామగ్రి, అనుమతులు తదితర వాటికి రూ.35 లక్షలకు పైనే ఖర్చవుతుంది. జిల్లాలో ఈ తరహా ఆర్‌ఓ ప్లాంట్లను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. అయితే రెండు, మూడు లక్షల పెట్టుబడితో పెట్టిన ప్లాంట్లను ఐఎస్‌ఐ పేరిట వ్యాపారులు చలామణి చేసేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నాణ్యత లేని నీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో ఆటలాడుతున్నారు.

పెరుగుతున్న వాడకం

మినరల్‌ వాటర్‌ తాగే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నీటి విక్రయాలు మూడు టిన్నులు, ఆరు బాటిళ్లలా సాగిపోతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని జిల్లావ్యాప్తంగా రివర్స్‌ అస్మోసిస్‌ (ఆర్‌ఓ) ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్లాంట్‌ పెట్టాలంటే వివిధ శాఖల నుంచి గ్రౌండ్‌ వాటర్‌, ఫుడ్‌, జీఎస్‌టీ, లేబర్‌, ఐఎస్‌ఐ, నో అబ్జక్షన్‌, కమర్షియల్‌ తదితర పది వరకు లైసెన్సులు ఉండాలి. ఆయా లైసెన్సుల కోసం రూ.2 లక్షలకు పైనే ఖర్చవుతుంది. అయితే కేవలం స్థానిక సంస్థల నుంచి అనుమతి పొందడం ద్వారా తక్కువ పెట్టుబడితో అవసరమైన సామగ్రితో ప్లాంటులు ఏర్పాటుచేస్తున్నారు. ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు గతంలో ప్రభుత్వం పలు మినహాయింపులు ఇచ్చేది. స్వచ్ఛంద సంస్థల మాటున వ్యాపారులు ప్లాంట్లు ఏర్పాటుచేసి ఐఎస్‌ఐ సర్టిఫికెట్‌ ఉన్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామాల్లో రెండు, మూడు ఆర్‌ఓ ప్లాంట్లు ఉండగా, పట్టణాల్లో పదుల సంఖ్యలో ఉంటున్నాయి. జిల్లావ్యాప్తంగా 600లకు పైనే ఉన్నట్టు అంచనా. కాగా ఐఎస్‌ఐ సర్టిఫికెట్‌ కలిగినవి జిల్లాలో కేవలం నాలుగు మాత్రమే ఉండటం గమనార్హం. వీటిలో ఒకటి భీమవరం ఉండి రోడ్డులో ఉండగా, మిగిలినవి తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో ఉన్నాయి. వీరు మాత్రమే వాటర్‌ను బాట్లింగ్‌ చేయాల్సి ఉంది. కాగా కొందరు వ్యాపారులు తమ ప్లాంట్లకు ఐఎస్‌ఐ సర్టిఫికెట్‌ ఉన్నట్టుగా ప్రచారం చేసుకుంటూ కనీస ప్రమాణాలు పాటించకుండా బాట్లింగ్‌ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

నాణ్యత ఎంత?

ఆర్‌ఓ ప్లాంటు నీటిలోని మలినాలను శుద్ధి చేస్తే, అల్ట్రా వైలెట్‌ సిస్టమ్‌ (యూవీ) బ్యాక్టీరియాను తొలగిస్తుంది. బాట్లింగ్‌, వాటర్‌ ప్యాకెట్ల రూపంలో రోజుల తరబడి నీటిని నిల్వ ఉంచాల్సి వస్తే వైరస్‌ చేరకుండా ఓజేనేషన్‌ సిస్టమ్‌ వాడతారు. ఐఎస్‌ఐ ధ్రువీకరణ కలిగిన మినరల్‌ వాటర్‌ ప్లాంట్లలో ఓజేనేషన్‌ సిస్టమ్‌ తప్పనిసరి. అధిక శాతం ప్లాంట్లలో కేవలం ఆర్‌ఓ టెక్నాలజీ ద్వారా నీటిలోని మలినాలను మాత్రమే శుద్ధి చేస్తున్నారు. ఓజేనేషన్‌ సిస్టమ్‌ మాట అటుంచితే కొన్నిచోట్ల బ్యాక్టీరియాను శుద్ధి చేసే యూవీ సిస్టమ్‌ ఉండటం లేదని తెలుస్తోంది. రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టి దీని ఏర్పాటు వ్యాపారులు ముందుకు రావడం లేదు. క్రమం తప్పకుండా ఫిల్టర్లు శుభ్రం చేయడం, ఆర్‌ఓ ప్లాంటుకు ఆయువు పట్టులాంటి మెమరిన్‌ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించడం వంటి చర్యలు చాలాచోట్ల కనిపించడం లేదు. నీటిలోని రంగు, ఐరెన్‌, హార్డ్‌నెస్‌, కాల్షియం, ఫ్లోరైడ్‌, మెగ్నీషియం, సల్ఫేట్‌ తదితర వాటి శాతం పరీక్షించేందుకు ప్రతినెలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా చాలా మంది వ్యాపారులు చేయడం లేదు. బోరు నీటిలోని టోటల్‌ డిజాల్వడ్‌ సాలిడ్స్‌ (టీడీఎస్‌) 2000 శాతం వరకు ఉంటుంది. ఆర్‌ఓ ప్లాంటు నుంచి బయటకు వచ్చేసరికి 20 నుంచి 30 మధ్య టీడీఎస్‌ శాతం ఉండాల్సి ఉండగా చాలా ప్లాంట్లలో పరిమితికి మించి ఉంటున్నట్టు తెలుస్తోంది. ప్రజారోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులు స్పందించి సురక్షితమైన నీటిని అందించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హానికరంగా వాటర్‌ ప్యాకెట్లు

120 మైక్రాన్ల ప్లాస్టిక్‌ కవర్లలో మాత్రమే మినరల్‌ వాటర్‌ ప్యాకింగ్‌ చేయాలన్న నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదు. తక్కువ ధరకు వస్తున్నాయన్న ఉద్దేశంతో నిర్ణీత మందం కన్నా పల్చటి కవర్లు వినియోగిస్తున్నారు. దీనివలన పర్యావరణానికి హాని కలగడంతో పాటు ఎండ తీవ్రతకు కవర్‌లోని నీరు వేడెక్కి కవర్‌లోని కెమికల్స్‌ నీటిలోకి చేరడం వలన ప్రజారోగ్యానికి హాని కలుగుతుంది.

రోజుకు రూ.80 లక్షలకుపైనే వ్యాపారం

గ్రామీణ ప్రాంతాల్లో 20 లీటర్ల రూ.5 నుంచి రూ.10ల వరకు, కూలింగ్‌ వాటర్‌ను రూ.30 చొప్పున విక్రయిస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో ఈ ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. ఇళ్లకు చేరవేస్తే రవాణా చార్జీలు అదనం. ప్లాంట్లలో నీటిని వాటర్‌ ప్యాకెట్లుగా, బాటిళ్లుగా ప్యాకింగ్‌ చేసి పాన్‌షాపుల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. ఎండల తీవ్రతకు తోడు ఎన్నికల సీజన్‌ రావడంతో ఈ వేసవిలో భారీస్థాయిలోనే వ్యాపారం జరిగినట్టు తెలుస్తోంది. జిల్లాలో రోజుకు దాదాపు రూ.80 లక్షలకు పైగా నీటి వ్యాపారం జరుగుతున్నట్టు అంచనా. భారీ ఎత్తున జిల్లాలో మినరల్‌ నీటి అమ్మకాలు జరుగుతున్నా నీటి నాణ్యతను పరిశీలించే దిశగా స్థానిక సంస్థలు కనీసం శాంపిల్స్‌ కూడా సేకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



మామిడి.. దిగుబడి తడబడి

తగ్గిన దిగుబడులు

మందకొడిగా ఎగుమతులు

జిల్లాలో 15 వేల హెక్టార్లలో మామిడి సాగు

చింతలపూడి: ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం సాగించే మామిడి పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మామిడి ఎగుమతుల్లో జిల్లాలో నూజివీడు తర్వాత ద్వితీయ స్థానం ఆక్రమించిన చింతలపూడి ప్రాంతంలో ప్రస్తుతం వ్యాపారం మందగించింది. సీజన్‌ ప్రారంభమై నెల కావస్తున్నా ఆశించిన స్థాయిలో ఎగుమతులు లేక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాయ దిగుబడి లేకపోవడం, కోతకు వచ్చిన కొద్దిపాటి కాయ నాణ్యత లోపించడం ఎగుమతులు మందగించడానికి కారణాలని వ్యాపారులు భావిస్తున్నారు. అలాగే కాయను ఆకర్షణీయమైన సైజుకు ఎదిగే వరకూ చెట్టు మీదే ఆపడానికి రైతులకు ధైర్యం చాలడం లేదు. అకస్మాత్తుగా ఈదురుగాలు, వర్షాలు వస్తే మరింత నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు.

5 వేల టన్నులు మాత్రమే..

గతంలో ఏప్రిల్‌, మే నెలల్లో రోజుకు 25 లారీల మామిడి కాయలు ఎగుమతి చేసేవారు. రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో ఎగుమతి చేయలేక పోయామని వ్యాపారులు వాపోతున్నారు. ఏటా 20 వేల టన్నుల మామిడి పంట ఈ ప్రాంతం నుంచి కోల్‌కతా, నాగపూర్‌, గుజరాత్‌, హైదరాబాద్‌, పూనే, అహ్మదాబాద్‌, ఢిల్లీ, కాన్పూర్‌, ఒడిసా ప్రాంతాలకు ఎగుమతి అయ్యేవి. ఈ ఏడాది సీజన్‌ ముగింపు దశకు వచ్చినా 5 వేల టన్నులు కూడా ఎగుమతి చేయలేదని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం బంగినపల్లి రకం టన్ను మామిడి కాయలు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతోంది.

జిల్లాలో తగ్గిన విస్తీర్ణం

గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో లక్షలాది ఎకరాల్లో విస్తరించి ఉండే మామిడి తోటలు ప్రస్తుతం బాగా తగ్గిపోయాయి. అధిక భాగం మామిడి తోటలను తొలగించి రైతులు ఆయిల్‌పామ్‌ సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 44 వేల హెక్టార్లలో మామిడి స్థానంలో ఆయిల్‌పామ్‌ సాగవుతోంది. జిల్లాలో చింతలపూడి, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, ద్వారకాతిరుమల, నల్లజర్ల, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట ప్రాంతాల్లో సుమారు 15 వేల హెక్టారుల్లో మాత్రమే మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి తోటల అభివృద్ధికి ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తోంది. రైతులకు మరింత ప్రోత్సాహం అందించి అవగాహన కల్పించకపోతే భవిష్యత్తులో మామిడి అంతరించిపోయే ప్రమాదం ఉంది.

దిగుబడి తగ్గింది

దిగుబడి తగ్గిన కారణంగా ఎగుమతులు మందగించాయి. ప్రారంభంలో టన్ను రూ.50 వేల నుంచి రూ. లక్షల వరకు ఉన్న ధర ప్రస్తుతం రూ.30 వేలు పలుకుతోంది. ప్రభుత్వం మామిడి రైతులను, వ్యాపారులను మరింత ప్రోత్సహించేలా శీతల గిడ్డంగులను నిర్మించాలి.

– చిక్కాల సుధాకర్‌, మామిడి కమీషన్‌ వ్యాపారి, చింతలపూడి

రవాణా ఖర్చుల భారం

రైతుల నుంచి కొనుగోలు చేసిన మామిడి కాయలను రవాణా చేయడం భారంగా మారింది. మామిడి కాయల ప్యాకింగ్‌కు టన్నుకు రూ.1,500 వరకు ఖర్చవుతోంది. ఈ ఏడాది తోటలు సరిగా కాయకపోవడంతో 30 శాతం దిగుబడి మాత్రమే వచ్చింది.

– పసుపులేటి నాగరాజు, మామిడి వ్యాపారి



క్లుప్తంగా...

నిబంధనల ప్రకారమే పోస్టల్ బ్యాలెట్‌ల తరలింపు

విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: విజయనగరం తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఎంపీ పోస్టల్ బ్యాలెట్‌లను కలెక్టరేట్‌కు తరలించే ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పార్లమెంటరీ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ కవర్లను పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అప్పగించే ప్రక్రియను గురువారం మధ్యాహ్నం మూడుగంటలకు చేపట్టారు. విజయనగరం తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్ తెరుస్తామనే సమాచారాన్ని అభ్యర్థులందరితో పాటు తెలుగుదేశం పార్టీ వారికీ ముందే తెలపలేదని వివిధ ప్రింట్, సోషల్ మీడియాల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూమ్ తెరిచే సమయాన్ని ముందుగా అభ్యర్థులందరికీ నోటీసుల ద్వారా రిటర్నింగ్ అధికారి తెలిపారని వివరించారు. అభ్యర్థుల తరఫున వచ్చినవారి సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌ను రిటర్నింగ్ అధికారి తెరిచారని తెలిపారు. కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన ప్రతికూల వార్తల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు.

ఈ-ఆఫీసు అప్‌గ్రేడేషన్ వాయిదా

ఉత్తర్వులు జారీచేసిన ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శుక్రవారం నుంచి జరగాల్సిన ఈ–ఆఫీస్ అప్‌గ్రేడేషన్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్ సాధారణమైన అంశం అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఫిర్యాదు మేరకు అప్‌గ్రేడేషన్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఎన్ఐసీ ప్రతినిధులను ఆదేశించింది. ఈసీ ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 25 వరకు జరగాల్సిన ఈ–ఆఫీస్ అప్‌గ్రేడేషన్‌ను తాత్కాలికంగా వాయిదా వేశామని, తదుపరి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని ఎన్ఐసీ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. పాత విధానంలోనే విధులు నిర్వర్తించాలని అన్ని ప్రభుత్వ విభాగాలను కోరింది.

4 రోజుల్లో అరకోటి మంది రైళ్లలో ప్రయాణం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే నాలుగు రోజుల్లో అరకోటి మందిని గమ్యం చేర్చింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నందున ఆ రాష్ట్రానికి వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ప్రయాణించారు. ఈ నెల 13న పోలింగ్ జరగ్గా, దానికి నాలుగు రోజుల ముందు దక్షిణ మధ్య రైల్వే దాదాపు 30 ప్రత్యేక రైళ్లను నడిపింది. రెగ్యులర్ రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువ మందిని తరలించింది. ఆ నాలుగు రోజుల్లో రైళ్లలో సీటు దొరకటమే గగనంగా మారింది. గరిష్ట స్థాయికి వెయిటింగ్ జాబితా చేరుకోవటంతో చాలా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్ల విక్రయాన్ని కూడా రద్దుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా వెళ్లిన వారితోపాటు, స్వంత పనుల మీద వివిధ రాష్ట్రాలకు వెళ్లిన ప్రయాణికులను కలిపి.. పోలింగ్‌కు ముందు నాలుగు రోజుల్లో అన్ని రకాల రైళ్లలో 50 లక్షల మంది ప్రయాణించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఇది కేవలం దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్న రైళ్లకు సంబంధించిన సంఖ్య కాగా, ఇతర జోన్లకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే మార్గాల మీదుగా ప్రయాణించిన రైళ్లలోని వారిసంఖ్య దీనికి అదనంగా ఉంటుందని తెలుస్తోంది. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక రైళ్లలోని అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లలోనే ఏకంగా 4.3 లక్షల మంది ప్రయాణించారు. ఇక ఆర్టీసీ బస్సులు కూడా ఆ నాలుగు రోజులు కిక్కిరిసి తిరిగాయి. పోలింగ్ మరుసటి రోజు ఒక్క రోజే తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో 54 లక్షల మంది ప్రయాణించిన విషయం తెలిసిందే. పోలింగ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి పరిశీలిస్తే, తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో దాదాపు కోటిన్నర మంది ప్రయాణించారు.

చేతులు కాలాక 'సిట్'!

ఏపీలో పరిస్థితులకు ఈసీ పక్షపాత వైఖరే ప్రధాన కారణం

- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడంతో చెలరేగిన హింసాకాండ
- చంద్రబాబు, పురందేశ్వరి జాబితాకు ఈసీ ఆమోదంతో రెచ్చిపోయిన పచ్చముఠాలు
- అనుకూల అధికారుల అండతో తెగబడిన అల్లరి మూకలు
- శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లాక తాపీగా మేలుకున్న ఈసీ
- వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది అధికారులతో 'సిట్'.. రెండు రోజుల్లో నివేదికకు ఆదేశం
- అవసరమైతే అదనపు సెక్షన్లు.. కొత్త ఎఫ్ఐఆర్‌ల నమోదు



సాక్షి, అమరావతి: ఎన్నికల హింసపై ఎన్నికల కమిషన్ (ఈసీ) వ్యవహరిస్తున్న తీరు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది! రాష్ట్రంలో పోలింగ్ రోజు, ఆ తరువాత జరిగిన హింసాకాండకు ఏకైక కారణం రాజకీయ ఒత్తిళ్లతో పోలీస్ ఉన్నతాధికారులను ఈసీ ఏకపక్షంగా బదిలీ చేయడమే! ఆ స్థానంలో వచ్చిన అధికారులకు క్షేత్రస్థాయి పరిస్థితులపై సరైన అవగాహన లేకపోవడంతో పాటు పచ్చముఠాల ఆగడాలను ఉపేక్షించడం వల్ల భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నష్ట నివారణ చర్యలకు దిగిన ఈసీ ఆదేశాల మేరకు హింసాత్మక ఘటనలపై విచారణకు శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటైంది. ఎస్ఐబీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది పోలీసు అధికారులతో ఏర్పాటైన 'సిట్' రెండు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈసీ ఆదేశించింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో పోలింగ్ సందర్భంగా చెలరేగిన హింసపై 'సిట్' దర్యాప్తు చేయనుంది. హింస చెలరేగడంలో పోలీసు అధికారుల పాత్రను కూడా 'సిట్' నిగ్గు తేల్చనుంది. ఆయా చోట్ల నమోదు చేసిన కేసులు, విచారణ తీరుతెన్నులపై పరిశీలించి వాస్తవాలు తేల్చాలని సిట్‌కు స్పష్టం చేసింది. అదనపు సెక్షన్లు, అవసరమైతే కొత్త ఎఫ్ఐఆర్‌ల నమోదును సూచించాలని పేర్కొంది. ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు సిట్ విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది.

అనుకూల అధికారుల అండతో..

'సిట్' ఏర్పాటు చేసి నష్టనివారణ చర్యలకు దిగేలా పరిస్థితులు మారడానికి ఈసీ తీసుకున్న నిర్ణయాలే ముఖ్య కారణంగా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిళ్లకు తలొగ్గి ఎడాపెడా పోలీస్ అధికారులను మార్చేసి, వారి సూచనల మేరకు ఈసీ నియామకాలు చేపట్టింది. అనుకూల అధికారుల అండ చూసుకుని పల్నాడు, రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆ పార్టీకి ఓటు వేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మహిళలే లక్ష్యంగా దాడులకు తెగబడ్డాయి. పరిస్థితులు చేయి దాటాక ఈసీ మేల్కొంది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా అనంతపురం, పల్నాడు ఎస్పీలపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు పల్నాడు కలెక్టర్, తిరుపతి ఎస్పీని బదిలీ చేసింది. మూడు జిల్లాల్లో 12 మంది పోలీసులపై సస్పెన్షన్ కొరడా ఝుళిపించింది. ఈ క్రమంలో సిట్ ఏర్పాటైంది. మొత్తం వ్యవహారంలో ఈసీ తీరు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో చెలరేగిన హింస, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఈసీ పక్షపాత వైఖరి ఫలితమేనని పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాశీనత..

గత ఐదేళ్లుగా అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందించారు. ప్రజాదరణ కోల్పోయి దిక్కుతోచని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏం చేయాలో పాలుపోక దుష్ప్రచారాలతో పేట్రేగిపోయింది. ఎన్ని కుట్రలు చేసినా ప్రజాదరణ దక్కకపోవడంతో పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పెద్ద ఎత్తున హింసకు చంద్రబాబు ప్రణాళిక రచించారు. ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పట్టున్న సమర్థులైన పోలీసు అధికారులు ఉంటే తమ పన్నాగాలు పనిచేయవని పసిగట్టి నిరాధార ఆరోపణలతో ఈసీకి ఫిర్యాదులు చేశారు. పురందేశ్వరి సహకారంతో పల్నాడు, ప్రకాశం, తిరుపతి తదితర జిల్లాల్లో ఎవరిని నియమించాలో కూడా సూచిస్తూ ఏకంగా జాబితాను అందచేశారు. పచ్చముఠా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి డీజీపీ, నిఘా విభాగం ఇన్‌చార్జ్‌తో పాటు పలువురు డీఐజీ, ఎస్పీలను ఈసీ పక్కనపెట్టింది. టీడీపీతో సత్సంబంధాలున్న వారిని రాజకీయ ఒత్తిళ్లతో అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నియమించింది. పల్నాడు ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్‌ను నియమించడమే ఇందుకు నిదర్శనం. ఈ అధికారి నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కుటుంబానికి అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. ఈ పార్లమెంట్ స్థానంలో వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉంది. 2019లో ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాలను పార్టీ స్వీప్ చేసింది. దీంతో అధికార పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో పోలింగ్ సజావుగా జరగకుండా నిలువరించేలా కృష్ణదేవరాయలు స్కెచ్ వేశారు. క్షేత్రస్థాయిలో తన సామాజికవర్గానికి చెందిన వారిని నియమించుకుని పల్నాడులో అరాచకానికి కృష్ణదేవరాయలు ముఖ్యకారణమయ్యారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

చోద్యం చూసిన అధికారులు..

అనుకూల అధికారి అండ చూసుకుని పల్నాడులోని నరసరావుపేట, మాచర్ల, గురజాల, కొత్త గణేశునిపాడులో టీడీపీ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. పెట్రోలు బాంబులు, వేట కొడవళ్లు, బరిసెలు, బాకులు, ఇనుప రాడ్లతో స్వైర విహారం చేశాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, ఆ పార్టీకి ఓటు వేసినట్లు భావించిన వారిపై యథేచ్ఛగా దాడులకు తెగబడ్డాయి. ఇంత జరుగుతున్నా పల్నాడు ఎస్పీ బిందు మాధవ్‌తోపాటు ఆయన ఆధ్వర్యంలోని డీఎస్పీలు, సీఐలు చోద్యం చూశారు. టీడీపీ మూకల నుంచి తమకు, ప్రజలకు రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఫోన్లు చేసినా పోలీసులు పెడచెవిన పెట్టారు.

సీమలో వివాదాస్పదం

అనంతపురం జిల్లాలో కొందరు పోలీసుల తీరు వివాదాస్పదంగా మారింది. పోలింగ్‌కు ముందు ఈ జిల్లాకు అమిత్ బర్దర్‌ను ఎస్పీగా నియమించారు. తొలి నుంచి ఆయన టీడీపీకి కొమ్ముకాశారు. కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ వాహనంలో రూ.2 కోట్లు లభ్యమైతే కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయడం ఆయన పచ్చపాత వైఖరికి నిదర్శనం. ఎన్నికల రోజు తాడిపత్రిలో టీడీపీ నాయకులు జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డి, దీపక్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల్లో చొరబడి అక్రమాలకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసంపై టీడీపీ గూండాలు రాళ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనలను నియంత్రించడంలో ఎస్పీ విఫలమయ్యారు. మరోవైపు పోలీసులు పెద్దారెడ్డి నివాసంలోకి చొరబడి విధ్వంసానికి పాల్పడ్డారు. వారి చర్యలు సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా ముందుగానే ధ్వంసం చేసిన ఫుటేజీలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తిరుపతి జిల్లాలో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేసి ఆయన వాహన శ్రేణిలోని వాహనానికి నిప్పుపెట్టారు. ఇక్కడ కూడా అల్లర్లను కట్టడి చేయడంలో ఈసీ నియమించిన పోలీసు అధికారులు దారుణంగా విఫలమయ్యారు.

13 మందితో 'సిట్'

సాక్షి, అమరావతి: ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలపై విచారణకు ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసింది. ఎస్ఐబీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది పోలీసు అధికారులతో ఏర్పాటైన 'సిట్' పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో జరిగిన హింసపై విచారణ జరిపి రెండు రోజుల్లో ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో డీజీపీ ఆదేశించారు.

'సిట్' సభ్యులు...

1. రమాదేవి, ఎస్పీ, ఏసీబీ
2. సౌమ్యలత, ఏఎస్పీ, ఏసీబీ
3. రమణమూర్తి, డీఎస్పీ, ఏసీబీ, శ్రీకాకుళం
4. పి.శ్రీనివాసులు, డీఎస్పీ, సీఐడీ
5. వి.శ్రీనివాసరావు, డీఎస్పీ, ఏసీబీ, ఒంగోలు
6. రవి మనోహరా చారి, డీఎస్పీ, ఏసీబీ, తిరుపతి
7. వి.భూషణం, ఇన్‌స్పెక్టర్, గుంటూరు రేంజి
8. కె.వెంకట్రావు, ఇన్‌స్పెక్టర్, ఇంటెలిజెన్స్, విశాఖ
9. రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ
10. జీఎల్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ
11. మొయిన్, ఇన్‌స్పెక్టర్, పీటీసీ, ఒంగోలు
12. ఎన్.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ, అనంతపురం
13. శివప్రసాద్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ

టీడీపీ దాష్టీకానికి పరాకాష్ట

- కుట్ర రాజకీయానికి మహిళా వలంటీర్ బలి
- వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేశారనే ఆరోపణలతో ఫిర్యాదు
- ఆగమేఘాలపై కేసు నమోదు
- పోలీసుల విచారణ.. ఆందోళనతో ఆగిన గుండె


భర్త, పిల్లలతో సంతోషి (ఫైల్)


సంతోషి అంత్యక్రియలకు భారీగా తరలి వచ్చిన దుప్పాడ గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేశారనే ఆరోపణలతో టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఓ మహిళా వలంటీర్ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఊళ్లో అందరికీ తలలో నాలుకలా వ్యవహరించిన ఓ సేవకురాలిని టీడీపీ స్వార్థ రాజకీయాల కోసం పొట్టన పెట్టుకోవడం దిగ్భ్రాంతి పరుస్తోంది. తప్పుడు ఆరోపణలతో వేధింపులు, ఫిర్యాదు, పోలీసుల విచారణతో తీవ్ర భయాందోళనలకు గురై విజయనగరం రూరల్ మండలం దుప్పాడ గ్రామంలో వలంటీరు బొబ్బాది సంతోషి (36) గుండె ఆగిపోయింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంతోషి భర్త బొబ్బాది కృష్ణ విజయనగరం కూరగాయల మార్కెట్‌లో పని చేస్తుంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. అబ్బాయి జయదీప్ ఇటీవలే పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. అమ్మాయి లహరి ఎనిమిదో తరగతి చదువుతోంది. సంతోషి వలంటీరుగా చేరిన తర్వాత గ్రామంలో తనకు అప్పగించిన 50 కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉండేది. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి పథకాన్ని అర్హులకు చేర్చుతూ వారి మన్ననలు అందుకుంది. తనది పేద కుటుంబమే అయినా గ్రామంలో ఏ పేద వారూ ఇబ్బంది పడకూడదనే సంకల్పంతో సేవలందించింది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతలకు పింఛన్ అందించడంలో పోటీ పడేది. సీఎం జగన్ అంటే అభిమానం. ఇవన్నీ అదే గ్రామంలోని టీడీపీ నాయకులకు కంటగింపుగా మారాయి. ఏదో విధంగా వలంటీర్లపై కక్ష సాధింపు లక్ష్యంతో ఉన్న టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టుకుని కుట్రలు, కుతంత్రాలకు తెర లేపారు.

టీడీపీ నేతల బెదిరింపులు

టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ స్థానిక టీడీపీ నేతలు గ్రామంలో 50 మంది యువకులను మభ్యపెట్టి ఎన్నికల ప్రచారానికి వాడుకున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారంటూ వలంటీర్లు బొబ్బాది సంతోషి, నారాయణమ్మ, రామలక్ష్మి, స్వాతి, కృష్ణవేణి, కోటమ్మలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పూర్వాపరాలు సరిగా విచారించకుండానే టీడీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఆగమేఘాలపై ఆ ఆరుగురు వలంటీర్లను సస్పెండ్ చేశారు. పోలీసులతో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. పుట్టుమచ్చలు, తదితర వివరాలు చెప్పాలని పోలీసులు మూడు రోజుల కిందట సంతోషికి ఫోన్ చేసి అడిగారు. అంతకు ముందు గ్రామంలో నిర్వహించిన టీడీపీ ప్రచార సభలో కూడా ఆ నాయకులు వలంటీర్ల ప్రస్తావన తీసుకొచ్చారు. ఇప్పుడు ఉద్యోగాలు ఊడగొట్టి కేసులు పెట్టించామని, తమ టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వదిలి పెట్టబోమని హెచ్చరించారు. పోలీసులు గ్రామంలోకి వచ్చి ఇంటింటి విచారణ చేశారు. ఇవన్నీ సంతోషినిని ఆందోళనకు గురి చేశాయి. ఇదిలా ఉండగా పుట్టుమచ్చలు తదితర వివరాలు చెప్పాలని పోలీసులు మూడ్రోజుల కిందట ఆమెకు ఫోన్ చేయడంతో తీవ్రంగా భయాందోళనకు గురైంది. గురువారం ఛాతీలో పట్టేసినట్టు ఉండటంతో తొలుత గ్యాస్ తాలూకు నొప్పిగా భావించింది. కొంత సేపటి తర్వాత గుండెల్లో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు విజయనగరంలో డాక్టర్లకు చూపించారు. వారి సూచనలతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం ఆ పేదరాలి గుండె ఆగిపోయింది. సంతోషి హఠాన్మరణం ఆమె కుటుంబాన్ని తీవ్ర విషాదంలో నింపింది. గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు ఆమె అంతిమ యాత్రలో పాల్గొని కంట నీరు పెట్టారు. కాగా, ఇంత జరిగినా టీడీపీ నాయకులకు వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడటానికి ఆ కుటుంబం భయపడిపోతోంది. తోటి వలంటీర్లంతా లోలోన కుమిలిపోతున్నారు.

చింతమనేని దౌర్జన్యంగా తీసుకెళ్లిన నిందితుడి అరెస్ట్

- పరారీలో టీడీపీ నేత ప్రభాకర్
- పోలింగ్ రోజు జరిగిన హత్యాయత్నం కేసులో రాజశేఖర్ నిందితుడు
- అతన్ని పోలీసు స్టేషన్ నుంచి దౌర్జన్యంగా తీసుకెళ్లిన చింతమనేని

పెదవేగి: దెందులూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ పోలీసు స్టేషన్ నుంచి దౌర్జన్యంగా తీసుకెళ్లిన హత్యాయత్నం కేసులో నిందితుడు తాళ్ళూరి రాజశేఖర్‌ను పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. అతన్ని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. కాగా, నిందితుడిని పోలీసు స్టేషన్ నుంచి బలవంతంగా తీసుకెళ్లిన చింతమనేని ప్రభాకర్ పరారీలో ఉన్నారని నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య చెప్పారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలోని ఓ పోలింగ్ బూత్ సమీపంలో ఈ నెల 13న జరిగిన హత్యాయత్నం కేసులో పెదవేగి మండలం కొప్పులవారిగూడెం గ్రామానికి చెందిన రాజశేఖర్ నిందితుడు. అతన్ని గురువారం పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ కొద్దిసేపటికే చింతమనేని ప్రభాకర్ మరో 14 మందితో కలిసి పోలీసు స్టేషన్‌లోకి ప్రవేశించి, పోలీసులపై దౌర్జన్యం చేసి, కస్టడీలో ఉన్న రాజశేఖర్‌ను తీసుకెళ్లిపోయారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన పెద్ద సంచలనమే సృష్టించింది. నిందితుడిని 24 గంటల్లో అరెస్టు చేస్తామని డీఎస్పీ లక్ష్మయ్య ప్రకటించారు. అన్నమాట ప్రకారమే పోలీసులు ప్రత్యేక బృందాలతో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టి, శుక్రవారం రాజశేఖర్‌ని అరెస్టు చేశారు. చింతమనేని ప్రభాకర్, ఆయనతోపాటు పోలీసు స్టేషన్‌లో దౌర్జన్యం చేసిన 14 మంది పరారీలో ఉన్నారని తెలిపారు. వారి గృహాలన్నింటినీ గాలించామని, వారి ఆచూకీ దొరకలేదని చెప్పారు. త్వరలోనే చింతమనేని ప్రభాకర్, మిగతా వారిని అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. పోలీసు కస్టడీలో ఉన్న నిందితుడిని దౌర్జన్యంగా తీసుకెళ్లిన నేరానికి చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులపై 353, 224, 225, 143, 149 సెక్షన్ల కింద ఈ నెల 16న కేసు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభాకర్, ఆయన అనుచరులను పట్టుకోవడానికి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఇందు కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయితో కూడిన రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నదని వెల్లడించారు.

అధికారులను మార్చిన చోటే అల్లర్లు

- ఇందుకు ఓ విశ్రాంత అధికారి ఏకపక్ష నిర్ణయాలే కారణం
- అందువల్లే శాంతిభద్రతలకు విఘాతం
- ఆయనపై ఈసీ, గవర్నర్‌లకు ఫిర్యాదు చేశాం
- విశాఖ నుంచే సీఎం వైఎస్ జగన్ పరిపాలన
- మీడియా సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ



ఎంవీపీ కాలనీ (విశాఖ జిల్లా): రాష్ట్రంలో ఏ ప్రాంతంలో అయితే జిల్లా స్థాయి ఉన్నతాధికారులను మార్చారో అక్కడే అల్లర్లు జరిగాయని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నియమించిన ఒక విశ్రాంత పోలీసు అధికారి ఏకపక్ష నిర్ణయాలే కారణమన్నారు. విశాఖ లాసన్స్ బే కాలనీలో మంత్రి బొత్స శుక్రవారం మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎంతో సమర్థులైన అధికారులు ఉన్నా ఈసీ విశ్రాంత పోలీసు అధికారికి కీలక బాధ్యతలు అప్పగించిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలు వంటి సున్నిత సమయాల్లో ఓ అధికారిని నియమించే ముందు వారి పూర్వాపరాలు తెలుసుకుని ఉంటే బాగుండేదన్నారు. ఈ నియామకంలో ఒత్తిళ్లు ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ భావిస్తోందని చెప్పారు. ఆయన ఏకపక్ష నిర్ణయాల వల్ల ఏయే ప్రాంతాల్లో జిల్లా స్థాయి అధికారులను మార్చారో అక్కడ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. దీంతో అక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని తెలిపారు. ప్రతిపక్షాల నుంచి ఏదైనా ఫిర్యాదు వస్తే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. ఆ అధికారి అందుకు విరుద్ధంగా పనిచేశారన్నారు. ఫిర్యాదులను పరిశీలించకుండానే అక్కడి అధికారులపై చర్యలు తీసుకున్నారని మండిపడ్డారు. ఆ అధికారి ఏకపక్ష నిర్ణయాలు, దాని పర్యవసానంగా జరిగిన అల్లర్లపై గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వాటిని వైఎస్సార్‌సీపీ ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోదని చెప్పారు.


వైఎస్సార్‌సీపీ అఖండ విజయం ఖాయం

ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమని మంత్రి బొత్స ధీమా వ్యక్తం చేశారు. గతంలో కంటే ఎక్కువ సీట్లు గెలుస్తామన్నారు. విశాఖ వేదికగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ప్రమాణస్వీకారం చేసే స్థలాన్ని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. రుషికొండలో నిర్మించినవి ప్రభుత్వ భవనాలని.. వాటిని ఎలా వినియోగించుకునేది ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిర్ణయిస్తామని చెప్పారు. ప్రభుత్వం కొలువుదీరాక విశాఖ నుంచి సీఎం జగన్ పరిపాలన సాగుతుందన్నారు. విశాఖ కంచరపాలెంలో ఓ కుటుంబంపై జరిగిన దాడికి రాజకీయాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఓడిపోతారని తెలిసే.. మహానాడు రద్దు

ప్రస్తుత ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ.. మహానాడును రద్దు చేసిందని మంత్రి బొత్స ఎద్దేవా చేశారు. లేకుంటే ఏ పార్టీ అయినా ఇలాంటి కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటుందా అని ప్రశ్నించారు. నిజంగా రాష్ట్రంలో ఆ పార్టీకి అధికారంలోకి వచ్చే సత్తా ఉంటే మహానాడును మరింత అట్టహాసంగా నిర్వహించేదన్నారు. ఓటమి భయంతో ఆ పార్టీ డీలా పడిపోయిందని చెప్పారు. కేంద్రంలో కొలువుదీరే ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ అవసరం ఏర్పడాలని కోరుకుంటున్నానన్నారు. కేంద్రంలోని పార్టీలకు రాష్ట్రంపై ఆధారపడే పరిస్థితి వస్తేనే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరతాయని తెలిపారు.

ఇదండీ సంగతి



ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యనివ్వలేదని ఆత్మహత్య

- మనస్తాపంతో పురుగు మందు తాగిన వృద్ధుడు
- నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి కన్నుమూత



నాగులుప్పలపాడు: ఆయన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరాభిమాని. ఆ తరువాత వైఎస్ జగన్ వెంట నడిచాడు. గ్రామంలో కొందరు స్వార్థ నాయకుల ముందు ఓడిపోకూడదని శపథం చేశాడు. ఆ శపథమే ఆయన పాలిట మృత్యువైంది. నాయకుల కుట్రతో తన ఓటు కూడా తాను వేసుకోలేకపోయాననే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి 4 రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం పోతవరం గ్రామానికి చెందిన చెరుకూరి వెంకటేశ్వర్లు (65) మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ వీరాభిమాని. ఏ ఎన్నిక వచ్చినా గ్రామంలో తన వంతు పార్టీ కోసం కృషి చేసేవాడు. గ్రామంలో ఒక ముఖ్య నాయకుడికి అనుచరుడిగా ఉండేవాడు. ఈ క్రమంలో ఆ నాయకుడు ఇటీవల స్వార్థంతో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరాడు. వెంకటేశ్వర్లును కూడా రమ్మని తీవ్ర ఒత్తిడి చేశాడు. ఏళ్ల తరబడి జగన్ వెంట నడుస్తున్న తాను నీ స్వార్థం కోసం పార్టీని వీడేది లేదంటూ కరాఖండిగా చెప్పేశారు. దీనిని మనసులో ఉంచుకున్న ఆ నాయకుడు ఈ నెల 13న పోలింగ్ రోజు కక్షకట్టి వెంకటేశ్వర్లు కుమారుడిని మభ్యపెట్టి.. మీ నాన్న ఓటు నువ్వు టీడీపీకి వేయాలని ప్రలోభపెట్టారు. దీంతో తన తండ్రి వెంకటేశ్వర్లుకు కళ్లు సరిగా కనపడవని పీవోకు చెప్పి తండ్రితో పాటు పోలింగ్ బూత్‌లోకి కుమారుడు కూడా వెళ్లాడు. లోపల తండ్రి మాట కాదని టీడీపీకి ఓటు వేశాడు. దీంతో తనకు ఎంతో అభిమాన నేత, మేలుచేసిన నాయకుడి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయలేకపోయానని వెంకటేశ్వర్లు మథనపడ్డాడు. పోలింగ్ కేంద్రం నుంచి నేరుగా ఇంటికి వచ్చి ఇంట్లోనే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన రావినూతలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి శుక్రవారం మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఒక కార్యకర్తను కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు.

వదినా మరుదుల కుట్ర ఫలితమే విధ్వంసం

- అరాచకాల వెనుక చంద్రబాబు, పురందేశ్వరి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డి వెల్లడి



సాక్షి, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ముందెన్నడూ ఎరుగని రీతిలో ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో దాడులు, అల్లర్లు జరిగాయి, ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి, ఇందుకు కారణాల్ని పరిశీలిస్తే.. ఈ దాడుల వెనుక చంద్రబాబు, ఆయన వదిన పురందేశ్వరి ధ్వంసరచన కుట్రే కనిపిస్తోందని'.. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ రౌడీమూకలంతా రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సూత్రాల్ని పక్కనబెట్టి యథేచ్ఛగా బరితెగించి దాడులకు దిగాయి. ఈ మూకలు అంతగా రౌడీయిజం చెలాయిస్తూ, వైఎస్సార్‌సీపీ కేడర్‌ను లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలు చేస్తున్నా, పోలీసుయంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా చూస్తున్నాం.. చంద్రబాబు, పురందేశ్వరి కలిసి ఎన్నికల కమిషన్, పోలీసు యంత్రాంగం ద్వారా ఎన్నికల ప్రక్రియను అడ్డగోలుగా తమకు అనుకూలంగా చేసుకోవడానికి ప్రయత్నించారన్నది ఈసీ చర్యలతో రుజువైందని'.. అప్పిరెడ్డి వివరించారు. 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల టార్గెట్‌గా జరిగిన పెత్తందార్ల దాడులివి. వదిన మరుదులు పురందేశ్వరి, చంద్రబాబుల ధ్వంసరచన కుట్రకు ఐఏఎస్, ఐపీఎస్‌లు బలయ్యారు. పోలీసులే పాత్రధారులుగా తాడిపత్రి, నరసరావుపేట దుర్ఘటనలు జరిగాయి. కేంద్ర పోలీసు పరిశీలకుడు దీపక్‌మిశ్రా కనుసన్నల్లోనే ఈ దాడులు జరిగాయి. మేం అధికారంలోకి రాగానే తప్పుడు అధికారులపై చర్యలుంటాయి..' అని అప్పిరెడ్డి హెచ్చరించారు. 'సీఎం జగన్ నాయకత్వమే మళ్లీ రావాలని పేదలు కోరుకున్నారని ఆ వర్గాన్నే టార్గెట్ చేసి దాడులు చేయడం భావ్యమేనా? ఇప్పటికైనా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేయాలని కోరుతున్నాం. మేము అధికారంలోకి రాగానే విలువల్ని తుంగలో తొక్కి చంద్రబాబు ట్రాప్‌లో పడి, ఆయన కోసం పనిచేసిన వారందరినీ లెక్కగట్టి శాఖాపరమైన విచారణకు పిలిపిస్తాం. ఆధారాలతో సహా రుజువు చేసి వారిపై చర్యలు తీవ్రంగా తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం..' అని అప్పిరెడ్డి పేర్కొన్నారు.

హ్యాండ్లూమ్ కోర్సుల్లో ప్రవేశాలు

జూన్ 1 వరకు దరఖాస్తు గడువు



వెంకటగిరి రూరల్ (తిరుపతి జిల్లా): దేశంలో ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఎస్పీకేఎం ఐఐహెచ్) పలు డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు ఓఎస్‌డీ గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ (లేటరల్ ఎంట్రీ)లో రెండు, మూడేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులు ఈ కోర్సులకు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు జూన్ 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 08625-295003, 9399936872, 9866169908, 9010243054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చీరాలలో గవర్నర్ అబ్దుల్ నజీర్


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

చీరాల: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రెండురోజులు గడిపేందుకు కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం చీరాల వాడరేవుకు వచ్చారు. ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ స్వాగతం పలికారు. గవర్నర్‌ను కలుసుకున్నవారిలో ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ నాసరయ్య, ఇతర అధికారులు ఉన్నారు. గవర్నర్ రాక సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మిస్ టీన్ గ్లోబల్ ఇండియా విజేత సంజన



అవార్డు స్వీకరిస్తున్న సంజన వరద

చంద్రగిరి (తిరుపతి జిల్లా): జైపూర్‌లో స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్‌కి చెందిన ది పేజెంట్ స్టార్ మిస్ టీన్ ఇండియా నిర్వహించిన ఈవెంట్ మిస్ టీన్ గ్లోబల్ ఇండియా–2024 టైటిల్‌ను చంద్రగిరికి చెందిన ఆలత్తూరు పావని, సుబ్రమణ్యం కుమార్తె సంజన వరద(18) గెలుచుకున్నారు. ఈ నెల 7–12 వరకు మలేసియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన మిస్ టీన్ గ్లోబల్–2024 పోటీలో భారత్‌కు సంజన వరద ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో ఆమె 1వ రన్నరప్‌గా నిలిచింది. సంజన బెంగళూరులో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ గతంలో జాతీయస్థాయిలో అవార్డును గెలుచుకుంది. ఈ ప్రతిష్టాత్మక విజయంతోపాటు, సంజన వరద సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్స్ అవార్డు, పాపులర్ అవార్డును కూడా అందుకుంది. ఇంకా ఆమె తన పిత్రా ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సహాయం చేయడంలో చేసిన కృషికి అత్యుత్తమమైన దాతృత్వ అవార్డుతో గ్లోబల్ సంస్థ సత్కరించింది. అంతర్జాతీయ స్థాయిలో మిస్ ఇండియా కిరీటాన్ని సాధించడమే తన ధ్యేయమని, దానికోసమే కష్టపడతానని స్టార్ మిస్ టీన్ ఇండియా గ్రహీత సంజన వరద అన్నారు.

ఆకాశయానానికి అందలం



దినదినాభివృద్ధి చెందుతున్న గన్నవరం విమానాశ్రయం | ఈ ఏడాదికాలంలో వన్ మిలియన్ దాటిన ప్రయాణికులు | ఇప్పటికే 54 సర్వీసులు.. భవిష్యత్‌లో మరిన్ని..

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల సంఖ్య పరంగా వన్ మిలియన్ మార్క్‌ను అందుకుంది. ఈ పన్నెండు నెలల కాలంలో ఈ విమానాశ్రయం నుంచి ఏకంగా 10,62,506 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. గత ఆర్థిక ఏడాదితో పోల్చితే ప్రయాణికుల సంఖ్య పరంగా 9.9 శాతం, విమాన సర్వీస్‌ల పరంగా 4.3 శాతం వృద్ధి రేటు నమోదైంది. ఈ విమానాశ్రయ చరిత్రలోనే ఒక మిలియన్‌కుపైగా ప్రయాణికులు రాకపోకలు సాగించడం ఇది మూడోసారి కావడం విశేషం.

గణనీయంగా పెరిగిన ప్రయాణికులు..

రెండో ప్రపంచ యుద్ధ అవసరాల నిమిత్తం బ్రిటిష్ పాలకులు నిర్మించిన ఈ విమానాశ్రయం అంచలంచెలుగా ఎదిగి 2017లో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా గుర్తింపు సాధించింది. అందుకు తగ్గట్లుగా దేశంలోని ప్రధాన పట్టణాలకు విమాన సర్వీస్‌లు అందుబాటులోకి వచ్చాయి. రోజుకు 54 విమాన సర్వీస్‌ల్లో సగటున 3,300 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఫలితంగా 2017–18లో 7,46,392 మంది ఉన్న ప్రయాణికుల సంఖ్య 2018–19కు 11,92,000 మందికి చేరుకుంది. 2019–20 ఆర్థిక ఏడాది చివరిలో కోవిడ్ ప్రభావం కారణంగా ప్రయాణికుల సంఖ్య 11,30,583కు తగ్గడంతో పాటు అనంతరం రెండేళ్ల పాటు విమానయాన రంగం కుదేలైంది. కోవిడ్ పూర్తిగా నియంత్రణలోకి రావడంతో తిరిగి 2022–23లో విమాన రంగానికి పూర్వ వైభవం ప్రారంభమైంది.

విస్తరిస్తున్న విమాన సర్వీస్‌లు..

కోవిడ్ సమయంలో రద్దయిన విమాన సర్వీసులు క్రమంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడికి రోజుకు 22 విమాన సర్వీసులు వస్తుండగా మరో 22 సర్వీసులు ఇక్కడి నుంచి వెళ్తున్నాయి. దేశీయంగా న్యూఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, కడప, షిర్డీ నుంచిఇక్కడికి విమాన సర్వీస్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. అంతర్జాతీయంగా షార్జా–విజయవాడ మధ్య వారానికి రెండు విమాన సర్వీసులు నడుస్తున్నాయి. జూన్ 15 నుంచి ముంబయి–విజయవాడ విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. భవిష్యత్‌లో వారణాసి, కొచ్చి, మలేషియా, సింగపూర్, కువైట్‌కు విమాన సర్వీసులు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.



గత ఆరేళ్లలో ప్రయాణికుల వివరాలు

సంవత్సరం	ప్రయాణికులు	వృద్ధి రేటు
2018-19	11,92,000	59.7
2019-20	11,30,583	4.6
2020-21	5,07215	55.01
2021-22	6,25,131	23.2
2022-23	9,66,383	54.6
2023-24	10,62,506	9.9

పల్నాడుపై పగబట్టిన బాబు

టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి వరుస దాడులు

- నాటి నుంచి నేటి వరకు అదే తీరు
- 2020లో కాజ టోల్‌గేట్ వద్ద పిన్నెల్లిపై దాడి
- విజయవాడ నుంచి రౌడీలను పంపిన బాబు
- ఎన్ని కుట్రలు పన్నినా పుంజుకోలేని టీడీపీ
- అభివృద్ధితో పోటీపడలేకే ఘర్షణలకు ఆజ్యం


వరికపూడిసెల ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిన ప్రదేశం


పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీ

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి/ సాక్షి, నరసరావుపేట : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులు పల్నాడుపై పగపట్టారనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గత కొన్నేళ్లుగా జరుగుతున్న వరుస పరిణామాలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయంగా వరుసగా చావు దెబ్బ తింటున్న తెలుగుదేశం ఎలాగైనా పల్నాడులో ఫ్యాక్షనిజాన్ని ఎగదోసి, వర్గ వైషమ్యాలను పెంచి పోషించడం ద్వారా తన ఉనికిని నిలబెట్టుకునేందుకు శతధా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా వరుస దాడులను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు పల్నాడు ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. మాచర్ల నియోజకవర్గం నుంచి 1999లో టీడీపీ తరఫున పోటీ చేసిన జూలకంటి దుర్గాంబ గెలుపొందారు. 2004లో పిన్నెల్లి లక్ష్మారెడ్డి గెలుపొందారు. 2009, 2012 (ఉప ఎన్నిక), 2014, 2019 ఎన్నికల్లో వరుసగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తున్నారు. కాగా దుర్గాంబ కుమారుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన వరుస ఎన్నికల్లో మాచర్లలో సైకిల్ మూలన పడింది. మునిసిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ పరిస్థితి మరింత దిగజారింది.

టీడీపీ బలోపేతమంటూ...

మాచర్లలో టీడీపీని బలోపేతం చేయాలంటే పిన్నెల్లిని అడ్డు తొలగించడమే మార్గం అని నిర్ధారణకు వచ్చిన చంద్రబాబు.. అందుకు అనుగుణంగా దాడుల ప్రణాళిక రచించారు. అందులో భాగంగా 2020 జనవరి ఏడో తేదీన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మంగళగిరికి సమీపంలోని కాజ టోల్‌ప్లాజా వద్ద టీడీపీ శ్రేణులతో భారీ ఎత్తున దాడి చేయించారు. ఎమ్మెల్యే వాహనాన్ని రాళ్లతో ధ్వంసం చేశారు. గన్‌మెన్ గాయాలపాలయ్యారు. అయితే ఆ రోజు ఎమ్మెల్యే బయటపడ్డారు. ఆ క్రమంలో భాగంగా రౌడీలు, గూండాలనే గుర్తింపున్న బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్నలకు మందీ మార్బలాన్ని తోడిచ్చి విజయవాడ నుంచి 2020 మార్చి 11న మాచర్లకు పంపారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు, స్థానికులు తిరగబడి బొండా, బుద్దా బృందాలను వెంటపడి తరిమేశారు. దీంతో చంద్రబాబు.. ఫ్యాక్షనిజం, హత్యల నేపథ్యమున్న జూలకంటి బ్రహ్మానందరెడ్డిని మళ్లీ రంగంలోకి దింపుతూ 2021 డిసెంబర్‌లో మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. 2010 మార్చి పదో తేదీన ఆత్మకూరు వద్ద ఏడుగురి హత్య కేసులో జూలకంటి ప్రథమ ముద్దాయి. చివరకు తన బాబాయి కుమారుడైన సాంబిరెడ్డి పొలాల్లో దాక్కుని ఉండగా హత్య చేయించారని అందరూ చెప్పుకుంటారు. పోలేపల్లి శివారెడ్డి హత్య కేసులోనూ జూలకంటిది ప్రధాన పాత్ర అని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. మాచర్ల ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి వరుస దాడులు, దొమ్మీలు, హత్యా ప్రయత్నాల పరంపర కొనసాగుతోంది. ఈ ఎన్నికల తర్వాత అది శ్రుతి మించింది. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విచ్చలవిడిగా టీడీపీ దాడులు కొనసాగుతున్నాయి. వినుకొండ, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లోనూ టీడీపీ దాడులకు తెగబడింది. మాచర్ల నియోజకవర్గంలో అశాంతికి ప్రధాన కారణం పోలీసులేనని, ప్రధానంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కారంపూడి సీఐ నారాయణస్వామి తీరు వల్లే గొడవలు పెరిగాయని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బహిరంగా నిప్పులు చెరగడం పల్నాడులో పరిస్థితికి అద్దం పడుతోంది.

పదుల సంఖ్యలో ఊళ్లలో విధ్వంసం

- మాచర్ల రూరల్ మండలంలోని కొత్తూరు, కంబంపాడు, భైరవునిపాడు, వెల్దుర్తి మండలం లోయపల్లి, వెల్దుర్తి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సంపేట, రెంటచింతల మండలం రెంటాల, జెట్టిపాలెం, పాలవాయిగేటు, గోలి, మిట్టగుడిపాడు, కారంపూడి మండలం ఒప్పిచర్ల, కారంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి, దుర్గి మండలం ముటుకూరు, అడిగొప్పల, పోలేపల్లి తదితర గ్రామాల్లో టీడీపీ దాడులు కొనసాగాయి.
- దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లోని కేశానుపల్లి, మాదినపాడు, ఇరిగేపల్లి, తంగెడ, కొత్తగణేశునిపాడు, బ్రాహ్మణపల్లి, పెద అగ్రహారం, జానపాడు, వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల, రెడ్డికొత్తూరు, బొల్లాపల్లి, కొచ్చర్ల, గంటావారిపాలెం, సత్తెనపల్లి నియోజకవర్గంలోని పాకాలపాడు, మాదల, తొండపి, చాగంటివారిపాలెం, నార్నెపాడు, గణపవరం, చీమలమర్రి, రూపెనగుంట్ల, గుండ్లపల్లి, కుంకలగుంట, చేజర్లలోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేశారు.
- నరసరావుపేట టౌన్, దొండపాడు, పమిడిపాడు, పెదకూరపాడు మండలం యర్రబాలెం, లగడపాడు, చంద్రాజుపాలెం, మాదిపాడు, చిలకలూరిపేటలోని అప్పాపురం గ్రామాల్లో టీడీపీ దాడులకు తెగబడింది.

అభివృద్ధిలో పోటీ పడలేకే విధ్వంసం

చంద్రబాబు ఏలుబడిలో అభివృద్ధి ఊసే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పల్నాడులో అభివృద్ధి పరుగెత్తుతోంది. నరసరావుపేట కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటైంది. పిడుగురాళ్లలో మెడికల్ కాలేజీ రూపు దిద్దుకుంటోంది. వరికపూడిసెలకు మోక్షం కలిగింది. గురజాల నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో తాగునీటి వసతి కలిగింది. నరసరావుపేటలో జేఎన్‌టీయూ కాలేజీకి శాశ్వత భవనాలు ఒనగూరాయి. రొంపిచర్ల, మాచర్లలో కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. పులిచింతల ప్రాజెక్టు దిగువన మాదిపాడు వద్ద వంతెన నిర్మాణ పనులు ఆరంభమయ్యాయి. తద్వారా అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, గుంటూరు వరకు, మరోవైపు జగ్గయ్యపేటకు రవాణా వసతి మెరుగు పడనుంది. కొండమోడు–పేరేచర్ల, సాగర్–దావుపల్లి, మాచర్ల– దాచేపల్లి, నకరికల్లు–వాడరేవు జాతీయ రహదారుల పనులు కొనసాగుతున్నాయి. వీటన్నింటి దృష్ట్యా ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ పుంజుకునే పరిస్థితి లేదని గ్రహించిన చంద్రబాబు.. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి గొడవలు చేయిస్తున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రాలో ఓటేసిన కొటియా ఓటర్లు

- ఫలించిన అధికారుల దౌత్యం
- ప్రశాంత వాతావరణంలో పోలింగ్
- రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగం


నేరెళ్లవలస పోలింగ్ బూత్ వద్ద ఈ నెల 13న ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన కొటియా గ్రామాల ఓటర్లు

సాలూరు: ఈ సారి ఎన్నికల్లో కొటియా గ్రూప్ గ్రామాల ఓటర్లు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఓటేయగలిగారు. అధికారుల దౌత్యం ఫలించడంతో ఆంధ్రా, ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల ప్రజలు పోలింగ్‌కు ఓటెత్తారు. ఆంధ్రా, ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల ప్రజలకు ఇటు ఆంధ్రా, అటు ఒడిశా రాష్ట్రాల్లో రెండు చోట్లా ఓటు హక్కు ఉంది. గత ఎన్నికల్లో వారిని ఒడిశా అధికారులు, పోలీసులు అడ్డుకుని తమ రాష్ట్రంలోనే అధికంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చేశారు. ఈ క్రమంలో ఈ గ్రామాల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆంధ్రా వైపు రాకుండా బారికేడ్లు వేసి మరీ ఒడిశాలోనే ఓట్లు వేయించేలా అధికారులు అప్పట్లో ప్రయత్నాలు చేశారు. ఇప్పటి సార్వత్రిక ఎన్నికల్లోనూ దాదాపు అటువంటి పరిస్థితులే పునరావృతమయ్యే అవకాశాలు కనిపించాయి.

ఫలించిన అధికారుల ముందుచూపు...

కొటియా గ్రూప్ గ్రామాల ఓటర్లు ఆంధ్రాలో ఓటు వేసేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతంలో ఆంధ్రా, ఒడిశాలకు సమాన హక్కులు ఉన్నాయని, ఒడిశా అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొంటూ... ఆంధ్రా అధికారులను అడ్డుకుంటున్నారన్న విషయాలను, ఆయా గ్రామాల పరిస్థితులను వివరిస్తూ ఎన్నికల కమిషన్‌కు, ఎన్నికల అధికారులకు లిఖిత పూర్వకంగా లేఖ రాశారు. ఈ ఓటర్లు ప్రశాంతంగా ఓట్లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోని ఎన్నికల అధికారులు రాష్ట్ర ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో కొటియా గ్రూప్ గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించారు. అటు ఒడిశా, ఇటు ఆంధ్రా అధికారులు ఈ గ్రామాలపై చర్చించి ఇరు రాష్ట్రాల్లోను కొటియా గ్రూప్ గ్రామాల ఓటర్లు ఓట్లు వేసే వెసులుబాటు కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. ఎవరికి ఏ రాష్ట్రం నుంచీ ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకున్నారు.

పోటెత్తిన ఓటర్లు..

గంజాయిభద్ర, పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు, సారిక, కురుకూటి పంచాయతీల్లో 21 కొటియా గ్రూప్ గ్రామాల్లో సుమారు 3,600 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో సుమారు 2,200 మంది ఆంధ్రాకు చెందిన నేరెళ్లవలస, శిఖపరువు, సారిక, తోణాం తదితర పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆంధ్రాలో ఓటు హక్కు వినియోగించుకున్న తరువాత ఒడిశాలోనూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి పలువురు ఓటర్లు ఆ రాష్ట్రానికి వెళ్లారు.

కోవిడ్ సమయంలో 'ఊపిరి'పోశారు

- రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ ప్రశంసలు
- నాలుగేళ్లలో 15,376 ఆక్సిజన్ పడకలు పెంపు
- ఆక్సిజన్ పడకల్లో దేశంలో 8వ స్థానంలో ఏపీ
- కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు



సాక్షి, అమరావతి: కోవిడ్ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్సిజన్ పడకలను భారీగా పెంచినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2020 ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో కేవలం 2,643 ఆక్సిజన్ పడకలు మాత్రమే ఉండగా అనంతరం నాలుగేళ్లలో అదనంగా 15,376 ఆక్సిజన్ పడకలను పెంచినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి రాష్ట్రంలో ఆక్సిజన్ పడకల సంఖ్య 18,019కి చేరినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడానికి చాలా వేగంగా ఆక్సిజన్ పడకలను పెంచడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించడానికి పలు చర్యలను చేపట్టింది. ఆక్సిజన్ పడకల సంఖ్య దేశంలో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉంది.

మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్నారు


కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుందని నీతి ఆయోగ్ ప్రశంసించింది. వికసిత్ భారత్ నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు అనుసరించిన ఉత్తమ ఆచరణలను నీతి ఆయోగ్ వెల్లడించింది. మార్చి 2020లో కోవిడ్ వ్యాప్తిని అరికట్టడానికి అంటువ్యాధుల చట్టాన్ని అమలులోకి తెచ్చిన మొదటి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. రాజకీయ నిబద్ధత, వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, టెలిమెడిసిన్ వంటి డిజిటల్ సాంకేతిక సాధనాల వినియోగం, ఫ్రంట్‌లైన్ కార్మికులకు ముందస్తు శిక్షణ, అవగాహన కోసం కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ ప్రచారాలు, నిఘాపై దృష్టి కేంద్రీకరించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో మరణాల రేటు తక్కువగా ఉందని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. రాజకీయ నిబద్ధతతో పాటు అధికారులు, భాగస్వాముల మధ్య సమన్వయం, ముందస్తు స్క్రీనింగ్‌లు, నిఘా, ట్రేసింగ్, టెస్టింగ్, ఐసోలేటింగ్, డిజిటల్ పద్ధతులు ఏపీ ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొంది. క్షేత్ర స్థాయి పరిస్థితిని పర్యవేక్షించడానికి జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడం, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలను అవసరమైన సాధనాలతో సన్నద్ధం చేయడం, కమ్యూనిటీలతో నిమగ్నమవ్వడం, ప్రజల మానసిక, సామాజిక అవసరాలను పరిష్కరించడం, అవసరమైన ఆరోగ్య సేవల పంపిణీకి హామీ ఇవ్వడం ద్వారా కోవిడ్ వ్యాప్తిని అదుపులో ఉంచిందని నీతి ఆయోగ్ పేర్కొంది. దేశంలో అత్యధికంగా కోవిడ్ పరీక్షలను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించినట్లు తెలిపింది.

దేశంలో అత్యధికంగా ఆక్సిజన్ పడకలు గల తొలి పది రాష్ట్రాలు ఇలా

రాష్ట్రం	ఏప్రిల్, 2020	ఫిబ్రవరి, 2024
మహారాష్ట్ర	11,254	1,32,314
తమిళనాడు	3,264	61,074
ఉత్తరప్రదేశ్	3,391	42,221
గుజరాత్	4,061	40,708
పశ్చిమబెంగాల్	8,091	28,267
కర్ణాటక	3,361	27,707
రాజస్థాన్	6,724	20,116
ఆంధ్రప్రదేశ్	2,634	18,019
మధ్యప్రదేశ్	647	17,371
తెలంగాణ	181	13,664

ఇసుక వాహనాలపై టార్పాలిన్ కవర్ తప్పనిసరి


- జీసీకేసీ, ప్రతిమ సంస్థలకు హైకోర్టు ఆదేశం
- ఉల్లంఘనలకు జరిమానా ఎంతో తరువాత తేలుస్తాం
- ఇసుక రవాణా వేళలను కూడా నిర్ణయిస్తాం
- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- టార్పాలిన్ కవర్‌పై తాము కూడా ఆదేశాలిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం
- విచారణ జూలై 31కి వాయిదా



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇసుక రవాణా చేసే ప్రతి వాహనంపైనా టార్పాలిన్ కవర్ కప్పడాన్ని హైకోర్టు తప్పనిసరి చేసింది. ఇసుక రవాణా సమయంలో ఏర్పడుతున్న వాయు కాలుష్యం, రోడ్లపై సంచరించే పాదచారులు, వాహనదారులు పడుతున్న తీవ్ర ఇబ్బందుల నివారణకు హైకోర్టు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఇసుక తవ్వకాల అనుమతులు పొందిన జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రతిమ ఇన్‌ఫ్రా లిమిటెడ్, వారి అసైనీలను ఆదేశించింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎంత జరిమానా విధించాలి, ఇసుక రవాణా చేయాల్సిన సమయాలను తదుపరి విచారణలో తేలుస్తామని తెలిపింది. జరిమానా విషయంలో అడ్వొకేట్ జనరల్, కోర్టు సహాయకారి సలహాలు ఇవ్వొచ్చునంది. తదుపరి విచారణను జూలై 31కి వాయిదా వేసింది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలంటూ హైకోర్టులో దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి విచారణ వరకు పొడిగించింది. టార్పాలిన్ కవర్ విషయంలో తాము కూడా లీజుదారులకు తగిన ఆదేశాలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ కోర్టుకు నివేదించారు. ఇసుక రవాణా విషయంలో హైకోర్టు ఎటువంటి షరతులు విధించినా పాటిస్తామని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాల విషయాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కే వదిలేయాలని ఏజీ శ్రీరామ్, అమికస్ క్యూరీ నోర్మా అల్వరీస్ విన్నవించారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం, ఇసుక విషయంలో మరికొన్ని అంశాలపై విచారణ జరగాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఇసుక రవాణాకు వేళలు నిర్ణయించాల్సిన అవసరం ఉందని అమికస్ క్యూరీ తెలిపారు. రవాణా ప్రాంతాల్లో కాలుష్యం స్థాయిలను పర్యవేక్షించి, పరిమితులను దాటితే ఆ ప్రాంతాల్లో ఇసుక వాహనాల రాకపోకలను తగ్గించాలని, అవసరమైతే రవాణా మార్గాన్ని మార్చాలని సూచించారు.

చెన్నై విమానాశ్రయంలో రూ.20 కోట్ల కొకైన్ స్వాధీనం

- రూ.2 కోట్ల విలువైన మత్తు మాత్రలు కూడా..
- మొత్తం ఆరుగురి అరెస్టు


ఉన్ని దుస్తుల్లో దాచిన కొకైన్

అన్నానగర్ (చెన్నై): దుబాయ్ నుంచి చెన్నైకి అక్రమంగా తరలిస్తున్న రూ.20 కోట్ల విలువైన కొకైన్, రూ.2 కోట్ల విలువ గల మత్తు మాత్రలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళుతున్న విమానంలో భారీగా మత్తు పదార్థాలు తరలిస్తు న్నట్లు చెన్నై జోన్ సెంట్రల్ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ డైరెక్టర్ అరవిందన్‌కు శుక్రవారం సమాచారం అందింది. దీంతో దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్, యాంటీ నార్కోటిక్స్ విభాగం అధికారులు తనిఖీ చేశారు. బొలీవియాకు చెందిన ఓ యువతి బ్యాగ్‌లో ఉన్ని దుస్తుల లోపల దూది మధ్య డ్రగ్స్‌ను దాచినట్లు గుర్తించారు. ఆమె నుంచి రూ. 20 కోట్ల విలువైన కిలో 800 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బొలీవియా యువతితోపాటు ముంబైలో నివసిస్తున్న బ్రెజిల్‌కు చెందిన మహిళ సహా మరో ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. అదేవిధంగా నెదర్లాండ్స్ నుంచి బెంగళూరు, పుదుచ్చేరి చిరునామాలతో రెండు పార్శిళ్లు కస్టమ్స్ విభాగానికి చెందిన పోస్టాఫీసుకు వచ్చాయి. ఆ పార్శిళ్లను కస్టమ్స్, నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ అధికారులు తనిఖీ చేశారు. అందులో రూ.2 కోట్ల విలువైన కిలో 400 గ్రాముల మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి బెంగళూరులో ఉంటున్న ఇద్దరు నైజీరియన్ యువకులను అరెస్టు చేశారు.

8న హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ



చార్మినార్/దూద్‌బౌలి (హైదరాబాద్): మృగశిర కార్తె సందర్భంగా ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయడానికి బత్తిని కుటుంబ సభ్యులు అంతా సిద్ధం చేస్తున్నారు. మృగశిర కార్తె ప్రవేశం రోజైన జూన్ 8వ తేదీన చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని శుక్రవారం బత్తిన అనురీత్‌గౌడ్, గౌరీ శంకర్‌గౌడ్‌లు మీడియాకు తెలిపారు. చేప ప్రసాదం తయారీలో భాగంగా జూన్ 7వ తేదీన ఉదయం 11 గంటలకు దూద్‌బౌలీలోని స్వగృహంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అనంతరం 8వ తేదీన ఉదయం ఇంట్లోనే తమ కుటుంబ సభ్యులందరూ చేప ప్రసాదాన్ని స్వీకరించిన అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలించి ప్రసాదం పంపిణీ చేస్తామని వివరించారు.

సర్వశక్తిమంతుడైన పరమాత్మ నుండే ప్రాణం ఉత్పన్నమవుతుంది.
అలాగే మనస్సు, సకలేంద్రియాలు : ఆకాశం, వాయువు, తేజస్సు,
నీరు, భూమి– అనే పంచ మహాభూతాలు ఉత్పన్నమవుతాయి.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి
శనివారం, 18 మే 2024

చైనా-రష్యా కరచాలనం!

తాము చైనాను పీపుల్స్ రిపబ్లిక్‌గా గుర్తించి 75 యేళ్లు అవుతుండగా... ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధంలో పట్టు సాధించిన ఛాయలు కనబడుతుండగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బీజింగ్‌లో అడుగుపెట్టారు. రెండు రోజుల పర్యటనలో ఇరు దేశాలమధ్యా వివిధ ఒప్పందాలు కుదరటంతోపాటు సంయుక్త ప్రకటన కూడా విడుదలైంది. ప్రచ్ఛన్నయుద్ధ కాలంనాటి మనస్తత్వాన్ని విడనాడాలని రెండు దేశాలూ అమెరికాకు హితవు పలికాయి. ప్రాంతీయ భద్రత, రక్షణ బేఖాతరు చేస్తూ కొన్ని బృందాలకు మద్దతుగా నిలిచే వినాశకర విధానాలకు స్వస్తి పలకాలని సూచించాయి. పుతిన్ వరసగా ఆరోసారి ఎన్నికై దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొమ్మిది రోజులవుతోంది. 2030 వరకూ ఆయనదే రాజ్యం. అయితే ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచం మునపట్లా లేదు. ఆంక్షల చక్రబంధంలో బిగించి రష్యాను పాదాక్రాంతం చేసుకోవాలని అమెరికా, దానికి మద్దతుగా నిలిచిన యూరొప్ దేశాలూ పట్టుదలగా వున్నాయి. పర్యవసానంగా రష్యా ఆర్థిక వ్యవస్థ బలహీనపడి వణుకుతోంది. ఆ దేశంతో ఎవరు లావాదేవీలు సాగించినా చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరిస్తోంది. రెండేళ్ల క్రితం రష్యా ఉక్రెయిన్‌పై దండెత్తటానికి కొన్ని రోజులముందు రష్యా–చైనాల మధ్య 'హద్దుల్లేని వ్యూహాత్మక ఒప్పందం' కుదిరింది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ రెండు దేశాలూ ఇప్పటికీ 'హద్దులెరగని' బంధాన్ని కొనసాగిస్తాయా... రష్యాపై అమలవుతున్న ఆంక్షలకూ, అమెరికా హెచ్చరికలకూ చైనా తలొగ్గుతుందా అనే ప్రశ్నలు గత కొన్ని రోజులుగా పాశ్చాత్య ప్రపంచాన్ని వేధిస్తున్నాయి. పుతిన్‌కు బీజింగ్‌లో దక్కిన ఘనస్వాగతమూ, ఇరు దేశాల ఉమ్మడి ప్రకటనా, ఉభయ దేశాధినేతల ప్రసంగాలూ గమనించాక అమెరికా, యూరొప్ దేశాలకు అసంతృప్తే మిగిలి వుంటుందన్నది వాస్తవం.

అయితే 75 ఏళ్లక్రితం కొత్తగా ఆవిర్భవించిన చైనాను గుర్తించిననాటి సోవియెట్ యూనియన్‌కూ, ఇప్పటి రష్యాకూ పోలికే లేదు. అప్పట్లో అది అమెరికాతో 'నువ్వా నేనా' అన్నట్టు తలపడే తిరుగులేని శక్తి. అనంతర కాలంలో ఆ దేశం కుప్పకూలింది. చీలికలు పేలికలైంది. ఈ మూడు దశాబ్దాల్లో గత వైభవాన్ని సంతరించుకోవాలని చేసిన ప్రయత్నాలు ఎంతో కొంత ఫలిస్తున్న వైనం కనబడుతుండగానే క్రిమియా ఆక్రమణ, ఆ తర్వాత ఉక్రెయిన్‌పై దురాక్రమణ యుద్ధం రష్యాను సంక్షోభంలోకి నెట్టాయి. చైనా మాదిరే భద్రతామండలిలో రష్యా శాశ్వతసభ్య దేశమే కావొచ్చు. కానీ ఇప్పుడది దాదాపు ఒంటరి. చెప్పాలంటే చైనాకు జూనియర్ భాగస్వామి. తమది కూటమి కాదని, తమ స్నేహం వెనకున్న ఉద్దేశం దశాబ్దాల బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లటమేనని ఉభయ దేశాలూ చెబుతున్నాయి. కానీ ఆ రెండు దేశాల ఉమ్మడి ప్రత్యర్థి అమెరికాయేనని ప్రపంచానికంతకూ తెలుసు. డ్రోన్‌లు, క్షిపణి సాంకేతికత, ఉపగ్రహ నిఘా నివేదికలు, ఫైటర్ జెట్లకు పనికొచ్చే విడిభాగాలు, మైక్రోచిప్‌లు సరఫరా చేస్తూ దురాక్రమణ యుద్ధానికి చైనా ఆజ్యం పోస్తున్నదని అమెరికా అనుమానం. ఈ చైనా సంస్థలను నిషేధ జాబితాలో పెడతామని హెచ్చరిస్తోంది. ఇది ఎంతోకొంత పనిచేసింది. చైనా బ్యాంకులు రష్యా సంస్థలతో మొన్న మార్చినుంచి లావాదేవీలు బాగా తగ్గించాయి. పర్యవసానంగా ఇటీవల వాణిజ్యం మందగించింది. దీన్ని మళ్లీ యథాస్థితికి తీసుకెళ్లటం పుతిన్ ప్రాధాన్యాంశాల్లో ఒకటి. అందుకే ఆయన వెంట భారీ ప్రతినిధి బృందం బీజింగ్ వెళ్లింది. గత ఆర్థిక సంవత్సరం గణాంకాలు గమనిస్తే చైనాతో రష్యా వాణిజ్యం రికార్డు స్థాయిలో 24,000 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యే నాటికున్న వాణిజ్యంతో పోలిస్తే ఇది 60 శాతం అధికం. రష్యా ఎగుమతుల్లో చైనా వాటా 30శాతం కాగా,దాని దిగుమతుల్లో చైనా వాటా 40శాతం. ఆంక్షల బారిన పడకుండా వ్యాపార, వాణిజ్యాలను ఎలా కొనసాగించాలన్నదే ప్రస్తుతం రష్యా, చైనాల ముందున్న ప్రశ్న. ఇంధనం, పరిశ్రమలు, వ్యవసాయం, నిర్మాణ రంగాల్లో తమకు సహకరించాలని పుతిన్ అర్థించారు. అలాగే ఆంక్షల తర్వాత ఎలక్ట్రానిక్ ఉపకరణాల నుంచి కార్ల వరకూ అన్ని మార్కెట్లనుంచీ పాశ్చాత్య దేశాలు తప్పుకున్నాయి. ఆ లోటును చైనా తీరుస్తోంది. దాన్ని మరింత పెంచాలని ఉభయ దేశాలూ నిర్ణయించాయి. డాలర్లలో కాక తమ తమ కరెన్సీల్లోనే లావాదేవీలు జరుపుకుంటున్నాయి. జార్ చక్రవర్తుల కాలం నుంచీ పాశ్చాత్య దేశాలతో రష్యాకున్న వాణిజ్య బంధం ఇప్పుడు పూర్తిగా స్తంభించిపోయింది. ఇన్నాళ్లూ యూరొప్ దేశాలకు వెళ్లిన సహజవాయు ఎగుమతుల్ని చైనాకు మళ్లించేందుకు పుతిన్ సిద్ధపడినా ప్రస్తుతానికైతే ఒప్పందం ఖరారు కాలేదు.

వ్లాదిమిర్ సోరోకిన్ అనే రచయిత 2028 నాటికి రష్యా పోకడలెలా వుంటాయో చిత్రిస్తూ 2006లో 'డే ఆఫ్ ఆప్రిష్నిక్' అనే నవల రాశాడు. అప్పటికల్లా చైనా సాంకేతికతే అన్ని రంగాల్లోనూ వర్ధిల్లుతుందనీ, కానీ జార్ సామ్రాజ్యానికి ఆద్యుడిగా భావించే మధ్యయుగాలనాటి మాస్కో ప్రిన్స్ ఇవాన్‌ను తలపించే అత్యంత క్రూరమైన పాలన సాగుతుందనీ ఆ కాల్పనిక ఇతివృత్తం చెబుతుంది. పుతిన్ ఎలా పరిణమిస్తారన్న సంగతలావుంచి చైనా సాంకేతికతలు ఇప్పటికే రష్యాకు వచ్చాయి. చైనా కార్లు రష్యా రోడ్లపై పరుగులెడుతున్నాయి. ప్రపంచం గతంలో మాదిరి లేదని, ఎవరినీ ఎవరూ శాసించలేరని అమెరికా, పాశ్చాత్య దేశాలు గుర్తించాలి. ఉద్రిక్తతలు ఉపశమింపజేసేందుకూ, శాంతి సాధనకూ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించటం, రాజీకి సిద్ధపడటం అవసరమని ఇరు పక్షాలూ తెలుసుకోవాలి. అందుకు భిన్నమైన వినాశకర మార్గంలో పోతామంటే ప్రపంచ ప్రజానీకం క్షమించదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.దశమి ఉ.11.09 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తర రా.12.19 వరకు, తదుపరి హస్త వర్జ్యం: ఉ.5.41 నుండి 7.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.31 నుండి 7.08 వరకు, అమృతఘడియలు: సా.4.14 నుండి 6.01 వరకు.

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

కోవిడ్ టీకాను ఎలా చూడాలి?

విశ్లేషణ



శైలజా చంద్ర

'ఆస్ట్రా–జెనెకా' తన కోవిడ్–19 టీకాలను ప్రపంచవ్యాప్తంగా ఉపసంహరించుకోవడం చర్చనీయాంశం అయింది. ఆ టీకా వల్ల రక్తం గడ్డకట్టడం లాంటి దుష్ప్రభావాలు అరుదుగానైనా కలగడమే ఆ నిర్ణయానికి కారణం. ఇదే టీకాను 'కోవిషీల్డ్' పేరుతో ఇండియాలో కోట్లాది డోసులు వేయడం సహజంగానే ఆందోళన కలిగిస్తుంది. కానీ ఈ టీకా కేవలం పది నెలల్లోనే ఆమోదం పొందిన వాస్తవాన్ని విస్మరించకూడదు. మహమ్మారులు దాడి చేసినప్పుడు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజారోగ్య నిపుణులు, ప్రభుత్వాలు ప్రమాదంలో ఉన్న జనాభాను కాపాడుకోవాల్సి ఉంటుంది. భారత్ లాంటి పెద్ద దేశంలో ఆసుపత్రుల్లో పడకలు కూడా అందుబాటులో లేని కాలంలో, ఈ టీకా లక్షలాది మందిని చనిపోకుండా నిరోధించిందని మరిచిపోరాదు.

ఆంగ్లో–స్వీడిష్ ఔషధ తయారీదారు అయిన 'ఆస్ట్రా–జెనెకా' తన కోవిడ్–19 టీకాలను ప్రపంచవ్యాప్తంగా ఉపసంహరించుకోవడం ప్రారంభించింది. భారతదేశంలో 'కోవిషీల్డ్' పేరుతో వచ్చిన ఈ టీకాను ఆస్ట్రా–జెనెకా సహకారంతో పుణెకు చెందిన 'సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' తయారు చేసింది. దేశ వ్యాప్తంగా దాదాపు 175 కోట్ల టీకా డోసులను అందించారు. టీకాల ఉపసంహరణకు 'భిన్న రకాల వేరియంట్లకు బహుళ టీకాల లభ్యత వల్ల కాలం చెల్లిన టీకాలు మిగిలిపోవడం' కారణమని ఆస్ట్రా–జెనెకా సంస్థ పేర్కొంది. సరళంగా చెప్పాలంటే, తీవ్రమైన దుష్ప్రభావాల కేసులకు సంబంధించిన కోర్టు విచారణలు, కంపెనీ ఎదుర్కొంటున్న 100–మిలియన్ పౌండ్ల(సుమారు వెయ్యి కోట్ల రూపాయలు) మేరకు క్లాస్ యాక్షన్ వ్యాజ్యం(ఎక్కువమందికి సంబంధించిన కేసు) నేపథ్యంలో ఇది కేవలం వ్యాపార నిర్ణయం.

కోవిడ్–19 టీకా 'చాలా అరుదైన సందర్భాల్లో, టీటీఎస్‌కు కారణం కావచ్చు' అని కంపెనీ, ఫిబ్రవరిలో అంగీకరించినట్లు నివేదించబడింది.'టీటీఎస్' అంటే థ్రాంబోసైటోపెనియా సిండ్రోమ్‌తో థ్రాంబోసిస్. ఇది శరీరంలో ప్లేట్‌లెట్లు పడిపోవడానికీ, రక్తం గడ్డకట్టడానికీ కారణమవుతుంది. ఊపిరి ఆడకపోవడం, ఛాతీ నొప్పి, తలనొప్పులు, సులభంగా గాయపడటం వంటి లక్షణాలు దీంట్లో ఉంటాయి. బ్రిటన్‌లో చాలా మంది వ్యక్తులు తాము వివిధ రకాల గాయాలతో బాధపడుతున్నామని పేర్కొన్నారు. భారతదేశంలో కూడా, కొన్ని కుటుంబాలు ఆస్ట్రా–జెనెకాపై, సీరమ్ సంస్థపై చట్టపరమైన చర్యలను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాలు ఏమి చేయాలని ప్రజారోగ్యం నిర్దేశిస్తుంది, భారతదేశంలో దీనికి ఏదైనా భిన్నంగా చేయగలిగి ఉండేవాళ్లమా అనేదాని గురించి నేను ఆలోచిస్తున్నాను. మాజీ ప్రజారోగ్య పాలనాధికారిగా నా అభిప్రాయాలను ఇచ్చే ముందు, ఇద్దరు అత్యంత పరిజ్ఞానం ఉన్న వ్యక్తులతో మాట్లాడాను.

నేను మొదటగా భారతదేశ ప్రముఖ మైక్రోబయాలజిస్టు, వైరాలజిస్టులలో ఒకరైన డాక్టర్ గగన్‌దీప్ కాంగ్‌తో మాట్లాడాను. ఆమె సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలోని ట్రాన్స్‌లేషనల్, హెల్త్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు నాకు తెలుసు. ఆమె అభిప్రాయం మేరకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2021 మార్చిలో ఆస్ట్రా–జెనెకా టీకా టీటీఎస్ దుష్ప్రభావం కలిగించే ప్రమాదం గురించి ప్రకటించింది. 2021 మే నాటికి దానిని ధ్రువీకరించింది. 2021 అక్టోబర్‌లో 'కోవిషీల్డ్'కు సంబంధించిన ప్రమాద కారకాన్ని చేర్చడానికిగానూ సీరమ్ సంస్థ తన టీకా లేబుల్‌ను నవీకరించింది. టీటీఎస్ వల్ల, కొందరు రోగులు దుష్ప్రభావాలను ఎదుర్కొన్నట్లు, కొన్ని సందర్భాల్లో చివరికి మరణాలు సంభవించాయని మనకు పొడికథలుగా మాత్రమే తెలుసు. అలాంటప్పుడు టీకాను కొనసాగించడం లేదా కొనసాగించకపోవడం వల్ల కలిగే నష్టం ఏమిటి? మనకు ప్రత్యామ్నాయం ఉందా?



గగన్‌దీప్ కాంగ్ మనకు తెలియని వాటి గురించి వివరించారు. ''ప్రమాదం వయస్సుపై ఆధారపడి ఉంటుంది. ఇది భౌగోళికతపై కూడా ఆధారపడి ఉండొచ్చు. భౌగోళికత సమస్యను రోటావైరస్ టీకాల కోసం మనం చేసినట్లుగా ఫార్మావిజిలెన్స్ ద్వారా మాత్రమే లెక్కించవచ్చు. నిష్క్రియాత్మకంగా అంటే ప్రజలు సమస్యను నివేదించే వరకు వేచి ఉండటం మరొక మార్గం. ఈ విధానంలో ఉన్న సమస్య ఏమిటంటే, టీకా వేసిన మొదటి కొన్ని గంటలలో లేదా రోజులలో దుష్ప్రభావం చూపకుంటే అది టీకాతో సంబంధం ఉన్నదిగా గుర్తించబడకపోవచ్చు.

ప్రమాదం–ప్రయోజనం నిష్పత్తి, ముఖ్యంగా డెల్టా వేవ్ విషయంలో చూస్తే, ప్రయోజనమే ఎక్కువగా ఉండింది; ముఖ్యంగా వృద్ధులకు ఎక్కువగా, యువకులకు కొంత తక్కువగా. పాశ్చాత్య దేశాలను అనుసరించి, 40 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారికి కోవిషీల్డ్‌ను వేయడం నిలిపివేసి ఉంటే, మన ప్రత్యామ్నాయం 'కోవాక్సిన్' అయి వుండేది. ఇది తక్కువ సరఫరాలో ఉంది. ఫలితంగా యువకులకు రోగనిరోధక శక్తి విస్తరించేది. భారతదేశానికి నిర్దిష్టంగా టీటీఎస్ డేటా లేనందున, పర్యవేక్షించడం కష్టంగా ఉండేది'' అని ఆమె చెప్పారు.

న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన సెంటర్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కృష్ణన్ దీనిని విభిన్నంగా చెప్పారు: ''అరుదైన దుష్ప్రభావం ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని అడ్డుకోలేకపోవడానికి భారీస్థాయి ప్రజారోగ్య ప్రయోజనం కారణమైంది. దుష్ప్రభావాలపై దృష్టి కేంద్రీకరించడం వలన టీకా వేసుకోవాలా వద్దా అనే సంకోచం ఏర్పడుతుంది. అంటే మనం ఆ దుష్ప్రభావాలను దాచిపెట్టాలని కాదు... వెనక్కి చూసుకుంటే, మెరుగైన, మరింత సూక్ష్మమైన, సమతుల్యమైన సమాచారం సహాయపడి ఉండేదని చెప్పడం మెరుగు. అరుదైన దుష్ప్రభావాలను ఎదుర్కొన్న వారికి పరిహారం కోసం కూడా మనం ప్లాన్ చేసి ఉండవచ్చు.''

దుష్ప్రభావాల క్లెయిమ్‌లను పరిశీలించే ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక పీడకలగా మారేదని చెప్పడానికి నాకు ఎలాంటి సంకోచమూ లేదు. టీకాలు అత్యంత వేగంగా పూర్తి చేయడానికి అవి పూర్తిగా కట్టుబడి ఉన్నాయి. మహమ్మారి దాడి చేసినప్పుడు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజారోగ్య నిపుణులు, ప్రభుత్వాలు ప్రమాదంలో ఉన్న జనాభాను కాపాడుకోవాల్సి ఉంటుంది. అత్యంత హాని కలిగే వారికి ప్రాధాన్యతనిచ్చి టీకాలు వేసేలా చూసుకోవాలి. భారతదేశంలో ఆసుపత్రుల్లో పడకలు అందుబాటులో లేని కాలంలో వేలాది మంది ప్రజలు చనిపోకుండా టీకాలు నిరోధించాయి.

ఇక టీకాను అభివృద్ధి చేయడానికి తీసుకునే సాధారణ సమయం పదేళ్లు. దీనికి భిన్నంగా ఆస్ట్రా–జెనెకా టీకా కేవలం పది నెలల్లోనే ఆమోదం పొందిన వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. దానిని తప్పక గుర్తించి, గౌరవించాలి. ఇది కచ్చితంగా లక్షలాది మందిని తీవ్రమైన అనారోగ్యాలకు గురికాకుండా లేదా చనిపోకుండా నిరోధించింది. తీవ్రమైన దుష్ప్రభావాల గురించి బాగా అర్థం చేసుకుని, నిర్ణయాలు తీసుకున్నవారు పట్టించుకుని ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ అంతేనా? ఏదైనా నిపుణుల సంఘం ఇచ్చిన ప్రతికూల సలహా దేన్నయినా అణచిపెట్టారా? రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకోవాల్సిన ముఖ్యమైన, చర్య తీసుకోదగిన సమాచారం ఏదైనా ఉండిందా? అలా కాదంటే మాత్రం వ్యాక్సిన్ డ్రైవ్‌ను వేగవంతం చేయడానికి ప్రయోజనపు సమతూకం స్పష్టంగా అనుకూలంగా ఉంది.

భారతదేశంలోని భారీ జనాభాకు టీకాలు వేయకుండా ఆటంకం కలిగించే శక్తిమంతమైన టీకా వ్యతిరేక ఉద్యమాన్ని మనం అదృష్టవశాత్తూ చూడలేదు. రద్దీగా ఉండే నగరాలు, ఆరు లక్షలకు పైగా గ్రామాలలో ప్రజలు చెదిరిపోయి ఉన్నందున ప్రజారోగ్య స్పందన అనేది సహజంగానే పెద్ద ఎత్తున వ్యాధిగ్రస్తులను మరియు మరణాలను నిరోధించడానికి ఉద్దేశించారు. అందులో చర్చకు తావులేదు. కుటుంబాలు, సంఘాల ఎంపికకు టీకాను వదిలేసివుంటే, లక్షలాదిమందిని ప్రమాదంలో పడేసేది. వయసు లేదా భౌగోళికతపై లేని డేటాను వెతుకుతూ పోతే, టీకా కార్యక్రమం పట్టాలు తప్పివుండేది. ఒక్కో జిల్లాలో దాదాపు 20 లక్షల జనాభా కలిగిన భారతదేశంలోని దాదాపు 800కు పైగా జిల్లాల్లోని జిల్లా ఆరోగ్య కార్యకర్తలు అప్పటికే తీవ్ర పని ఒత్తిడిలో ఉన్నారు.

కొన్ని సమయాల్లో, మంచి (ఈ సందర్భంలో, దుష్ప్రభావాలను పర్యవేక్షించడం) అనేది కూడా గొప్ప శత్రువుగా (లక్షలాదిమందికి టీకాలు అందని అపాయం ఉండటం) మారవచ్చు. భారతదేశానికి సంబంధించి, ఈ క్షణపు వాస్తవం ఇది!

వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి; మాజీ ప్రధాన కార్యదర్శి ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



బిగ్ ఆద్మీ పార్టీ



ఆమ్ ఆద్మీ పార్టీ ఒక రియాలిటీ టీవీ షో అయిపోయింది. ప్రతి రోజూ బిగ్ బాస్ కొత్త ఎపిసోడ్ చూస్తున్నట్టుగా ఉంది.

– కార్తికేయ తన్నా, రచయిత

మారిన ధోరణి



నార్త్ ఇండియాలో ఒకప్పుడు ఏ 5–స్టార్ హోటల్‌కు వెళ్లినా నేను కావాలని హిందీలోనే మాట్లాడేవాడిని. అయినా తరచుగా వాళ్లు ఇంగ్లిష్‌లోనే బదులిచ్చేవారు. కానీ ఈ మధ్య వాళ్లు చాలా సౌకర్యంగా హిందీలో జవాబిస్తున్న ధోరణిని గమనించాను. ఏమైనా మార్పు వచ్చిందా?

– సంక్రాంత్ సాను, ఆంట్రప్రెన్యూర్

ఇంత ఘోరమా?



దేవుడా! ప్రతిరోజూ తిండి, నీళ్ల కోసం పోరాటమే. ఏడు నెలల కనికరం లేని నరమేధం తర్వాత మా జీవితాలు ఆరిపోతున్నాయి. ఇక నా వల్ల కావడం లేదు. నేను ఎప్పటికీ పుట్టకపోతే బాగుండు అనిపిస్తోంది.

– మొహమ్మద్ ఎ. మన్‌స్రా, గాజా గొంతుక

పెద్దాళ్లు...



ఈ భూగ్రహానికి వచ్చి 23 ఏళ్లు అయిన తర్వాత నేను గ్రహించినది ఏమంటే, త్వరగా నిద్రలేవడమే ప్రతిదానికీ పరిష్కారం.

– మీనాల్ జైన్, ఫెసిలిటేటర్

ఆగిన పత్రిక



'రీడర్స్ డైజెస్ట్' మరి లేదు. (బ్రిటన్‌కు చెందిన రీడర్స్ డైజెస్ట్ మ్యాగజైన్ 86 ఏళ్ల తర్వాత ఆగిపోయిందని వార్త.) అంత పెద్దగా తెలియని దాని కజిన్ 'హ్యూమన్ డైజెస్ట్'కు ఏమైంది? బహుశా అది కూడా ఆగిపోయి ఉంటుంది.

– అర్ణబ్ రే, స్క్రీన్ రైటర్

ఇదెందుకు కాలేదో!



ఎన్నో ప్రపంచ యుద్ధాలను ఆపిన మనిషి మణిపూర్ హింసను మాత్రం ఎందుకో ఆపలేకపోయారు. అదీ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నప్పటికీ. ఏడాదిగా అలాగే ఉంది పరిస్థితి. (రంజాన్ సమయంలో గాజాలో యుద్ధం ఆపానని నరేంద్ర మోదీ అన్న నేపథ్యంలో.)

– సుశాంత్ సింగ్, సీనియర్ ఫెలో

అసలు రహస్యం



ఇజ్రాయెల్ ఇప్పటివరకూ రఫాలో 70 సొరంగాలను కనుక్కుంది. అందులో 50 వరకు ఈజిప్టు సరిహద్దును దాటుతాయి. ఈ విషయాన్నే ఈజిప్ట్ దాస్తోంది. ఈ సొరంగాల నుంచే ఆయుధాలు, మందుగుండు సామగ్రి గాజాకు దొంగరవాణా అయ్యాయి. ఈజిప్ట్, బైడెన్(అమెరికా అధ్యక్షుడు) రఫా ఆక్రమణకు వ్యతిరేకమంటే ఆశ్చర్యం లేదు!

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

చిత్రమైన కాలం



నాలుగేళ్ల క్రితం బ్రిటన్‌లో ఈ రోజు: ఒక ఇంట్లోకి వారి ఆయానో, పనిమనిషో వెళ్లడానికి అనుమతి ఉండేది. కానీ అదే ఎంతో దగ్గరి బంధువులు వేరే చోట ఉంటే వాళ్లు రావడానికి మాత్రం అనుమతి ఉండేది కాదు. ఆధునిక చరిత్రలో కోవిడ్ కాలం విచిత్రమైన, అర్థం పర్థంలేని ఎన్నో వెర్రి నియమ నిబంధనలను తెచ్చింది.

– జేమ్స్ మెల్‌విల్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

ఇన్ బాక్స్

అభ్యుదయ సాహితీ నయాగరా

అభ్యుదయ సాహిత్యంలో గొప్ప రచయితగా, వక్తగా పేరుగాంచినవారిలో చందు సుబ్బారావు ఒకరు. వృత్తిరీత్యా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భూభౌతిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ విధులు నిర్వహించారు. వృత్తి సంబంధమైన పరిజ్ఞానంతో కొన్ని అపురూపమైన శాస్త్రీయ విజ్ఞాన రచనలు చేశారు. అలాగే తాను నమ్మిన ప్రగతిశీల భావజాలంతో ఎన్నో రచనలు చేశారు. అన్నిటికి మించి బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్రను అత్యున్నతంగా తెలుగులోకి అనువదించారు (వసంత అబాజీ దహాకే సంపాదకత్వంలోని ఆంగ్ల రచన).



చందు సుబ్బారావు

గుంటూరు జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంతో మంచి అనుబంధమున్న కుటుంబంలో జన్మించారు. మేనమామ, సుప్రసిద్ధ నాటక, సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ ప్రభావంతో రచనా వ్యాసంగం ప్రారంభించి నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్నారు. ఎంతటి నిరాశావాదులనైనా ఉత్తేజితుల్ని చేసి, కార్యోన్ముఖుల్ని చేసేలా సాగే చందు సుబ్బారావు ప్రసంగం తీరుతెన్నులు వినవలసిందే. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సారథిగా ఆచార్య చందు చేసిన సాహిత్య, సాంస్కృతిక సేవ అంతా ఒక ఎత్తు, ఆధునిక నాటక రంగానికి ఎనలేని సేవ చేసిన డా॥ కేవీ గోపాలస్వామి శతజయంత్యుత్సవ కమిటీ కన్వీనర్‌గా ఆయన చేసిన కృషి మరో ఎత్తు. విశాఖ నగర 'అరసం' శాఖ అధ్యక్షునిగా ఆచార్య చందు సుబ్బారావు ఆధ్వర్యంలో అరసం అరవై ఏళ్ళ సభ నిర్వహించారు. బహుశా ఆ సభలోనే చివరిగా ప్రసిద్ధ రచయిత ఆవంత్స సోమసుందర్, దిగంబర కవి జ్వాలాముఖి పాల్గొని 'అభ్యుదయ సాహిత్యం– కవులు, రచయితల కర్తవ్యం' గురించి చిరస్మరణీయమైన ప్రసంగాలు చేశారు. ఆ తర్వాత అరసం విశాఖ శాఖకు అధ్యక్షునిగా అనేక సాహితీ సభలు దిగ్విజయంగా నిర్వహించారు.

2016లో ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ కల్చరల్ ట్రస్టు స్థాపించారు. ప్రతి ఏటా ఉత్తమ సాహితీవేత్తకు ఆచార్య చందు పేరిట పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావుకు ఈ నెల 18వ తేదీన దీనిని ప్రదానం చేస్తున్నారు.

– బి. వి. అప్పారావు, విశాఖపట్టణం
(నేడు ఆచార్య చందు సుబ్బారావు జన్మదినం)

వేషాల మురిపెం తీర్చే జాతర

సందర్భం



నాగపట్ల భక్తవత్సల రెడ్డి

గంగమ్మ జాతర అంత జాతర, తిరుమల కొండంత కొండ లేవన్నది స్థానికుల మాట. తిరుపతిలో ఏటా చిత్రి నెల నాలుగో మంగళవారం చాటింపు వేస్తారు. చాటింపు అంటే ప్రారంభం. తర్వాతి మంగళవారం రాత్రి గంగమ్మ నిల్చిన బుధవారంతో జాతర పూర్తవుతుంది. అయితే ఈ ఏడాది ఎన్నికల వల్ల ఒకవారం ఆలస్యంగా మే 14న జాతర ప్రారంభమయ్యింది. వారంపాటు వివిధ వేషాలతో, ఆచారాలతో, మొక్కుబడులతో జాతర జరుగుతుంది. తిరుపతిలో పల్లెవీధి గంగమ్మ, మంచాలవీధి గంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక గంగమ్మ, వేషాలమ్మ ఉన్నా జాతర మాత్రం తాతయ్యగుంట, తాళ్లపాక గంగమ్మలకి సంబంధించింది. తిరుపతి చుట్టూ ఉన్న చాలా గ్రామాల్లో గంగ జాతర్లు జరిగేవి.



'శ్రీ తాతయ్యగుంట గంగమ్మ... కంటకుడైన పాలెగాణ్ణి చంపిన శక్తి స్వరూపిణి. కోరిన కోర్కెలు తీర్చే దేవత. చల్లగా చూసే తల్లి. అనుకున్నది తీరుస్తుంది. ఊరిలో అమ్మోరు అవీ లేకుండా చేస్తుంది. పిలిస్తే పలికే దైవం. పెదగంగమ్మ (తాళ్లపాక గంగమ్మ) క్షమిస్తుంది. చిన్న గంగమ్మ (తాతయ్యగుంట గంగమ్మ) మహిమ గలది, మొక్కుబడి తీర్చకపోతే శిక్షిస్తుంది. పెద్దామె చూపుల గంగమ్మ. చిన్నామె మేపుల గంగమ్మ. వేషాలమ్మ మంచిది. మంచినీళ్ల గుంటకాడి గంగమ్మ (తాతయ్యగుంట గంగమ్మ) మంచిది కాదు' – ఇవీ గంగమ్మ తల్లి మీద భక్తులకున్న ఆరాధనాపూర్వక నమ్మకాలు.

శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణలో మొక్కుబళ్లు, వేషాలు, బూతుపాటలు, దీవెనలకు ప్రాధాన్యత ఉంటుంది. దున్నపోతు, బద్దిగొర్రెల్ని బలి ఇవ్వడం (గుడి ఆవరణలో ప్రస్తుతం బలుల నిషేధం), పొలి చల్లడం ఆచారం. గంగమ్మ తల్లికి ఎదుర్కోలు, వీడ్కోలు ప్రధాన కార్యక్రమాలు. ఒకనాడు బసివి లేదా మాతను వదలడం కొన్ని కులాల్లో ఆచారంగా ఉండేదట. జాతర నిర్వహణలో కొన్నికులాలకు, కుటుంబాలకు, వ్యక్తులకు మిరాశీ హక్కులు, బాధ్యతలు, మర్యాదలు ఉంటాయి.

చాటింపు జరిగాక రోజూ రెండు పూటలా వేషాలతో మిరాశీదారులు, భక్తులు వీధులు తిరుగుతూ తాతయ్యగుంట గంగమ్మ గుడికి వచ్చి చుట్టూ మూడు సార్లు తిరిగి, వేషాలమ్మ గుడికి వెళ్లి వేషాలు తీసేయడం, చివరి రోజు గంగమ్మ తల్లి బొమ్మ తయారీ, పేరంటాలు గంగమ్మ తల్లి చెవి నరకడం (దేవతకు వీడ్కోలు)తో జాతర పూర్తవుతుంది.

ప్రతి వేషానికీ ప్రత్యేక వేషధారణ, పాడడానికి ఒక్కో పాట ఉంది. మొదటి మూడు రోజుల్లో వచ్చే వేషాలకు మాత్రమే బూతుపాటలు (ఒకప్పుడు అవి కూడా గుడి ప్రాంతంలోనే) పాడేవారట. ప్రస్తుతం భక్తుల వేషాల్లో వైవిధ్యం కనబడుతుంది.

జాతరలో వేపాకు తోరణాలు, వేపకొమ్మలు, వేపచీరలు అంతా వేపాకుమయం. అంబళ్లు పోయడం మరో ప్రధాన అంశం. పులియబెట్టి వండిన అంబలి ఇంటి దగ్గర, గుడి దగ్గర అండాల్లో పోయడం, తాగడం తప్పనిసరి ఆచారం. గొల్ల వేషం మజ్జిగ దుత్తతో ఇంటింటికి పోయినపుడు ఆ ఇంటి వారు అందులో మజ్జిగ పోస్తుంటారు. ఆ మజ్జిగని గొల్ల వేషం కొబ్బరి చిప్పతో ఆ ఇంటి వారికి, జనానికి పోస్తుంటుంది. బైరాగి వేషానికి చల్లదనం కల్గించే నాంకొమ్ము పూసుకుంటారు. జాతరలో వేప, పానకం, అంబలి, మజ్జిగలకు ఎంతో ప్రాధాన్యం ఉంది.


శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ప్రజల నమ్మకానికి ప్రతీకాత్మక ప్రదర్శన. జాతర జరిగితే వర్షం పడుతుంది, పేరంటాలు వస్తే చల్లగాలి వీస్తుంది– ఇది ఈ జాతర వెనక ఉన్న ప్రధానాంశంగా గుర్తించాల్సి ఉంది. శిశిరం నుంచి వసంత ఋతువుకు– అంటే చలి నుంచి వేడికి మారుతున్న కాలం, వేసవికాలం మొత్తం జాగ్రత్తలు పాటించాలన్న ఉద్బోధ దీని వెనక ఉందేమోననిపిస్తుంది. ఇక్కడ రెండు ఋతువుల సంధి కాలంలో పాటించాల్సిన నియమాలను చెప్పడమో, లేక వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతీకాత్మకంగా తెలియజేయడమో కనబడుతుంది.

వ్యాసకర్త విశ్రాంత తెలుగు ఆచార్యులు

భాషా సేవా మకుటం!

తెలుగు భాషకు చిరస్మరణీయ సేవలందించిన భాషా సేవకుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య సామరస్యతకు జీవితాంతం కృషి చేసిన సౌజన్యమూర్తి. తెలుగులో చరిత్ర పరిశోధనలు, విజ్ఞాన రచనలు చేయడానికి తొలి అడుగులు వేసినవారు. నిద్రాణమై ఉన్న తెలుగు జాతిని మేల్కొలిపిన మహనీయుల్లో ఎన్నదగిన వారు.

క్రీ.శ. 1876 మే 18న ఉమ్మడి కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో జన్మించారు. తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థిగా ఉన్నప్పుడు 'సమాచార్', 'వివిధ విజ్ఞాన్ విస్తార్' వంటి మరాఠీ పత్రికలకు సంపాదకత్వ బాధ్యతలు వహించారు. 'కేసరి', 'మహారాష్ట్ర' వంటి పత్రికలకు విరివిగా వ్యాసాలు రాశారు. అనేక చర్చల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. తెలుగులో 'జనరంజని' పత్రిక స్వయంగా నడిపించారు. విజయవాడలో స్త్రీ విద్యావ్యాప్తి కొరకు రాయసం వెంకట శివుడు నిర్వహణలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో సోదరి బండారు అచ్చమాంబతో కలిసి అనేక రచనలు చేశారు.



కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

బ్రిటిష్ తత్వవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ సూచించిన అజ్ఞాత వాదాన్ని నమ్మిన లక్ష్మణరావు మతాతీత లౌకికవాద సిద్ధాంతాన్ని జీవితాంతం అనుసరించారు. హైదరాబాదులోని 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' స్థాపించడంలోనూ; 'విజ్ఞాన చంద్రికా మండలి', 'విజ్ఞాన చంద్రికా పరిషత్', 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటి సంస్థల నిర్వహణలోనూ ఆయన పాత్ర కీలకమైనది. లక్ష్మణరావు సాహిత్య, సామాజిక ఉద్యమ నేపథ్యానికి వారి సోదరి అచ్చమాంబ అందించిన ప్రోత్సాహం ఎంత ఉన్నతమైందో, తొలి తరం తెలుగు కథా రచయిత్రిగా అచ్చమాంబ ఎదుగుదలలో ఆయన ప్రోత్సాహం కూడా మరువలేనిది. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' ఆయనకు విశేష కీర్తిని తెచ్చిపెట్టింది. 'శివాజీ చరిత్ర', 'హిందూ మహా యుగము', 'మహమ్మదీయ మహా యుగము' వంటి రచనలు చేశారు. 'జ్ఞానమొక భాషయొక్క యబ్బ సొమ్ము కాదు' అని నినదించారు.

– ర్యాలి ప్రసాద్, కాకినాడ
(నేడు కొమర్రాజు లక్ష్మణరావు జయంతి)

నేటి నుంచి సత్యదేవుని కల్యాణోత్సవాలు



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. సాయంత్రం 4 గంటలకు అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని, సత్యదేవుడిని వధూవరులను చేయడంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణోత్సవం జరగనుంది. ఈ నెల 24న జరిగే శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి జరిగే స్వామివారి కల్యాణోత్సవం అనంతరం 10,000 మంది భక్తులకు 6 కౌంటర్ల ద్వారా ప్రసాదం, అక్షతలు పంపిణీ చేస్తామని చెప్పారు.

రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి రాయితీ

నేటి నుంచి జమ చేసేందుకు ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: చంద్రబాబు బృందం కుట్రపూరిత రాజకీయాలతో నిలిచిపోయిన ఖరీఫ్ 2023 కరువు సాయం, మిచాంగ్ తుపాన్ పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. పోలింగ్ ముగిసే వరకు డీబీటీ పథకాల చెల్లింపులపై ఎన్నికల కమిషన్ విధించిన ఆంక్షలను ఎత్తివేయడంతో నేటి నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరు ప్రామాణికాల ఆధారంగా అంచనా

దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు గతేడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుపై కొంత మేర ప్రభావం చూపాయి. వర్షపాతం, సాగు విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, వాగు ప్రవాహం, భూగర్భ జల స్థాయిలు, జలాశయాల స్థాయి లాంటి ఆరు ప్రామాణికాల ఆధారంగా ఏడు జిల్లాల్లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. 14,24,245 ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నట్లు నిబంధనల మేరకు లెక్క తేల్చారు. ఇందులో ఉద్యాన పంటల విస్తీర్ణం 92,137 ఎకరాలు కాగా వ్యవసాయ పంటలు 13,32,108 ఎకరాలున్నాయి.

ఆర్బీకేల్లో జాబితాలు

ఇక రబీ 2023–24 సీజన్ ఆరంభంలో మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో 6,64,380 ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నట్లు గుర్తించారు. ఇందులో 64,695 ఎకరాల్లో ఉద్యాన పంటలు, 5,99,685 ఎకరాలు వ్యవసాయ పంటలున్నాయి. ఈ నేపథ్యంలో కరువు ప్రభావంతో ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన 6,95,897 మంది రైతులకు రూ.847.22 కోట్లు, మిచాంగ్ తుపాన్‌తో నష్టపోయిన 4,61,337 మంది రైతులకు రూ.442.36 కోట్లు చొప్పున 11.57 లక్షల మందికి రూ.1,289.58 కోట్లు పెట్టుబడి రాయితీగా లెక్కతేల్చారు. సామాజిక తనిఖీల్లో భాగంగా అర్హుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించారు.

మోకాలొడ్డిన బాబు బృందం

కరువు సాయంతో పాటు మిచాంగ్ తుపాన్ పరిహారం చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్చిలోనే ఏర్పాట్లు చేసింది. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందంటూ చంద్రబాబు బృందం ఈసీకి ఫిర్యాదు చేసి నిధుల విడుదలను అడ్డుకుంది. ఖరీఫ్ వేళ రైతులకు సాయం అందకుండా మోకాలొడ్డింది. పోలింగ్ ముగిసే వరకు ఇతర డీబీటీ పథకాలతో పాటు రైతులకు జమ చేయాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించి ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో మే 10వతేదీన జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా ఒత్తిళ్లకు తలొగ్గి వివరణల సాకుతో ఎన్నికల కమిషన్ తాత్సారం చేయడంతో నిధులు జమ కాలేదు. తాజాగా పోలింగ్ ప్రక్రియ ముగియడంతో డీబీటీ పథకాల లబ్ధిదారులకు నగదు బదిలీపై ఆంక్షలను ఎన్నికల కమిషన్ సడలించింది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పెట్టుబడి రాయితీ జమ చేసేందుకు మార్గం సుగమమైంది. అర్హులైన రైతుల ఖాతాల వారీగా బిల్లులు జనరేట్ చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో 11.57 లక్షల మందికి రూ.1,289.58 కోట్లు జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజా మొత్తంతో కలిపి ఐదేళ్లలో వైపరీత్యాల వల్ల నష్టపోయిన 34.41 లక్షల మంది రైతులకు రూ.3,261.60 కోట్లు పెట్టుబడి రాయితీగా అందించినట్లవుతుంది.

జూన్ 15 నుంచి ముంబై-విజయవాడ విమాన సర్వీస్



విమానాశ్రయం (గన్నవరం): దేశ వాణిజ్య రాజధానిగా గుర్తింపు పొందిన ముంబై నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)కు జూన్ 15వ తేదీ నుంచి ఎయిరిండియా సంస్థ విమాన సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఇప్పటికే టికెట్ల బుకింగ్‌ను ఆ సంస్థ ప్రారంభించింది. సుమారు 180 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ ఎ320 విమానం ప్రతిరోజూ ముంబై నుంచి సాయంత్రం 3.55కు బయలుదేరి 5.45 గంటలకు ఇక్కడికి చేరుకుంటుంది. తిరిగి ఈ విమానం సాయంత్రం 7.10కు ఇక్కడి నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు ముంబై చేరుకుంటుంది. గతంలో ఈ రూట్‌లో నడిచిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీస్ కోవిడ్ సమయంలో రద్దయింది. తిరిగి ఈ సర్వీస్‌ను ఎయిరిండియా సంస్థ పునఃప్రారంభించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వీస్ వల్ల ముంబై-విజయవాడ మధ్య తిరిగే వారితో పాటు గల్ఫ్ దేశాలకు వెళ్లే ప్రయాణికులకు సులువైన కనెక్టివిటీ సదుపాయం ఉంటుందని ఎయిర్‌పోర్ట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



తిరుమల: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాది శ్రీదేవి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనాలను టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు ప్రారంభం



తిరుమల: తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో వివిధ సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో అలంకరించిన మండపంలో శుక్రవారం శ్రీపద్మావతి పరిణయోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. మే 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. పరిణయోత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం నాడు శ్రీమలయప్ప స్వామి వారు గజవాహనాన్ని అధిరోహించగా ఉభయనాంచారులు పల్లకిపై పరిణయోత్సవ మండపానికి సాయంత్రం 5.30 గంటలకు వేంచేపు చేశారు. పెండ్లిమండపంలో నిత్య నూతన వధూవరులైన శ్రీస్వామివారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు, పూలదండలు మార్చుకోవటం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ కోలాహలంగా జరిగాయి. ఆ తరువాత శ్రీస్వామివారికి ఆస్థానం జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సహితుడైన స్వామి బంగారుతిరుచ్చిపై భక్తజనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో తొలిరోజు వివాహ వేడుక ముగిసింది.

తల్లీకూతుళ్లపై ప్రేమోన్మాది హత్యాయత్నం

తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లు • పరారీలో నిందితుడు • నెల్లూరు జిల్లా వింజమూరులో ఘటన

వింజమూరు (ఉదయగిరి): నాలుగేళ్లపాటు ప్రేమించిన ప్రియురాలు పెళ్లికి ఒప్పుకోలేదనే కోపంతో ఓ యువకుడు తల్లీకూతుళ్లపై హత్యాయత్నం చేశాడు. తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లను నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరులో శుక్రవారం జరిగిన ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వింజమూరు వైశ్యబజారుకు చెందిన సంక్రాంతి పూజిత, ప్రకాశం జిల్లా పామూరు మండలం కొత్తపల్లికి చెందిన వంటేరు నాగరాజు ప్రేమించుకుంటున్నారు. వీరు సమీప బంధువులు. పూజిత బి.ఫార్మసీ చదువుతుండగా నాగరాజు ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో గత ఏడాది నుంచి పూజితను పెళ్లి చేసుకునేందుకు నాగరాజు తీవ్రంగా ప్రయత్నించసాగాడు. తన కుటుంబసభ్యుల ద్వారా పూజితను ఒప్పించే ప్రయత్నం చేశాడు. నాగరాజుకు ఉద్యోగం లేకపోవడంతో పూజిత తల్లి కాంతమ్మ వివాహానికి అంగీకరించలేదు. దీంతో పూజిత కూడా ఆరునెలల నుంచి నాగరాజును దూరం పెట్టింది. దీంతో వారిపై కోపం పెంచుకున్న నాగరాజు రెండురోజుల నుంచి వింజమూరులో మకాం వేసి తల్లీకూతుళ్లను వేధించసాగాడు. పూజిత తనను వివాహం చేసుకోవాలని పట్టుబట్టాడు. కానీ వారు ససేమిరా అనడంతో శుక్రవారం ఉదయం కొబ్బరిబోండాలు నరికే కత్తి తీసుకుని ఇంట్లోకి వెళ్లాడు. ముగ్గురి మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగాక కత్తితో కాంతమ్మ చేతిని నరికాడు. ఆమెకు మరోచేయి కూడా లేదు. అడ్డొచ్చిన పూజితపైన కూడా కత్తితో దాడిచేశాడు. వారు పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అడ్డుపడేందుకు ప్రయత్నించినా వారిని కూడా నరికేస్తానని బెదిరించడంతో ఎవరూ దగ్గరకు రాలేదు. అనంతరం బైక్‌పై పరారయ్యాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ కోటిరెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిన తల్లీకూతుళ్లకు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పట్టపగలు రద్దీగావుండే ప్రాంతంలో ఈ ఘాతుకం జరగడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులయ్యారు. పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు మూడు బృందాలను రంగంలోకి దింపారు. కలిగిరి సీఐ ఫిరోజ్ వింజమూరు చేరుకుని నిందితుడి బంధువులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పూజిత



దాడిలో తీవ్రంగా గాయపడిన కాంతమ్మ

రోడ్డుపైనే సీపీఆర్

- ఆరేళ్ల బాలుడికి పునర్జన్మ
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



రోడ్డుపైనే బాలుడికి సీపీఆర్ చేసిన డాక్టర్ రవళి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విద్యుత్ షాక్‌కు గురైన ఆరేళ్ల బాలుడు అపస్మారక స్థితికి చేరుకోగా, అటుగా వెళ్తున్న యువ వైద్యురాలు దాన్ని గుర్తించి కారు దిగి వచ్చి రోడ్డుపైనే సీపీఆర్ చేసి బాలుడి ప్రాణాలను నిలబెట్టింది. ఈ సంఘటన 5 రోజుల క్రితం విజయవాడ అయ్యప్పనగర్ మొదటి లైన్ వద్ద జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చింది. విజయవాడలోని సంతాన సాఫల్య కేంద్రంలో డాక్టర్ రవళి వైద్యురాలు. 4 రోజుల క్రితం ఆమె కారులో కోదాడ వెళ్లి, తిరిగి వస్తూ తనతో వచ్చిన బంధువులను దింపేందుకు అయ్యప్పనగర్‌కు వెళ్లింది. వారిని ఇంటి వద్ద దించి తిరిగి వస్తుండగా అపస్మారక స్థితిలో ఉన్న ఆరేళ్ల బాలుడు సాయిని ఆతృతతో తల్లిదండ్రులు తీసుకెళ్తుండటాన్ని చూసి కారు ఆపి అడిగింది. విద్యుత్ షాక్‌కు గురైనట్లు వారు చెప్పడంతో వెంటనే బాలుడిని రోడ్డుపై పడుకోబెట్టి కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) చేసింది. ఇలా రెండు, మూడు నిమిషాలు చేయగా, అప్పటి వరకూ కోమాలో ఉన్న బాలుడిలో కదలిక ప్రారంభమైంది. హార్ట్‌బీట్ ప్రారంభమైందని నిర్ధారించుకుని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లమని సలహా ఇచ్చింది. ఇప్పుడు ఆ వీడియో వైరల్‌గా మారింది. పటమట డొంక రోడ్డులోని విజయ ఎమర్జెన్సీ ఆస్పత్రికి బాలుడిని చికిత్సకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం బాలుడు పూర్తిగా కోలుకున్నట్లు ఫిజీషియన్ డాక్టర్ రాజేష్ తెలిపారు. బ్రెయిన్ సీటీ స్కాన్ చేయగా నార్మల్ రావడంతో డిశ్చార్జి చేశామన్నారు. కాగా ఆ దంపతులకు బాలుడు పెళ్లయిన చాలా రోజులకు పుట్టినట్లు డాక్టర్ రాజేష్ చెప్పారు. నిర్మాణంలో ఉన్న భవనం కిటికీ వద్ద విద్యుత్ షాక్‌కు గురైనట్లు వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగి ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి

గుంటూరు ఈస్ట్: ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తి పెట్రోలు బాంబులు వేసిన ఘటన గుంటూరు నగరంలో తీవ్ర సంచలనం రేపింది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.చైతన్య గుంటూరులోని ఆకులవారితోట 1వ లైనులో నివాసం ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఓ గుర్తుతెలియని వ్యక్తి రెండు పెట్రోలు బాంబులను చైతన్య ఇంటి వరండాలోకి విసిరివేశాడు. బాంబుల శబ్దానికి బయటకు వచ్చిన చైతన్య, కుటుంబ సభ్యులు బకెట్లతో నీళ్లు చల్లి మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది. కాగా, 15 రోజుల కిందట ఓ యువకుడు బైక్‌తో తన కారును ఢీకొట్టాడని, కారు రిపేరుకు రూ. 45 వేలు చెల్లించాలని తాను నిలదీయగా, యువకుడు అందుకు నిరాకరించి అతడి బైక్‌ను తన ఇంటి వద్ద వదిలి వెళ్లాడని చైతన్య తెలిపారు.



బాంబు దాడిలో ధ్వంసమైన ఇంటిలోపలి ప్రాంతం

అయితే ఆ డబ్బులు అందక యువకుడు రెండుసార్లు తన వద్దకు వచ్చి బైక్ ఇవ్వాలని కోరాడని, బైక్ ఇవ్వని కారణంగా కక్షతో పెట్రోలు బాంబులు వేసి ఉంటాడని చైతన్య అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

సజీవ సమాధిని దర్శించుకున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి (బ్రహ్మంగారు) క్రీ.శ.1693 శ్రీముఖ నామ వైశాఖ శుద్ధ దశమి రోజు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 331వ ఆరాధన మహోత్సవాన్ని పలు రాష్ట్రాల్లో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో నిర్వహించారు. బ్రహ్మంగారి మఠంలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ఉదయం విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం దీక్షబంధనాలంకారోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి నంది వాహనోత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. స్వామి సజీవ సమాధిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి మాల ధారులు ఇరుముడి సమర్పించేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామి నడయాడిన నంద్యాల జిల్లా బనగానపల్లెలోని నేలమఠం, చింతమానుమఠం, రవ్వలకొండ, యాగంటిలో తపస్సు చేసిన గుహ, కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లాలోని కళహరహళ్లిలో ఉన్న పాపాగ్నిమఠంలో ఆరాధనోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.



బ్రహ్మంగారిమఠంలో భక్తజన సందడి (ఇన్‌సెట్‌లో) దర్శనమిస్తున్న స్వామివారు

టీవీ నటుడు చంద్రకాంత్ ఆత్మహత్య

టీవీ నటి పవిత్ర మరణంతో మనస్థాపం

మణికొండ(హైదరాబాద్): టీవీ సీరియల్ నటుడు చంద్రకాంత్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. త్రినయని, రాధమ్మ కూతురు, కార్తీక దీపం లాంటి పలు సీరియళ్లలో నటిస్తున్న చంద్రకాంత్ (40) అలకాపూర్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్నారు. 2015లో శిల్పను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. త్రినయని సీరియల్‌లో తనతో నటించిన పవిత్ర ఇటీవల బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని తట్టుకోలేక చంద్రకాంత్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆయన పవిత్రతో ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్నట్టు సమాచారం. పవిత్ర మృతితో తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చంద్రకాంత్ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలు వచ్చాకే విలేకరులకు వెల్లడిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.




విశాఖ జూకు కొత్త అతిథులు

సీజెడ్‌ఏ అనుమతులు • త్వరలోనే సందడి చేయనున్న వన్యప్రాణులు


ఆరిలోవ (విశాఖజిల్లా): విశాఖలో ఇందిరాగాంధీ జూ పార్కుకు కొద్దిరోజుల్లో మరికొన్ని కొత్త వన్యప్రాణులను తీసుకురావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్నింటిని తీసుకురావడానికి సెంట్రల్ జూ అథారిటీ ఆఫ్ ఇండియా (సీజెడ్‌ఏ) అనుమతులు లభించాయి. మరికొన్నింటిని తీసుకురావడానికి అనుమతులు రావాల్సి ఉంది. కొన్నాళ్లుగా ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కుకు ఇతర జూ పార్కుల నుంచి కొత్త జంతువులు, అరుదైన పక్షులను అధికారులు తరచు తీసుకొస్తున్నారు. గత నెల 27న కోల్‌కతాలోని అలీపూర్ జూ పార్కు నుంచి జంతుమార్పిడి విధానం ద్వారా జత జిరాఫీలు, రెండుజతల ఏషియన్ వాటర్ మానిటర్ లిజర్డ్స్, జత స్కార్లెట్ మకావ్ (రంగురంగుల పక్షి)లను ఇక్కడకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా వన్యప్రాణులు జూలో సందర్శకులను అలరిస్తున్నాయి. ఇప్పుడు మరికొన్ని వన్యప్రాణులను కొద్ది రోజుల్లో తీసుకురానున్నారు. బెంగళూరు జూ నుంచి మిలటరీ మెకావ్, రెడ్‌నెక్ట్ వాలిబీ, స్పైరల్ మంకీస్, మార్మోసెట్ మంకీస్, గ్రీన్ వింగ్ మెకావ్‌లను నెలరోజుల్లో తీసుకొచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి కోసం జూలో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు సిద్ధం చేశారు.

జర్మనీ నుంచి అల్డైబ్రా జాయింట్ టార్టోయిస్‌లు

జర్మనీ నుంచి 12 అల్డైబ్రా జాయింట్ టార్టోయిస్‌లను విశాఖ జూకు తీసుకురానున్నారు. ఈ జాతి తాబేళ్ల జీవితకాలం వంద సంవత్సరాలు. ఇవి అరుదైనవి. మనదేశంలో ఇవి అరుదుగా కనిపిస్తాయని అధికారులు చెబుతున్నారు. వాటిని ఇక్కడకు తీసుకురావడానికి సీజెడ్‌ఏ అధికారుల అనుమతి లభించింది. వీటిని ఇక్కడకు తీసుకొస్తే వందేళ్ల వాటి జీవితకాలంలో ఆ జాతి సంతతి వృద్ధి చెందుతుంది. ఇతర జూ పార్కుల నుంచి జంతుమార్పిడి ద్వారా కొత్త వన్యప్రాణులను ఇక్కడకు తీసుకురావడానికి ఎక్కువగా అవకాశాలు కలుగుతాయని అధికారులు ఆశిస్తున్నారు. వీటితోపాటు అహ్మదాబాద్ జూ పార్కు నుంచి వివిధ రకాల అరుదైన పక్షులను తీసుకొచ్చేందుకు సీజెడ్‌ఏకి ప్రతిపాదనలు పంపించారు. అవికూడా వస్తే విశాఖ జూకి మరింత కొత్తదనం లభించనుంది.



అల్డైబ్రా జెయింట్ టార్టోయిస్




మీర్‌కాట్



గ్రీన్ వింగ్ మెకావ్

త్వరలోనే కొత్త వన్యప్రాణులు



విశాఖ జూకి ఒకటి, రెండునెలల్లో కొత్త వన్యప్రాణులను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. బెంగళూరు జూ నుంచి మీర్‌కాట్, రెడ్‌నెక్డ్ వాలబీ, స్పైరల్ మంకీస్, మర్మోసెట్స్, గ్రీన్ వింగ్డ్ మకావ్ తదితర జాతులతో పాటు జర్మనీ నుంచి అల్డైబ్రా జాయింట్ టోర్టోయిస్‌లను ఇక్కడికి తీసుకురావడానికి సీజెడ్‌ఏ అనుమతులు లభించాయి. అహ్మదాబాద్ జూ నుంచి మరికొన్ని అరుదైన పక్షులను తీసుకురావడానికి సీజెడ్‌ఏకి ప్రతిపాదనలు పంపించాం. సీజెడ్‌ఏ అనుమతులు వచ్చిన వెంటనే వాటిని తీసుకొస్తాం. గతనెలలో లీపూర్ జూ నుంచి ఇక్కడకు తీసుకొచ్చిన జిరాఫీలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. జూలో అరుదైన వన్యప్రాణులను అందుబాటులో ఉంచడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– డాక్టర్ నందనీ సలారియా, జూ క్యూరేటర్, ఇందిరాగాంధీ జూ పార్కు, విశాఖపట్నం

సైబర్ నేరగాళ్ల మైండ్ 'బ్లాక్'

ఒకప్పుడు కేవలం బ్యాంకు ఖాతాలు మాత్రమే స్తంభన

ఆపై వారి సెల్‌ఫోన్ నంబర్లకూ వర్తించిన ఈ విధానం

తాజాగా హ్యాండ్‌సెట్స్‌నూ బ్లాక్ చేయిస్తున్న కేంద్రం

ఇటీవలే 28,200 హ్యాండ్‌సెట్స్ బ్లాక్ చేయాలంటూ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్

సైబర్ నేరగాళ్లకు చెక్ చెప్పడానికి కేంద్రప్రభుత్వం మరో కీలకనిర్ణయం తీసుకుంది. వీరు వినియోగించే మొబైల్‌ఫోన్లు బ్లాక్ చేయిస్తోంది. తాజాగా 28,200 హ్యాండ్‌సెట్స్ బ్లాక్ చేయాలని ఆయా సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించింది. ఈ ఫోన్లలో వాడిన 20 లక్షల ఫోన్‌నంబర్ల పూర్వాపరాలు మరోసారి పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ-కేటుగాళ్లు గత ఏడాది 'గ్రేటర్'పరిధిలోని బాధితుల నుంచి ఏకంగా రూ.621 కోట్లు కాజేశారంటే సైబర్ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

సైబర్ నేరగాళ్లను కట్టడి చేయడానికి కేంద్రం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. తొలినాళ్లలో సైబర్ నేరాలతో సంబంధం ఉన్న బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేసేది. ఈ విధానం పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో మరో అడుగు వేసింది. సైబర్ నేరగాళ్లు వినియోగించినట్టు, వినియోగించే అవకాశమున్నట్టు

ఆ రెండింటితో ఉపయోగం లేక...

ప్రాథమిక ఆధారాలు లభించిన సెల్‌ఫోన్ నంబర్లను బ్లాక్ చేయడం మొదలెట్టింది. దీంతో తెలివిమీరి వ్యవహరిస్తున్న ఆ కేటుగాళ్లు అధిక సంఖ్యలో ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు సమీకరించడం మొదలెట్టారు. ఒక్కో నేరానికి ఒక్కో సిమ్ వాడుతున్నారని అధికారులు గుర్తించారు.

డార్క్‌నెట్‌లో దొరుకుతున్న డేటా

ఉత్తరాదికి చెందిన సైబర్ నేరగాళ్లు అక్కడి నుంచే దేశవ్యాప్తంగా బాధితులను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. అయితే దీనికి సెల్‌ఫోన్ వినియోగదారుల వివరాలు అత్యంత కీలకం. వీరి నంబర్లతో కూడిన డేటా సైబర్ నేరగాళ్లకు డార్క్‌నెట్‌లో తేలిగ్గా దొరుకుతోంది. లక్ష మందికి సంబంధించిన ఫోన్ నంబర్లను కేవలం రూ.30 వేలకు విక్రయించేవారు అనేకమంది ఉన్నారు. ఈ డేటా వీరి వద్దకు ఎలా చేరుతోందనేది ఇప్పటికీ అంతుచిక్కడం లేదు.

ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు

సైబర్ నేరగాళ్లు తమ ఉనికి బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒకవేళ బాధితుడు పోలీస్ ఫిర్యాదు చేసినా, దర్యాప్తులో ముందుకు వెళ్లకుండా, వారికి ఎలాంటి ఆధారాలు చిక్కకుండా ఉండేలా ప్లాన్ చేశారు. బ్యాంకు ఖాతాలు, సెల్‌నంబర్లు ఇలా ఏదీ తమ పేరుతో లేకుండా చూసుకుంటున్నారు. వీరికి అవసరమైన బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులను సరఫరా చేయడానికి కొన్ని ముఠాలు పని చేస్తున్నాయి. ఇతరుల పేర్లతో ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాలతోపాటు ప్రీ యాక్టివేటెడ్ సిమ్ కార్డులు సేకరించి సైబర్ నేరగాళ్లకు ఈ ముఠాలు అందజేస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు ఇచ్చినందుకు కమీషన్లు, సిమ్‌కార్డుకు అధిక రేటు వీరికి దక్కుతోంది.

ఫోన్లు బ్లాక్ చేసేలా తాజా నిర్ణయం

సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న హ్యాండ్‌సెట్స్‌ను బ్లాక్ చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంది. ఈ బాధ్యతల్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీఓటీ) పర్యవేక్షించడం మొదలెట్టింది. సైబర్ నేరాల్లో బాధితులుగా మారినవారు నేరుగా, ఆన్‌లైన్ ద్వారా పోలీసులు లేదా సంబంధిత ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. లిఖిత పూర్వకంగా, 1930కు కాల్ చేయడం ద్వారా, వెబ్‌సైట్, యాప్‌ల్లో దాఖలవుతున్న వీరి ఫిర్యాదుల్లో తమను సంప్రదించడానికి సైబర్ నేరగాడు వినియోగించిన ఫోన్ నంబర్ వివరాలు ఉంటున్నాయి. ఈ డేటా ఆధారంగానే డీఓటీ మొబైల్ ఫోన్లు బ్లాక్ చేసేలా చర్యలు తీసుకుంటోంది.

సర్వీసు ప్రొవైడర్ల సహకారంతో..

ఈ సెల్‌ఫోన్ హ్యాండ్‌సెట్లు గుర్తించడం, బ్లాక్ చేయడంలో ఆయా నెట్‌వర్క్ సర్వీస్ ప్రొవైడర్ల పాత్ర అత్యంత కీలకం. ప్రతి సెల్‌ఫోన్‌కు ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్యూప్‌మెంట్ ఐడెంటిఫికేషన్‌గా (ఐఎంఈఐ) పిలిచే ప్రత్యేక నంబర్ ఉంటుంది. ఏ కంపెనీ సిమ్ వాడుతుంటే ఆ సర్వీస్ ప్రొవైడర్ల వద్ద ఈ ఐఎంఈఐ రిజిస్టర్ అవుతుంది. బాధితుల ఫిర్యాదులో ఉన్న సెల్‌నంబర్ ఆధారంగా సర్వీస్ ప్రొవైడర్ల సహకారంతో డీఓటీ ఐఎంఈఐ నంబర్లను గుర్తిస్తోంది. వీటితో జాబితా రూపొందించి ఆయా సర్వీస్ ప్రొవైడర్లకు పంపిస్తోంది. దీని ఆధారంగా ఈ ఐఎంఈఐ నంబర్లు ఉన్న ఫోన్లు పనిచేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇలా ఆ హ్యాండ్‌సెట్ బ్లాక్ అయిపోతోంది. ఇటీవల కాలంలో నేరగాళ్లు స్కైప్ కాల్స్ చేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ తరహాకు చెందిన స్కైప్ ఖాతాలను కేంద్రం బ్లాక్ చేయిస్తోంది.


రాయ్‌బరేలీ సభలో ప్రసంగిస్తున్న సోనియా గాంధీ. చిత్రంలో ప్రియాంక, రాహుల్

రాహుల్‌ను మీకు అప్పగిస్తున్నా

రాయ్‌బరేలీ ప్రచారంలో సోనియా గాంధీ భావోద్వేగం

రాయ్‌బరేలీ: 'నా కుమారుడిని రాయ్‌బరేలీ ప్రజలకు అప్పగిస్తున్నా. రాహుల్ మిమ్మల్ని నిరాశపర్చడు' అని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ శుక్రవారం రాయ్‌బరేలీలో ప్రచార సభలో పేర్కొన్నారు. ఎంపీగా 20 ఏళ్లు మీకు సేవ చేసుకునే అవకాశం ఇచ్చినందుకు ధన్యావాదాలని అన్నారు. 'నాకున్న ప్రతిదీ మీరిచ్చిందే. కాబట్టి సోదరసోదరీమణులారా నా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా. మీరంతా నన్ను మీ దానిగా భావిస్తారు' అని అన్నారు. ఓటర్లతో భావోద్వేగ పూరితమైన బంధాన్ని నెలకొల్పే ప్రయత్నంలో రాహుల్‌నీ మీ సొంత వాడిగా భావించాలని విజ్ఞప్తి చేశారు. వేదికపై రాహుల్, ప్రియాంక గాంధీలు సోనియా పక్కన నిలబడ్డారు. 'ఇందిరా గాంధీ, రాయ్‌బరేలీ ప్రజలు నాకు నేర్పిన విలువలు, పాఠాలనే నేను రాహుల్, ప్రియాంకలకు నేర్పాను. అందరినీ గౌరవించండి. బలహీనుల పక్షాన నిలబడి వారిని కాపాడండి. అన్యాయాలను ఎదిరించండి. ప్రజల హక్కుల కోసం పోరాడండి. భయపడొద్దు. పోరాటాలు, సంప్రదాయాల్లో మీ మూలాలు బలంగా ఉన్నాయి' అని వారిద్దరికీ నేర్పానని సోనియా గాంధీ అన్నారు. సోనియా తొలిసారిగా 2004లో రాయ్‌బరేలి ఎంపీగా గెలిచారు. రాజ్యసభకు ఎన్నికై ఇటీవల రాజీనామా చేసే దాకా 20 ఏళ్లు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ బరిలో ఉన్నారు. 20 ఏళ్లు ఎంపీగా సేవ చేసుకునే అవకాశాన్ని తనకు రాయ్‌బరేలీ ప్రజలు కల్పించారని, ఇది తన జీవితంలో అమూల్యమైన ఘట్టమని సోనియా పేర్కొన్నారు. గత 100 ఏళ్లుగా తన కుటుంబం మూలాలు ఇక్కడి నేలతో ముడిపడి ఉన్నాయన్నారు. ఈ బంధం ఎంతో పవిత్రమైనదని, గంగా మాతతో అవధ్, రాయ్‌బరేలి రైతులకు ఉన్న బంధం లాంటిదే ఇదని పేర్కొన్నారు. రాయ్‌బరేలీకి ఇందిరా గాంధీ హృదయంలో ప్రత్యేక స్థానముందని, ఆమె పనిని తాను దగ్గరగా గమనించానని, రాయ్‌బరేలీ ప్రజల పట్ల ఇందిరకు ఎనలేని అభిమానమని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలు వల్ల సోనియా గాంధీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారానికి దూరంగా ఉన్నప్పటికీ కుమారుడి కోసం శుక్రవారం ప్రచారం చేయడం గమనార్హం. సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా ఈ సభలో పాల్గొన్నారు. సోనియాకు ముందు మాట్లాడిన రాహుల్ దేశంలోని యువత ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చారని, వారు మోదీని కోరుకోవడం లేదని తెలిపారు. జూన్ 4 తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని, అది ప్రజాప్రభుత్వమని చెప్పారు. భారత రాజ్యాంగ ప్రతిని చూపుతూ దీన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు చింపి పాడేయాలని చూస్తున్నాయని ఆరోపించారు.

రాయ్‌బరేలీతో సమానంగా అమేథీని చూస్తా

తాను గెలిస్తే అభివృద్ధి విషయంలో రాయ్‌బరేలి, అమేథీలను సమానంగా చూస్తానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమేథీలో మూడుసార్లు ఎంపీగా నెగ్గిన రాహుల్ 2019లో స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి, తమ కుటుంబానికి నమ్మినబంటు కిశోరీలాల్ శర్మ తరఫున రాహుల్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్‌తో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. 'రాయ్‌బరేలిలో అభివృద్ధి పనులకు రూ. 10 ఖర్చు చేస్తే అదే పది రూపాయలు అమేథిలోనూ ఖర్చు పెడతాం.. అది నా హామీ' రాహుల్ పేర్కొన్నారు. అమేథీ ప్రజలకు 40 ఏళ్ల పాటు నిస్వార్థంగా సేవ లందించినందుకు కిశోరీలాల్ శర్మకు ధన్యవాదాలు చెప్పారు. అగ్నివీర్ నియామక విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ నియామక పద్ధతిని తీసుకొస్తామని.. దీంట్లో పెన్షన్‌కు కూడా అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రతిపక్షాలు గెలిస్తే అయోధ్యపైకి బుల్డోజర్లే

- బాలరాముడు మళ్లీ టెంట్‌లోకే..
- ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో మోదీ



బారాబంకీ/ఫతేపూర్/హమీర్‌పూర్: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే అయోధ్య రామమందిరంపైకి బుల్డోజర్లను పంపిస్తాయని, బాలరాముడు మళ్లీ టెంట్‌లోకి వెళ్లాల్సి వస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. బుల్డోజర్లను ఎక్కడికి పంపించాలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వద్ద ట్యూషన్ చెప్పించుకోవాలని ఆ రెండు పార్టీలకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో దశ పోలింగ్ జరుగుతున్నకొద్దీ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పేకమేడలా కూలిపోతోందని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము హ్యాట్రిక్ సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వంలో పేదలకు, యువతకు, మహిళలకు, రైతులకు మేలు చేసే కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ, ఫతేపూర్, హమీర్‌పూర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. జూన్ 4వ తేదీ ఇక ఎంతోదూరంలో లేదని, మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్న సంగతి కేవలం మనకే కాదు, మొత్తం ప్రపంచానికి తెలుసని స్పష్టంచేశారు. ఎన్నికల బహిరంగ సభల్లో ప్రధానమంత్రి ప్రసంగాల్లోని విశేషాలివీ..

ఎన్నుకోవాల్సిన ఏకైక పార్టీ బీజేపీ

''దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం అంకితమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్న 'ఇండియా' కూటమి మరోవైపు ఈ ఎన్నికల బరిలో నిలిచాయి. మనకు మంచి చేసే ఎంపీలు, మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే ఎంపీలు కావాలి. కేవలం మోదీని దూషిస్తూ ఐదేళ్ల కాలం గడిపే ఎంపీలు మనకు అవసరమా? 100సీసీ ఇంజన్‌తో 1,000 సీసీ వేగం సాధ్యమా? బలమైన ప్రభుత్వమే అత్యంత వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదు. అలాంటి అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం. నిజంగా దేశ ప్రగతిని కోరుకుంటే మనం ఎన్నుకోవాల్సిన ఏకైక పార్టీ బీజేపీ.

అయోధ్య రామమందిరంపై సమాజ్‌వాదీ పార్టీ పెద్దలు అనుచితంగా మాట్లాడారు. రామాలయం విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తిరగదోడాలని కాంగ్రెస్ భావిస్తోంది. వారికి సొంత కుటుంబ ప్రయోజనాలు, రాజకీయ అధికారమే ముఖ్యం. కాంగ్రెస్–సమాజ్‌వాదీ పార్టీలకు అధికారం అప్పగిస్తే అయోధ్యలో అలయాన్ని బుల్డోజర్లతో కూల్చేస్తారు. రామ్‌లల్లా మళ్లీ టెంట్‌లోకి పంపిస్తారు. ఆ రెండు పార్టీలకు ఓటు బ్యాంకు కంటే ఏదీ ఎక్కువ కాదు.

రిజర్వేషన్లపై ప్రతిపక్ష నేతలు దారుణంగా మాట్లాడుతున్నారు. మొత్తం రిజర్వేషన్లను ముస్లింలకే ఇవ్వాలని బిహార్ మాజీ ముఖ్యమంత్రి(లాలూ ప్రసాద్ యాదవ్) అన్నారు. అంటే దళితులు, గిరిజనులు, ఓబీసీలకు అన్యాయం చేయాలా? వారు ఉన్నత స్థాయికి చేరుకోవద్దా?'' అని మోదీ ప్రశ్నించారు.

నిందితుల జాబితాలో ఆప్, కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎక్సయిజ్ విధానంలో అవకతవకల కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం తాజాగా మరో చార్జ్‌షీట్‌ను దాఖలుచేసింది. ఇందులో ఆమ్ ఆద్మీ పార్టీ, సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేర్లను చేర్చింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై ఇలా ఒక జాతీయ రాజకీయ పార్టీ, ఒక ముఖ్యమంత్రి పేర్లను చార్జ్‌షీట్‌లో చేర్చడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఢిల్లీలో ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజాకు ఈడీ 200 పేజీల అభియోగపత్రాలను సమర్పించింది. వీటిని పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని జడ్జి త్వరలో పరిశీలించనున్నారు. ఆప్ కన్వీనర్‌గానే కాకుండా వ్యక్తిగతంగానూ ఈ కుట్రలో కేజ్రీవాల్ భాగస్వామి అయ్యారని తాజా చార్జ్‌షీట్‌లో ఈడీ ఆరోపించింది. మద్యం కేసులో మొత్తంగా ఈడీ ఇప్పటిదాకా ఎనిమిది చార్జ్‌షీట్‌లు దాఖలుచేసింది. 18 మందిని అరెస్ట్‌చేసింది. 38 సంస్థలకు ఈ నేరంతో సంబంధముందని పేర్కొంది. రూ.243 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది. '' కేజ్రీవాల్ బసచేసిన ఏడు నక్షత్రాల హోటల్ బిల్లును ఈ కేసు నిందితుల్లో ఒకరు చెల్లించారు. ఆ బిల్లులు మా వద్ద ఉన్నాయి'' అని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు గురువారం సుప్రీంకోర్టులో తెలిపారు. మనీ లాండరింగ్ కేసులో తనను అన్యాయంగా అరెస్ట్ చేశారంటూ కేజ్రీవాల్ దాఖలుచేసిన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం రిజర్వ్‌చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం శుక్రవారం విచారించింది. కేజ్రీవాల్ తరఫున అభిషేక్ సింఘ్వీ, ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్‌చేస్తున్నాం.

భారత్‌లో 'రష్యా' పరిస్థితులు

- అక్కడ నియంతృత్వం ఉంది
- విపక్ష నేతలను జైల్లో పడేశారు
- మోదీ సర్కార్‌పై కేజ్రీవాల్ ఆరోపణ



అమృతసర్: మోదీ సర్కార్ హయాంలో దేశపరిస్థితులు రష్యాను తలపిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. శుక్రవారం అమృతసర్‌లో ఆప్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలతో సమావేశం సందర్భంగా కేజ్రీవాల్ ప్రసంగించారు. '' భారత్‌లో కొనసాగుతున్న ఈ నియంతృత్వ పాలనకు ఇంక ఎంతమాత్రం ఆమోదించేదిలేదు. గత 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఇలా పనిగట్టుకుని విపక్షనేతలను జైల్లో పడేయడం ఎన్నడూ చూడలేదు. రష్యాలో అయితే కీలక విపక్షనేతలందర్నీ జైలుకు పంపేసి, కొందర్ని చంపేసి పుతిన్ దేశాధ్యక్ష ఎన్నికలు జరిపి 87 శాతం ఓట్లు గుప్పిట బిగించారు. ఎన్నికల్లో విపక్షాలు లేకపోవడంతో ఓట్లు పొందడానికి నువ్వు ఒక్కడివే మిగులుతావు'' అని మోదీనుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. '' వాళ్లు(బీజేపీ) నన్ను, ఢిల్లీ మాజీ డెప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా జైల్లో పడేశారు. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేశారు. తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే మంత్రులను జైలుకు పంపారు. విపక్ష నేతలను చెరసాలలో వేశాక ఒకే పార్టీ, ఒక్కడే అగ్రనేత సాధ్యం. అప్పుడు ప్రజాస్వామ్యం అసాధ్యం. ఇది జరక్కుండా మనం ఆపాలి'' అని అన్నారు. ' నేను జైలు గదిలో ఉన్నప్పుడు గదిలో రెండు సీసీటీవీ కెమెరాలతో 13 మంది అధికారులు అనుక్షణం గమనించేవారు. ఒక పుటేజీ నేరుగా ప్రధాని మోదీకి వెళ్లేది. అక్కడ రెండు టీవీల్లో గమనించేవారు. నన్ను ఎలాగైనా అణచేస్తామని విశ్వప్రయత్నం చేశారు. అరెస్ట్‌తో అంతా అయిపోతుందని, పార్టీ ముక్కలు చెక్కలై ప్రభుత్వం కూలుతుందని ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాసలయ్యాయి. ఆప్ ఒక కుటుంబం. కుటుంబానికి ఏదైనా కష్టమొస్తే కుటుంబసభ్యులంతా ఏకమై పోరాడతారు. నా అరెస్ట్ తర్వాత ప్రతి ఒక్క కార్యకర్త కేజ్రీవాల్‌గా మారి పోరాడారు'' అని అన్నారు.

నన్ను నిరుత్సాహపరచకండి

''ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి జైలులో ఎవరినైనా కలవడానికి వస్తే గదిలో మాట్లాడే ఏర్పాటుచేయాలని జైలు నియమావళిలో ఉంది. పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ వచ్చినపుడు ఒక గదిలో జైలు సూపరింటెండెంట్ భేటీ ఏర్పాట్లుచేయలేదు. పంజాబ్‌లో మొత్తం 13 లోక్‌సభ స్థానాలను గెల్చుకునేలా ఆప్ నేతలు కష్టపడాలి. జూన్ రెండో తేదీన జైలుకెళ్తా. జూన్ 4 నాటి ఫలితాలను అక్కడి టీవీలో చూస్తా. టీవీలో 'పంజాబ్‌లో అన్ని సీట్లు ఆప్ గెలిచింది' అనే వార్త కోసం ఎదురుచూస్తుంటా. నన్ను నిరుత్సాహ పరచకండి'' అని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు.

స్లొవాకియా ప్రధానికి మరో శస్త్రచికిత్స

బ్రాటిస్లావా: హత్యాయత్నానికి గురైన స్లొవాకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికోకు శుక్రవారం మరో శస్త్రచికిత్స జరిగింది. 59 ఏళ్ల ఫికో పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని అధికారవర్గాలు తెలిపాయి. రెండు రోజుల క్రితం హండ్లోవా పట్టణంలో ప్రభుత్వ సమావేశం తర్వాత బయటికి వచ్చి అభిమానులకు అభివాదం చేస్తుండగా ఒక దుండగుడు ఫికోపై నాలుగైదు రౌండ్లు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. వెంటనే ఆయన్ను బన్‌స్కా బిస్ట్రికాలోని ఎఫ్.డి.రూజ్‌వెల్ట్ ఆసుపత్రికి తరలించారు. ఫికోకు సి.టి. స్కాన్ తీశామని, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నప్పటికీ విషమంగానే ఉందని రూజ్‌వెల్ట్ ఆసుపత్రి డైరెక్టర్ మిరియమ్ లపునికోవా తెలిపారు. ఫికో స్పృహలోనే ఉన్నారని చెప్పారు. శరీరంలో మృత టిష్యూను తొలగించడానికి శుక్రవారం శస్త్రచికిత్స నిర్వహించినట్లు వెల్లడించారు.

సీతా సోరెన్ బహిష్కరణ

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వదిన, శిబూసోరెన్ పెద్ద కోడలు అయిన సీతా సోరెన్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఆరేళ్లపాటు తొలగిస్తున్నట్లు జార్ఖండ్ ముక్తి మోర్చా శుక్రవారం ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు శిక్షగా సీతను బహిష్కరించినట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. జామా శాసనసభ నియోజకవర్గం నుంచి మూడోసారి గెలిచిన సీత మార్చి 20న బీజేపీలో చేరిన సంగతి, దుమ్కా లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగిన సంగతి తెల్సిందే. దుమ్కా ఎంపీ స్థానానికి జూన్ 1న పోలింగ్ జరగనుంది.

కొట్టాడు.. పొట్టలో తన్నాడు

- చెంప ఛెళ్లుమనిపించాడు
- స్వాతి మలివాల్ ఫిర్యాదులో సంచలన విషయాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ తనపై చేసిన దాడిపై ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ సంచలన విషయాలు బయటపెట్టారు. విచక్షణారహితంగా ఛాతిపై కొట్టాడని, పొట్టలో తన్నాడని, చంపి పూడ్చిపెడతా అని బెదిరించాడని ఆమె ఇచ్చిన వాంగ్మూలం వివరాలు ఎఫ్ఐఆర్ ద్వారా తాజాగా వెలుగులోకి వచ్చాయి.

దెబ్బలకు తాళలేక నడవలేకపోయా

గురువారం బిభవ్‌పై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో స్వాతి ఇచ్చిన వాంగ్మూలం వివరాలు ఉన్నాయి. '' కేజ్రీవాల్‌ను కలిసేందుకు డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నా. పట్టరాని ఆవేశంతో నా వైపు దూసుకొచ్చిన బిభవ్ ' మా మాట ఎందుకు వినట్లేవు? మాకు ఎదురుచెప్పడానికి ఎంత ధైర్యం? నీచమైన దానివి నువ్వు. నీకు గుణపాఠం చెప్తాం' అని తిట్టడం మొదలెట్టాడు. తర్వాత 7–8 సార్లు చెంపమీద కొట్టాడు. దీంతో షాక్‌కు గురయ్యా. సాయం కోసం అరిస్తే ఎవ్వరూ ముందుకు రాలేదు. కూర్చున్న నన్ను షర్ట్ పట్టుకుని కిందకు తోశాడు. టేబుల్‌కు తల తగిలి కింద పడ్డా. అంతటితో ఆగకుండా వీరావేశంతో నా ఛాతి, పొట్ట, పొత్తికడుపు, కటి భాగంపై కాలితో పలుమార్లు తన్నాడు. నిలువరించబోతే షర్ట్ పట్టుకుని లాగాడు. షర్ట్ బటన్స్ కొన్ని ఊడిపోయాయి. షర్ట్ పైకి లేస్తోంది ఆపు అని అరిచినా బలంగా నెట్టేసి కొట్టాడు. పీరియడ్ నొప్పికితోడు ఈ దెబ్బల ధాటికి బాధతో విలవిల్లాడిపోయా. పీరియడ్స్ విషయం చెప్పినా అతను ఆగలేదు. దెబ్బల నొప్పికి కనీసం నడవలేకపోయా. ఎలాగోలా అక్కడి నుంచి బయటపడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పా. లిఖితపూర్వక ఫిర్యాదు అడిగారు. భయంకరమైన నొప్పుల బాధతో రాసే ఓపికలేక అక్కడి నుంచి వెళ్లిపోయా'' అని స్వాతి చెప్పారు. 'ఏం చేసుకుంటావో చేస్కో. నువ్వు మమ్మల్ని ఏమీ చేయలేవు. నీ అంతుచూస్తా. ఎముకలు విరగ్గొట్టి పూడ్చిపెడతా. ఎక్కడ పూడ్చామో ఎవరూ కనిపెట్టలేరు' అని బిభవ్ నన్ను బెదిరించాడు'' అని మలివాల్ వాంగ్మూలం ఇచ్చారు.

ముఖంపై అంతర్గత గాయాలు

శుక్రవారం మలివాల్ ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమె ముఖంపై అంతర్గత గాయాలు ఉన్నట్లు వైద్యులు మెడికో లీగల్ కేస్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ఈ కేసు విషయమై మలివాల్ శుక్రవారం తీస్ హజారీ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరై తన వాంగ్మూలం ఇచ్చారు. మరోవైపు కేజ్రీవాల్ సెక్యూరిటీ సిబ్బందితో మలివాల్ వాగ్వాదానికి దిగిన మే 13నాటి 52 సెకన్ల వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. '' నన్నెవరైనా టచ్‌చేస్తే బాగుండదు. ఉద్యోగం నుంచి తొలగిస్తా. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశా. వాళ్లు వచ్చేదాకా ఆగండి. డీసీపీతో మాట్లాడి మీ సంగతి తేలుస్తా'' అని మలివాల్ అంటున్నట్లు వీడియోలో ఉంది.

పొలిటికల్ హిట్‌మ్యాన్..

మలివాల్ శుక్రవారం 'ఎక్స్'లో ఒక వీడియో పోస్ట్‌చేశారు. '' పొలిటికల్ హిట్‌మ్యాన్ మళ్లీ తనను తాను కాపాడుకునే పనిలో పడ్డాడు. విషయం లేకుండా సొంత మనుషులతో ట్వీట్లు, వీడియోలు షేర్ చేయిస్తాడు. నేరాలు చేసి కూడా తప్పించుకోవచ్చని ఆయన ధీమా. ఇంటిలోపలి సీసీటీవీ ఫుటేజీ బహిర్గతమైతే నిజం అందరికీ తెల్సిపోతుంది'' అని పోస్ట్‌చేశారు. ఎవరిని ఉద్దేశించి ఈ పోస్ట్ చేశారో ఆమె పేర్కొనలేదు.

కేజ్రీవాల్ ఇంటికి ఫోరెన్సిక్ బృందం

కేసు విచారణలో భాగంగా ఢిల్లీ పోలీసు ఫోరెన్సిక్ బృందం ఘటన జరిగిన కేజ్రీవాల్ నివాసానికి వెళ్లింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మలివాల్‌ను వెంట తీసుకెళ్లారు. అక్కడి సాక్ష్యాధారాలు, సీసీటీవీ ఫుటేజీని ఐదుగురు సభ్యుల ఫోరెన్సిక్ నిపుణులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్ ఇచ్చిన సమన్లను బిభవ్ బేఖాతరు చేశారు. దీంతో ఆయన జాడ తెల్సుకునేందుకు ఢిల్లీ పోలీసు బృందాలు బయల్దేరాయి. ఒక బృందం ఇప్పటికే అమృత్‌సర్‌కు వెళ్లింది. మహారాష్ట్రకు వచ్చాడేమో అనే అనుమానంతో ఆ రాష్ట్ర పోలీసు విభాగాన్ని సంప్రదించారు.


ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో వాంగ్మూలమిచ్చి వెళ్లిపోతున్న మలివాల్

ఇంత జరిగితే మాట్లాడరా?: సీతారామన్

'' ఇంట్లో సొంత పార్టీ మహిళా ఎంపీపై ఇంత ఘోరమైన దాడి జరిగితే కేజ్రీవాల్ ఎందుకు మాట్లాడట్లేరు? నిందితుడు బిభవ్‌ను ఇంకా వెంటేసుకుని తిరగడం నిజంగా సిగ్గుచేటు. ఈ విషయంలో కేజ్రీవాల్ ఒక బహిరంగ ప్రకటన చేసి క్షమాపణ చెప్పాలి' అని బీజేపీ నాయకురాలు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ డిమాండ్‌చేశారు.

ఇదంతా బీజేపీ కుట్ర: అతిశి

మలివాల్‌ను అడ్డుపెట్టుకుని కేజ్రీవాల్‌ను ఈ కేసులో ఇరికించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆప్ నాయకురాలు అతిశి ఆరోపించారు. '' ఈ రోజు ఒక వీడియో చక్కర్లు కొడుతోంది. అందులో మలివాల్ సోఫాలో కూర్చుని వాగ్వాదానికి దిగారు. కొట్టారని, నొప్పితో బాధపడ్డానని, షర్ట్ బటన్లు ఊడిపోయాయని ఎఫ్ఐఆర్‌లో చెప్పారు. కానీ ఆ వీడియో చూస్తుంటే అదంతా అబద్ధమని తేలిపోయింది. సీఎం బిజీగా ఉంటే కలుస్తానని బిభవ్‌ను ఆమెనే కేకలేసి నెట్టేశారు. ఈ ఉదంతం వెనుక బీజేపీ హస్తముంది'' అని అతిశి ఆరోపించారు.

ఎలక్షన్ బీట్

రాజకీయ పర్యాటకుల ప్రభావం సున్నా

ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యాఖ్య

భువనేశ్వర్: ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి, కేంద్ర ప్రభుత్వం నుంచి రాజకీయ పర్యాటకులు తమ రాష్ట్రానికి తరలివస్తున్నారని, తమపై వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఒడిశా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ మండిపడ్డారు. తమ ప్రజలపై ఈ రాజకీయ పర్యాటకుల ప్రభావం ఏమాత్రం ఉండదని తేల్చి చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు పొలిటికల్ టూరిస్టులుగా మారిపోయారని, కేవలం ఎన్నికల సమయంలోనే వారు ఒడిశాలో కనిపిస్తారని, ఆ తర్వాత మటుమాయం అవుతారని ఎద్దేవా చేశారు. నవీన్ పట్నాయక్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాజకీయ పర్యాటకులు అనుచితమైన భాష ఉపయోగిస్తున్నారని, అది తమ రాష్ట్ర ప్రజలు సహించబోరని హెచ్చరించారు.

మాకు 'ప్లాన్–బి' అవసరం లేదు: అమిత్ షా

న్యూఢిల్లీ: మోదీ అత్యధిక మెజార్టీతో వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు ప్రజలు పూర్తి మెజార్టీ కట్టబెడతారని ధీమా వ్యక్తం చేశారు. మెజార్టీ తగ్గడం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని, 'ప్లాన్–బి'తో తమకు అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన తాజాగా ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్లాన్–ఎ విఫలం కావడానికి 60 దాకా శాతం అవకాశాలు ఉన్నప్పుడే ప్లాన్–బితో అవసరం పడుతుందని పేర్కొన్నారు. ఆ అవసరం తమకు ఉండదని స్పష్టం చేశారు.

రాయ్‌బరేలీ నియోజకవర్గం ప్రజలదే

రాయ్‌బరేలీ తమ కుటుంబ నియోజకవర్గం అంటూ ప్రియాంకా గాంధీ చేసిన వ్యాఖ్యలను అమిత్ తిప్పికొట్టారు. అది ఒక కుటుంబ నియోజకవర్గం కాదని, కేవలం ప్రజలదేనని తేల్చిచెప్పారు. రాయ్‌బరేలీపై పూర్తి హక్కు స్థానిక ప్రజలకే ఉందన్నారు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామని, ఒక కుటుంబానికి ఒక నియోజకవర్గం అంటూ ఉండదని స్పష్టం చేశారు.

ఆదివాసీలకు అన్యాయం: మమత

గోపీవల్లభ్‌పూర్/ దాస్‌పూర్: గిరిజనుల హక్కులను లాగేసుకొని, వివిధ వెనుకబడిన తరగతుల మధ్య చిచ్చుపెట్టాలని నరేంద్ర మోదీ సర్కారు ప్రణాళికను రచిస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. తృణమూల్ జార్‌గ్రామ్ లోక్‌సభ అభ్యర్థి కలాపాద సోరెన్‌కు మద్దతుగా శుక్రవారం నిర్వహించిన ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ .. జాతీయ పౌరసత్వ పట్టికను అమలు చేయడం ద్వారా గిరిజనుల భూ హక్కులను బీజేపీ హరించాలని చూస్తోందని అన్నారు. ఆదివాసీలు, కుర్మీలకు మధ్య ఉద్రిక్తతలను బీజేపీ పెంచుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం గిరిజనుల భూ హక్కులను కాపాడటానికి అంకితభావంతో పని చేస్తోందని తెలిపారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థలాల్లో ఆదివాసీలు నివసించవచ్చని తాము చట్టం చేశామని చెప్పారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను తేవడం ద్వారా ఆదివాసీలు, కుర్మీలు, ఇతర వెనుకబడిన వర్గాల మధ్య గొడవలు పెట్టాలని బీజేపీ చూస్తోందని, తన చివరి శ్వాస వరకు వీరిని కాపాడుతానని హామీ ఇస్తున్నానని తెలిపారు.

సోనియాలా మోదీ ఇటాలియన్ కాదు: కంగన

షిమ్లా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ నేత సోనియా గాంధీలాగా హిందీ మాట్లాడలేని ఇటాలియన్ కాదని బీజేపీ నాయకురాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి, సినీ నటి కంగనా రనౌత్ అన్నారు. మోదీ నిఖార్సైన భూమి పుత్రుడు, దేశ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకుడని చెప్పారు. శుక్రవారం కులూ జిల్లాలోని జగత్‌ఖానాలో ఎన్నికల ప్రచార సభలో కంగనా రనౌత్ ప్రసంగించారు. సుపరిపాలనకు పర్యాయపదం మోదీ అని ప్రశంసించారు.

అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు ఈసీ నోటీసులు

మమతా బెనర్జీపై అనుచిత వ్యాఖ్యలకు..

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు హైకోర్టు మాజీ జడ్జి, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు జారీచేసింది. 'మమతా బెనర్జీ మీరు ఎంతకు అమ్ముడుపోయారు? మీ రేటు 10 లక్షలు, ఎందుకంటే మీరు కేయా సేథ్‌తో మేకప్ చేయించుకుంటున్నారు. మమత అసలు మహిళేనా? అని నేను కొన్నిసార్లు ఆశ్చర్యపోతుంటా' అని అభిజిత్ ఇటీవల ప్రచారసభలో వ్యాఖ్యానించారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఒబ్రియాన్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. న్యాయవ్యవస్థలో ఉన్నత పదవిని నిర్వహించిన వ్యక్తి మహిళల గౌరవానికి భంగం కలించేలా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. దీనిపై స్పందించిన ఈసీ ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా వివరణ ఇవ్వాలని అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు నోటీసులు జారీచేసింది.

సగటు జీవితకాలం పైపైకి..

- పురుషుల్లో ఐదేళ్లు, మహిళల్లో నాలుగేళ్లు
- 2.6 ఏళ్లు పెరగనున్న ఆరోగ్యకర జీవితకాలం
- దాంతోపాటే పెరుగుతున్న వ్యాధుల ముప్పు
- అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: మానవాళికి శుభవార్త. ప్రపంచ వ్యాప్తంగా మనుషుల సగటు జీవితకాలం పెరుగుతున్నట్లు అంతర్జాతీయ అధ్యయనం ఒకటి వెల్లడించింది. 2022 నుంచి 2050 మధ్య పురుషుల్లో 4.9 సంవత్సరాలు, మహిళల్లో 4.3 సంవత్సరాలు పెరుగుతుందని తేల్చింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్, ఎవాల్యుయేషన్(ఐహెచ్ఎంఈ) నిర్వహించిన గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్(జీబీడీ)–2021 అధ్యయనం వివరాలను లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించారు. ''మొత్తమ్మీద ప్రపంచవ్యాప్తంగా సగటు జీవితకాలం ఐదేళ్ల దాకా పెరుగుతుంది. కానీ అదే సమయంలో వ్యాధుల ముప్పు కూడా బాగా పెరుగుతుంది. గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్ వంటివి ఎక్కువ ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా స్థూలకాయం, అధిక రక్తపోటు వంటివి బాగా వేధిస్తాయి'' అని అధ్యయనం హెచ్చరించింది. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవడం ద్వారా ఈ ముప్పును వీలైనంతగా తగ్గించుకోవచ్చని అధ్యయనం సూచించింది. అధ్యయనం ఇంకా ఏం తేల్చిందంటే...

- సగటు జీవితకాలం పురుషుల్లో ఐదేళ్లు, మహిళల్లో నాలుగేళ్లు పెరుగుతుంది. స్త్రీలలో 71.1 నుంచి 76 ఏళ్లకు, పురుషుల్లో 76.2 నుంచి 80.5 ఏళ్లకు పెరుగుతుంది.
- పూర్తి ఆరోగ్యవంతమైన జీవితకాలం ప్రపంచవ్యాప్తంగా సగటున 2.6 ఏళ్లు పెరుగుతుంది. ఇది 2022లో 64.8 ఏళ్లుండగా 2050 నాటికి 67.4 ఏళ్లకు చేరుతుంది.
- భారత్‌లో 2050 నాటికి పురుషుల సగటు జీవిత కాలం 75 ఏళ్లకు కాస్త పైకి, మహిళల్లో 80 ఏళ్లకు చేరుకుంటుంది.
- మన భారతదేశంలో ఆరోగ్యవంతమైన జీవితకాలం స్త్రీ పురుషులిద్దరిలోనూ సమానంగానే ఉంటుంది. 2050 నాటికి 65 ఏళ్లు దాటేదాకా ఆరోగ్యంగా జీవిస్తారు.
- జీబీడీ–2021 అధ్యయనం కోసం ప్రపంచవ్యాప్తంగా 11,000 సంస్థల సహకారం తీసుకున్నారు. 204 దేశాల నుంచి 371 రకాల వ్యాధులకు సంబంధించిన అంచనాలు, 88 రిస్క్ ఫ్యాక్టర్లను పరిగణనలోకి తీసుకున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా వైద్య సదుపాయాలతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై జనంలో అవగాహన పెరుగుతుండడం సగటు జీవితకాలం పెరుగుదలకు దోహదపడుతోంది.
- జీవితకాలం పెరుగుదల విషయంలో ప్రపంచ దేశాల మధ్య అసమానతలు చాలావరకు తగ్గుతున్నట్లు గుర్తించామని ఐహెచ్ఎంఈ డైరెక్టర్ క్రిస్ ముర్రే చెప్పారు.
- సగటు జీవనకాలం ప్రస్తుతం తక్కువగా ఉన్న దేశాల్లో 2050 నాటికి బాగా పెరగనుందన్నారు. హృద్రోగాలు, కరోనాతో పాటు తీవ్రమైన అంటు రోగాలతో పాటు పౌష్టికాహార లోపం తదితరాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుండటమే అందుకు కారణమని ముర్రే చెప్పారు.
- భావి తరాలు స్థూలకాయం, అధిక రక్తపోటుతో బాగా బాధపడే ఆస్కారముందని అభిప్రాయపడ్డారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 18 । మే । 2024


బెంగళూరు ఆర్‌ఆర్ నగరలోని హెచ్‌వీ హళ్లి చెరువులో తాజాగా వర్షపు నీరు చేరిన దృశ్యం

న్యూస్‌రీల్

ముగ్గురు బాలల జలసమాధి


ప్రమాదం జరిగిన నీటి గుంత

దొడ్డబళ్లాపురం: ఈత సరదా ముగ్గురు బాలల ప్రాణం తీసిన సంఘటన రామనగర తాలూకా అచ్చలు గ్రామంలో చోటుచేసుకుంది. రామనగర సుల్తాన్ నగరకు చెందిన షాబాజ్ (14), సుల్తాన్ (13), రిహాన్ ఖాన్ (16) మృతులు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ ముగించుకుని ముగ్గురు దగ్గరిలోని కొండల్లో నీటి గుంతలో ఈత కొట్టడానికి వెళ్లారు. మధ్యలో పూడికలో చిక్కుకుని నీటమునిగి మరణించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది మడుగులో గాలించి మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. బంధువుల రోదనలతో ఘటనాస్థలి మార్మోగింది.

ఏఈ.. నకిలీ పోలీస్ అవతారం

యశవంతపుర: పోలీస్‌ని అంటూ కొందరు మోసగాళ్లు వంచనలకు పాల్పడడం చూశాం. కానీ బెస్కాం అధికారి కూడా బరితెగించాడు. పోలీసునంటూ రైతులు, ఇతరులను మోసం చేసిన ఉదంతం బెంగళూరులో జరిగింది. వివరాలు.. మల్లేశ్వరం బెస్కాం ఆఫీసులో అసిసెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్న గంగాధరను పీణ్యా పోలీసులు ఈ కేసులో అరెస్ట్ చేశారు. కెఐడిబి నుంచి రైతులకు డబ్బులు ఇప్పిస్తానని నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేశాడు. అలాగే తన కారుకు పోలీస్ జాగృతదళం అని బోర్డు పెట్టుకుని తిరిగేవాడు. హైవేలో ఆ బోర్డు చూపి టోల్ కట్టకుండా వెళ్లిపోయేవాడు. పోలీసు అని ఐడి కార్డును చూపించి పలువురిని బెదిరించాడని బయట పడింది. అతన్ని విచారణ చేపట్టారు.

కూతురిపై తండ్రి అకృత్యం

యశవంతపుర: కంటిపాపలా కాపాడుకోవాల్సిన కూతురిపై తండ్రి కన్నేశాడు. ఆమెపై అఘాయిత్యానికి పాల్పడిన అమానవీయ ఘటన హాసన్ జిల్లా సకలేశపుర తాలూకా ఉదేవార గ్రామంలో జరిగింది. కూలీ కార్మికుడు మంజునాథ్ (34)కు 10 ఏళ్ల కూతురు, 12 ఏళ్ల కొడుకు ఉన్నారు. పాప ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదివేది. తండ్రి ఇటీవల బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక తన అన్నకు విషయం చెప్పడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కిరాతకున్ని అరెస్ట్ చేశారు.

రాజధానిలో వర్షం

బనశంకరి: సిలికాన్ సిటీలో శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వేసవి తాపం నుంచి ఊరట లభించింది. రామకృష్ణ ఆశ్రమం, జేసీ రోడ్డు, నేషనల్ కాలేజీ ప్రాంతంలో భారీ వాన పడింది. లాల్‌బాగ్ రోడ్డు మధ్యలో నీరు నిలవడంతో వాహనాలకు ఆటంకం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజాము 5 గంటల నుంచి సాధారణ వర్షం కురిసింది. మూడురోజుల పాటు బెంగళూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బెంగళూరులో 19వ తేదీ తరువాత మూడురోజుల పాటు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేశారు. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడవచ్చు.

వానల కోసం పూజలు



మండ్య: రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కానీ కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ వానలు లేవు. తీవ్రమైన ఎండ, కరువు వాతావరణం నెలకొంది. మండ్య జిల్లాలో వర్షాలు లేకపోవడంతో నాగమంగల పట్టణంలో వరుణ దేవుని విగ్రహంతో ఊరేగింపు చేశారు. సకాలంలో వర్షాలు లేక పొలం పనులు నిలిచిపోయాయని, రైతులకు ఉపాధి లేదని ప్రజలు వాపోయారు. తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడినట్లు తెలిపారు. ఈ క్రమంలో గంగా మాత, వరుణ దేవునికి పూజలు చేసి అందరూ సుభిక్షంగా ఉండేలా కరుణించాలని ప్రార్థించారు.

ప్రజ్వల్‌ను రప్పిస్తాం: హోంమంత్రి

శివాజీనగర: మహిళలపై లైంగిక దాడులు, నగ్న వీడియోల ఆరోపణ ఎదుర్కొంటున్న హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను భారత్‌కు తీసుకొచ్చే అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని హోంమంత్రి జీ.పరమేశ్వర్ చెప్పారు. ఈ కేసుల్లో సిట్ సమర్థంగా పని చేస్తోందన్నారు. ఏప్రిల్ 27న జర్మనీకి వెళ్లిన ప్రజ్వల్ ఇంతవరకూ దేశానికి రాలేదు. రేవణ్ణను తీసుకొచ్చే పనిలో ఉన్నామని హోంమంత్రి చెప్పడం చర్చనీయాంశమైంది. కాగా, మాజీ మంత్రి హెచ్‌డీ.రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం నగరంలోని 42వ ఏసీఎంఎం కోర్టు విచారించి 20 తేదీకి వాయిదా వేసింది.

అప్పు ఇచ్చి.. తిప్పలు పెడతారు

మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలు
- సులభ రుణం, అధిక వడ్డీల వ్యూహం
- తాళలేక మహిళలు, రైతుల ఆత్మహత్యలు
- నియంత్రణ చర్యలపై తీవ్ర చర్చ




చిరు వ్యాపారులే లక్ష్యంగా మైక్రో ఫైనాన్స్‌లు అధిక వడ్డీలకు అప్పులు ఇస్తాయి


ఫైనాన్స్ సంస్థల బాధితుల్లో మహిళలే అధికం

బనశంకరి: రాష్ట్రంలో ప్రతి గల్లీలో పుట్టుకొచ్చిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళల ఉసురు తీస్తున్నాయి. సులభంగా రుణం ఇచ్చేసి, ఆపై కంతు చెల్లింపు ఆలస్యమైతే వడ్డీ, చక్రవడ్డీ వేసి దోచుకుంటున్నాయి. ఇంటి ముందుకు వచ్చి పరువు తీసే రుణబకాసురుల దౌర్జన్యాలతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఆ సంస్థలకు అడ్డుకట్ట వేయాలని అటు ప్రజాసంఘాలు, ఇటు బ్యాంకులు కోరుతున్నాయి.

బ్యాంకుల్లో కష్టమని..


రోజువారి చిన్న చిన్న వ్యాపారాలు, పనులు చేసుకునేవారు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి రూ. 5 వేల నుంచి లక్ష వరకూ రుణాలు చేస్తుంటారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది చిన్నపాటి ఆర్థిక సంస్థలు రుణ వ్యవహారాలను చేస్తున్నాయి. ప్రముఖ బ్యాంకుల్లో మామూలు ప్రజలు రుణాలు తీసుకోవడం అంత సులభం కాదనే భావన ఉంది. అంతేగాక బ్యాంకుల్లో అప్పులకు కావలసిన డాక్యుమెంట్లు ప్రక్రియ కఠినతరం. కానీ మైక్రో ఫైనాన్స్‌లలో అడిగిన వెంటనే అప్పు అందుతుంది. ఇదే కారణంతో చాలామంది బడుగులు, వ్యాపార మహిళలు మైక్రో ఫైనాన్స్‌ల వైపు చూస్తుంటారు. వీటిని సకాలంలో తీరిస్తే మంచిదే. ఆలస్యమైతే మాత్రం చిక్కులు తప్పవు. అనేక సందర్భాల్లో ఒక రుణం రుణం తీర్చడానికి మరో అప్పు చేయవలసి వస్తుంది. ఫైనాన్స్ సిబ్బందికి కూడా ప్రతి నెలా ఇంత మందికి అప్పులు ఇవ్వాలి, ఇంత వసూలు చేయాలి అని టార్గెట్లు ఉంటాయి. దాంతో వారు ఉదారంగా అప్పులు ఇస్తారు, వసూలు చేయడానికి ఎంత ఆగడమైనా సాగిస్తారు. అక్కడే సమస్య తలెత్తుతుంది.

కట్టకపోతే దౌర్జన్యమే

వీటిలో చాలాసంస్థల సిబ్బంది రుణాల వసూళ్ల సమయంలో మానవత్వం మరిచిపోయి దౌర్జన్యాలకు దిగుతుంటారు. గత 3–4 ఏళ్ల నుంచి వాటి ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై స్పందించిన రాష్ట్ర బ్యాంకర్ల సమితి, కర్ణాటక మైక్రో ఫైనాన్స్ సంస్థలకు కట్టుదిట్టమైన వసూలు చటం ఉండాలని ప్రతిపాదించింది. కొన్ని సంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక స్త్రీలు, రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. రుణ వసూళ్లలో న్యాయం, నైతికత పాటించాలని ఈ సంస్థలకు రిజర్వు బ్యాంకు సైతం సూచించింది. బ్యాంకర్ల సమితి సభ్యులు మాట్లాడుతూ సంస్థల వేధింపుల వల్ల గ్రామాల్లో పరువు పోయిందని అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతోందని తెలిపారు.

ప్రభుత్వం స్పందించాలి

కరువు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు కలెక్టర్లు మైక్రో ఫైనాన్స్ కంపెనీలతో, ఆర్థిక రంగ ప్రముఖులతో సమావేశం నిర్వహించాలని బ్యాంకర్ల సమితి సూచించింది. రుణాలు వసూలు సమయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, వేధింపులు, ఒత్తిడి చేయరాదని సూచించారు. ఏవైనా ఘోరాలు సంభవిస్తే రుణాలు అందించే మైక్రో ఫైనాన్స్ సంస్థలనే నేరుగా బాధ్యులను చేయాలని తెలిపారు.



వడ్డీ భారం మోయలేనంతగా ఉంటుంది

వేధింపుల ఉదంతాలు

- తుమకూరు జిల్లా తిపటూరు తాలూకా ఆరగుప్పకు చెందిన భాగ్యమ్మ మైక్రో ఫైనాన్స్ వేధింపులను తాళలేక రెండువారాల కిందట ఆత్మహత్యకు పాల్పడింది. ఇదే గ్రామంలో 9 మంది మహిళలు వారి ఒత్తిడి భరించలేక ఊరు వదిలిపెట్టారు.
- కొరటగెరె తాలూకాలో బోరుబావి కోసం అప్పు తీసుకున్న రైతు బెదిరింపులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు.
- సిబ్బంది వేధింపులతో చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా దేవీరమ్మ (58) ఆరునెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఇంత జరిగినా ఫైనాన్స్ సిబ్బంది వేధింపులు ఆగవు. మృతుల కుటుంబ సభ్యులైనా రుణం తీర్చాలని ఒత్తిడి చేస్తారు. సులభ రుణం కదా అని తీసుకుంటే వడ్డీల భారం తడిసి మోపెడవుతుంది.

ఆకాశాన్నంటే వడ్డీ రేట్ల బాదుడు

- మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో వాహనాలు, చేతి రుణాలతో కలిపి 10 రకాల రుణ సౌలభ్యం ఉంది
- చేతిరుణాలుగా తీసుకునే అప్పులపై 9.5 నుంచి 25 శాతం వరకు వడ్డీ వేస్తారు
- అవసరాన్ని బట్టి రూ.18 వేల నుంచి రూ. లక్ష వరకు రుణసౌలభ్యం ఉంటుంది
- 36 నెలల వరకు రుణ అవధి ఉంటుంది, వడ్డీ రేటు ఏడాదికి 23 శాతం
- బైక్, స్కూటర్ కొనడానికి రూ.2 లక్షలు వరకు రుణం. వడ్డీ రేటు 26 శాతం ఉంటుంది.
- కంతులు, వడ్డీ చెల్లించకుంటే ఇంటికి వచ్చి దుర్భాషలాడడం, జరిమానాలు విధించడం, విలువైన వస్తువులను కుదువ పెట్టుకోవడం వంటివి చేస్తారు.

చవగ్గా సిమెంటు, కడ్డీలు పేరుతో మోసం

మైసూరు: తక్కువ ధరకు ఇనుప కడ్డీలు, సిమెంట్ ఇప్పిస్తానని చెప్పి అధ్యాపకునికి రూ. 80 వేలు మోసం చేశాడో వ్యక్తి. మైసూరులోని కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సహాయక అధ్యాపకునిగా డాక్టర్ కేసీ నందీశ్ పని చేస్తున్నాడు. చెన్నరాయపట్టణ నివాసి నందా అనే వ్యక్తి ఫోన్ చేసి, తాను ఆర్మీలో పని చేస్తున్నట్లు, నిర్మాణ పని కోసం తీసుకొచ్చిన ఇనుప కడ్డీలు, సిమెంట్ మిగిలిపోయిందని చెప్పాడు. మీకు తక్కువ ధరకు వాటిని ఇస్తానని అన్నాడు. నంద మాటలు నమ్మిన నందీశ్ ఫోన్‌పే ద్వారా అతనికి రూ. 80 వేలు పంపించాడు. సిమెంట్ బస్తాలు, ఇనుప కడ్డీలు వస్తాయని ఎదురు చూడగా ఏమీ రాలేదు. నందాకి కాల్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో బాధితుడు అతని ఇంటికి వెళ్లి విచారించగా గతంలోనూ ఇదేవిధంగా పలువురిని మోసం చేసినట్లు తెలిసింది. జయలక్ష్మీపురం పోలీసు స్టేషన్‌లో నందీశ్ ఫిర్యాదు చేశాడు.

లోకాయుక్త వలలో ఎఫ్‌డీఏ

మైసూరు: ఆహారం సరఫరా చేసిన బిల్లు చెల్లించేందుకు రూ. 30 వేలు లంచం తీసుకుంటూ జిల్లాలోని పిరియాపట్టణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఎఫ్‌డీఏ విజయ్‌కుమార్ లోకాయుక్తకు దొరికారు. పిరియాపట్టణ తాలూకా రావందూరు గ్రామానికి చెందిన నటేశ్ ఆ శాఖకు ఆహారం సరఫరా చేశారు. ఆ బిల్లులను చెల్లించాలని కోరగా, రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీనితో విసుగు చెందిన నటేశ్.. లోకాయుక్తాకు ఫిర్యాదు చేశాడు. లోకాయుక్తా పోలీసులు కేసు నమోదు చేసుకుని విజయ్ కుమార్ లంచం తీసుకుంటుండగా అరెస్టు చేశారు.

కట్టెలతో బాది బాలుని హత్య

బనశంకరి: బహిర్భూమికి వెళ్లిన బాలుని దుండగులు కట్టెలతో కొట్టి హత్య చేశారు. ఈ ఘటన సర్జాపుర పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. కర్నూలు జిల్లా మంత్రాలయానికి చెందిన కూలీ దంపతులు, కొడుకు ప్రాణేశ్ (15)తో కలిసి మూడు నెలల క్రితం ఉపాధి కోసం బెంగళూరు శివార్లలోని ఆనేకల్ తాలూకా నరిగా గ్రామానికి చేరుకున్నారు. 15వ తేదీన బాలుడు బహిర్భూమికి వెళ్లాడు, ఈ సమయంలో ఎవరో దుండగులు కట్టెలతో అతని తల, ఇతర భాగాలపై దాడి చేయడంతో అక్కడికక్కడే చనిపోయాడు. సాయంత్రం పనుల నుంచి వచ్చిన బాలున్ని వెతుకుతూ వెళ్లిన తల్లిదండ్రులు చిన్నారి మృతదేహాన్ని చూసి విలపించారు. సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటర్లకు కొరియర్లో కానుకలు

- ఎమ్మెల్సీ అభ్యర్థి బాగోతం


కొరియర్ గోదాములో స్వాధీనం చేసుకున్న బాక్సులు

దొడ్డబళ్లాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాల పర్వం వెలుగుచూసింది. బెంగళూరు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి రామోజిగౌడ కొరియర్ ద్వారా కానుకలను పంపిస్తున్న సంగతి దేవనహళ్లిలో వెలుగు చూసింది. దీనిపై సమాచారం అందడంతో ఎన్నికల అధికారులు దేవనహళ్లి పట్టణంలోని కొత్త బస్టాండు వద్ద ఉన్న డీటీడీసీ కొరియర్ గోదాంపై దాడి చేసి ఓటర్ల చిరునామాలతో ఉన్న పార్శిళ్లను సీజ్ చేశారు. వందకు పైగా కొరియర్ బాక్సులను గుర్తించారు. డిన్నర్ సెట్లు, టీపాట్లు, కుక్కర్లు వంటివి ఇందులో ఉన్నాయి. అభ్యర్థి పై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

దూసుకొచ్చిన కారు

- స్కూటర్‌ను ఢీ, మహిళ మృతి


మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువు


బోల్తా పడిన కారు

మైసూరు: అదుపుతప్పిన కారు ఒక ప్రాణాల్ని బలిగొంది. స్కూటర్‌ను కారు ఢీ కొట్టడంతో మహిళ అక్కడికక్కడే మరణించింది. మైసూరులోని హెబ్బాళు లేఔట్ నివాసి రాధ (34) మృతురాలు. శుక్రవారం ఉదయం భర్తతో కలిసి స్కూటర్‌లో వెళుతుండగా వేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీ కొట్టి ఆ తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టుకుంటూ వారి స్కూటర్‌ను గుద్దింది. తరువాత పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన రాధా అక్కడికక్కడే మరణించింది. కారులో నాలుగైదు మంది ఉన్నారు. వారందరికి స్వల్ప గాయాలయ్యాయి. వివి పురం ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు. కారు అతి వేగమే కారణమని, డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు తెలిపారు.

షేర్లు.. లాభాలు.. మొదటికే మోసాలు

- మైసూరులో పలువురికి సైబర్ మోసగాళ్ల బురిడీ


ఫోటోషూట్ కోసం వెతికితే..

మైసూరు: రాచనగరి మైసూరులో ఆన్‌లైన్ మోసగాళ్ల ప్రలోభాలకు లొంగి లక్షలాది రూపాయలు మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. తాజాగా మూడు వేర్వేరు కేసుల్లో ముగ్గురు రూ. 23 లక్షలను పోగొట్టుకున్నారు. రాజేంద్ర నగర నివాసి ఎస్.విశ్వాస్‌ను అపరిచిత వాట్సాప్ గ్రూప్‌లో కొందరు చేర్చారు. షేర్ మార్కెట్ గురించి వివరించి దశలవారీగా రూ. 3.70 లక్షలను వసూలు చేశారు. తరువాత మోసగాళ్ల నుంచి స్పందన లేదు. దీంతో విశ్వాస్ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. అలాగే సిద్ధలింగపురకు చెందిన అభిషేక్ కూడా షేర్ మార్కెట్, అధిక లాభాలు అనే మాటలకు ఆశ పడి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన ఖాతాకు రూ. 3.32 లక్షలను పంపించాడు. బాధితులు సైబర్ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. సువర్ణ లక్ష్మి అనే మహిళ మొబైల్‌లో బేబీ ఫోటోషూట్ ప్రకటనను చూసి అక్కడ ఉన్న లింక్ మీద క్లిక్ చేసింది. తరువాత గుర్తు తెలియని వ్యక్తులు తమ వాట్సాప్ గ్రూప్‌లో ఆమెను చేర్చారు. షేర్ మార్కెట్ గురించి అవగాహన కల్పించారు. వారి మాటలు నమ్మి అధిక లాభాలు వస్తాయనే ఆశతో సువర్ణ లక్ష్మి దశలవారీగా రూ. 16.78 లక్షలను మోసగాళ్లకు బదిలీ చేసిన తరువాత మోసగాళ్ల పత్తా లేదు.

జూన్ 1 నుంచి కొత్త చట్టాల అమలు

- పోలీసులు అవగాహన పెంచుకోవాలి
- నగర పోలీస్ కమిషనర్ ఆదేశం



బనశంకరి: ఐపీసీ, సీఆర్‌పీసీతో పాటే దేశంలోని చట్టాలు మారుతున్నాయి, జూన్ 1 నుంచి అమలయ్యే నూతన చట్టాల అమలుకు నగరంలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సమాయత్తం కావాలని నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. శుక్రవారం నగరంలో ఆయన పోలీసుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి అమల్లో ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, సాక్ష్య యాక్ట్‌లకు బదులుగా కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయచట్టం, భారతీయ నాగరిక సురక్షా చట్టం, భారతీయ సాక్ష్య చట్టం రూపొందించింది, జూన్ 1వ తేదీ నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. కొత్త, పాత చట్టాలు, సెక్షన్ల మధ్య తేడాలను తెలుసుకోవాలి. దేశంలో ఒకసారి చట్టం అమల్లోకి వస్తే పాటించడం మన కర్తవ్యం అని కమిషనర్ అన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

రాబోయే కొత్త చట్టాలపై నగరంలో కొందరు పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణనిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఏసీపీలు తమ కింది సిబ్బందిని దీనిపై జాగృతం చేయాలన్నారు. న్యాయ అధికారులు, స్థానిక లా కాలేజీల సహాయం తీసుకుని శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 1 నుంచి ప్రజలు పోలీస్ స్టేషన్‌లో వారి సమస్యలపై ఫిర్యాదు చేస్తే నూతన చట్టాల ప్రకారం కేసుల్ని నమోదు చేస్తామన్నారు. ఏ చట్టం, సెక్షన్ కింద కేసు నమోదు చేయాలి అనే సమగ్ర సమాచారాన్ని 1వ తేదీ లోగా పోలీస్ అధికారులు, సిబ్బంది తెలుసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పని చేయాలని తెలిపారు.

పథకాలపై సీఎం సమీక్ష

శివాజీనగర: కరువుతో ఇబ్బందుల్లో ఉన్న రైతులకు కరువు పరిహార పంపిణీ, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రసాయనిక ఎరువుల, విత్తనాల కొరత కాకుండా జాగ్రత్తలు చేపట్టినట్లు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సమాచారం అందించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సీఎం, నేరుగా అధికారులతో సమావేశాలు జరపడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రంలో ముఖ్యమైన అంశాల గురించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు సీఎంకు వివరాలను అందజేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రసాయనిక ఎరువుల విత్తనాల కొరత లేకుండా చూడాలని సీఎం తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 28కి ఒక ఏడాది పూర్తి చేసుకొంటుంది. ఈ ఏడాదిలో సర్కారు సాధనల గురించి సీఎం సమీక్షించారు. పథకాల అమలు గురించి చర్చించారు. రాష్ట్రంలో 33.50 లక్షల మంది రైతులకు పంట నష్ట పరిహారం అందినట్లు అధికారులు తెలిపారు. తలా రూ.2,400 చొప్పున రూ.476 కోట్లను అందించినట్లు చెప్పారు.




చిత్రాలను తిలకిస్తున్న సందర్శకులు, చిత్రకారులు

హృద్యమైన వర్ణకేళి

- అలరిస్తున్న పెయింటింగ్స్ షో


ప్రదర్శన ప్రారంభోత్సవం

బనశంకరి: నగరంలో ఉరుకుల పరుగుల జీవనంలో అలసిన మనసులకు హృద్యమైన చిత్రలేఖనాలు మదికి ఉత్సాహాన్నిస్తాయి. సిలికాన్ సిటీలో ఎక్స్‌పోజిస్ ఆఫ్ కలర్స్ పేరుతో ఏర్పాటుచేసిన చిత్రలేఖనాల ప్రదర్శన కనువిందు చేస్తోంది. శుక్రవారం జయనగర నాలుగో టీ.బ్లాక్‌లోని బెంగళూరు ఆర్ట్ గ్యాలరీలో వసంత ఆర్ట్స్ చిత్రకారుడు కే.మాల్యాద్రి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటైంది. తెలంగాణ, ముంబై, పాండిచ్చేరి, కర్ణాటకకు చెందిన 20 మంది వర్ధమాన చిత్రకారులు గీసిన నవ్యమైన పెయింటింగ్స్‌ను ఇక్కడ వీక్షించవచ్చు. ప్రకృతి, దేవతలు, పల్లె జీవితం, ఊహా కల్పనలు ఇతివృత్తంగా చేసుకుని కళాకారులు మనసులోని భావాలకు కుంచె ద్వారా చిత్రాలకు జీవం పోశారు. యాక్రిలిక్, క్యాన్వాస్, జల తైల వర్ణాలతో చిత్రలేఖనాలను రూపొందించారు. ఈ ప్రదర్శన 21వ తేదీ వరకు జరుగుతుందని మాల్యాద్రి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రదర్శనను తిలకించవచ్చు. ఈ సందర్భంగా పలువురు కళాప్రియులు చిత్రలేఖనాలను వీక్షించారు.

కరుణించిన వరుణుడు


రాయచూరులోని అరబ్ మొహల్లా వద్ద అండర్‌పాస్‌లోకి చేరిన నీరు


రాయచూరులోని హైదరాబాద్ రహదారిలో నిలిచిన ట్రాఫిక్


రాయచూరు తాలూకాలో భారీ వర్షానికి నీటమునిగిన యద్లాపూర్ రోడ్డు

- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- గాలి వానతో విరిగిన చెట్లు, రోడ్లలో నీరు

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి మార్చి, ఏప్రిల్ రెండు నెలల పాటు విపరీతమైన ఎండలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేశాయి. 45 డిగ్రీల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపటంతో ఎండవేడిమికి తట్టుకోలేక జనం అల్లాడిపోయిన నేపథ్యంలో వరుణుడు కనికరించడంతో వాతావరణంలో కాస్త మార్పు వచ్చింది. గురువారం రాత్రి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ వర్షం పడటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గాలి బాగా వీచి, వాన జోరుగా కురవడంతో నగరంలో పలు కాలనీల్లో చెట్లు నేలకొరిగాయి. భగభగమండే ఎండల్లో గాలి, వాన రావడంతో నగరంలో పలు రోడ్లలోని గుంతల్లో నీరు నిలబడ్డాయి. వాతావరణం చల్లబడటంతో నగర వాసులు ఊరట చెందారు. ఎండవేడిమికి అల్లాడిపోతున్న ప్రజలకు వాన రావడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. వానతో పాటు గాలి కూడా జోరుగా రావడంతో చెట్లు కూలిపడిపోయాయి. రోడ్లలో అక్కడక్కడ చెట్లు పడిపోయిన దృశ్యాలు కనిపించాయి. ఓ మోస్తరు వానకే నగరంలోని మట్టిరోడ్లలో నీరు నిలిచాయి.

భారీ వర్షం.. లోతట్టు జలమయం

రాయచూరు రూరల్: జిల్లాలో శుక్రవారం తెల్లవారు జామున ఒంటి గంటకు జడి వానగా ప్రారంభమై ఐదు గంటల వరకు భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్లు బురద గుంటలుగా మారాయి. నాలుగు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో నగరంలోని గాంధీ చౌక్, మున్నూరు వాడి, కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చొరబడ్డాయి. అరబ్ మొహల్లా కాలనీ పక్కనే ఉన్న అండర్‌పాస్‌లోకి వర్షపు నీరు చేరాయి. రాయచూరు–హైదరాబాద్ ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాలూకాలోని బిచ్చాలి పరిధిలోని యద్లాపూర్ వద్ద భారీ వర్షానికి రోడ్డు నీటమునగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

కేజీఎఫ్‌ను ముంచెత్తిన వర్షం

కేజీఎఫ్ : నగరంలో గురువారం రాత్రి కురిసిన భారీ వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరంలోని మినీ విధాన సౌధ ప్రాంగణం చుట్టూ నీరు చేరి ప్రజలు కార్యాలయంలోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. మినీ విధాన సౌధ చుట్టూ డ్రైనేజీ అశాస్త్రీయంగా నిర్మించడం వల్ల వర్షం వచ్చిందంటే మినీ విధాన సౌధ ముందు భాగంతో పాటు చుట్టూ నీరు చేరి పని నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. వివిధ శాఖల కార్యాలయాలు, తాలూకా కార్యాలయం ఒకే చోట ఉండడం వల్ల పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ పనుల కోసం వస్తుండడం వల్ల వర్షం వచ్చిందంటే మినీ విధానసౌధ ప్రాంగణం మరింత అధ్వానంగా తయారవుతోంది. తాలూకా కార్యాలయం మాత్రమే కాకుండా కేఎస్ఆర్టీసీ డిపో ముందు కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అశాస్త్రీయంగా నిర్మించిన డ్రైనేజీలను సరి చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


జలమయమైన మినీ విధానసౌధ ప్రాంగణం


బళ్లారిలో గాలీ వానకు విరిగిన చెట్టు కొమ్మలు


బళ్లారిలో ఓ రోడ్డులోని గుంతలో నిలిచిన వర్షపు నీరు

క్లుప్తంగా

నీరు లేక వైద్య కళాశాల హాస్టల్‌కు సెలవు

బనశంకరి: తాగేందుకు, ఇతర అవసరాలకు నీరు లేకపోవడంతో కళాశాల హాస్టల్‌కు సెలవు ప్రకటించారు. వివరాలు..తీవ్ర వర్షాభావంతో తుంగభద్రా నది ఎండిపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో హాహాకారాలు మొదలయ్యాయి. గదగ్ జిమ్స్ వైద్యకళాశాల హాస్టల్, సిబ్బంది క్వార్టర్స్‌కు నీరు సరఫరా కాలేదు. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గత్యంతరం లేక వారం రోజుల పాటు సెలవులు ప్రకటించారు.

గుర్రం తెచ్చిన తంటా.. వరుస ప్రమాదాలు


ధ్వంసమైన కారు

దొడ్డబళ్లాపురం: రద్దీగా ఉన్న రోడ్డుపైకి గుర్రం అడ్డు రావడంతో అదుపుతప్పిన వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 5మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మాగడి తాలూకాలో చోటుచేసుకుంది. తిప్పసంద్ర హ్యాండ్ పోస్ట్ సమీపంలో మాచోహళ్లి గేట్ వద్ద శుక్రవారం వాహనాలు వేగంగా వెళ్తుండగా ఒక గుర్రం హఠాత్తుగా రోడ్డుకి అడ్డంగా వచ్చింది. దానిని తప్పించేందుకు కారును పక్కకు తిప్పగా దాని వెనుక వస్తున్న గ్యాస్ ట్యాంకర్, కేఎస్ఆర్టీసీ బస్సు, మరో కారు వరుసగా ఢీకొన్నాయి. ఇద్దరు పిల్లలతో కలిపి మొత్తం 5మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బెంగళూరు ఆస్పత్రికి తరలించారు.సోలూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

క్రిష్ణగిరి: కావేరిపట్టణం ప్రాంతంలో గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. వివరాల మేరకు ఇన్‌స్పెక్టర్ బాలాజి, పోలీసులు గురువారం రాత్రి ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా గంజాయి విక్రయిస్తున్న ముఠా కంటబడింది. పోలీసులు వెంటనే వారిపై దాడి చేసి ఇద్దరిని పట్టుకొన్నారు. విచారణలో అదే ప్రాంతానికి చెందిన శాంతకుమార్(24), పూంగావనం(49) అని తెలిసింది. దినేష్(24), తిమ్మరాయన్(25), విఘ్నేష్(28), మణిభారతి(24) అనే వారు పరారయ్యారు.

మాల్ పునః ప్రారంభం

బనశంకరి: ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తామని మాల్ నిర్వాహకులు హైకోర్టుకు తెలపడంతో శుక్రవారం ఆ మాల్ తలుపులు తెరుచుకున్నాయి. నగరంలోని ఒక ప్రముఖ మాల్‌కు బీబీఎంపీ తాళం వేయడాన్ని ప్రశ్నిస్తూ యజమాని అభిషేక్ ప్రాప్ బిల్డ్ ప్రైవేటు లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జ్యోతిమూలిమనితో కూడిన ఏకసభ్య పీఠం విచారణ చేపట్టింది. జూలై 31లోగా రూ.20 కోట్లు బీబీఎంపీకి చెల్లిస్తామని ఆ సంస్థ హైకోర్టుకు హామీ ఇచ్చింది. జూన్ 1లోగా రూ.3.5 కోట్ల ఆస్తిపన్ను బీబీఎంపీకి చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. మాల్‌కు వేసిన తాళం శుక్రవారం ఉదయానికల్లా తొలగించాలని సూచిస్తూ షరతులతో కూడిన మధ్యంతర ఆదేశాలు కోర్టు జారీచేసింది. శుక్రవారం ఉదయం పాలికె అధికారులు మాల్‌కు వేసిన తాళం తీయడంతో యథాప్రకారం కార్యకలాపాలు నిర్వహించారు.

ఎక్స్‌ప్రెస్ వేలో ట్రాఫిక్ ఉల్లంఘనలు

యశవంతపుర: మైసూరు–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వేలో కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదని రాష్ట్ర ట్రాఫిక్ విభాగం ఏడీజీపీ అలోక్‌కుమార్ రావాణాశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సదరు డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ బస్సులు డ్రైవ్ చేస్తున్నారన్నారు. ఈ నెల 11న చెన్నపట్టణ వద్ద కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుతున్నట్లు సీసీ కేమెరాలో నమోదైన దృశ్యాన్ని ఎక్స్‌లో విడుదల చేశారు. 15 రోజుల్లో 12, 192 ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగినట్లు తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు డ్రైవర్‌కు రూ. 1500 జరిమానా విధించినట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న కేఎస్ ఆర్టీసీ డ్రైవర్

వైట్ ట్యాపింగ్ రోడ్లు తవ్వొద్దు

బనశంకరి: కోట్లాదిరూపాయల ఖర్చుతో నిర్మించిన వైట్ ట్యాపింగ్ రోడ్లను తవ్వేవారికి బీబీఎంపీ షాక్ ఇచ్చింది. ప్రతికిలోమీటరుకు రూ.15 నుంచి 18 కోట్లు వ్యయంచేసి నిర్మించిన వైట్ ట్యాపింగ్ రోడ్లను ఓ సంస్థ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వుతున్న వైనంపై బీజేపీ నేత ఎన్ఆర్.రమేశ్ బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ లేఖ రాశారు. దీంతో ఆ రోడ్లలో తవ్వకాలు చేపట్టవద్దని కమిషనర్ ఆదేశించారు. తవ్వకాలకు ఇచ్చిన అనుమతి ఆదేశాలను రోడ్లు, మూలభూత సౌకర్యాల శాఖ ఇంజనీర్ వెనక్కి తీసుకున్నారు. నాశనం చేసిన రోడ్లను తక్షణం పూర్తిగా తారురోడ్డు వేయాలని ప్రైవేటు సంస్థ కాంట్రాక్టరుకు సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి


అధ్యాపకులను ఓటు అడుగుతున్న శ్రీనివాస్

చింతామణి: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న శ్రీనివాస్ శుక్రవారం పట్టణంలోని కాలేజీలను సందర్శించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలసి తనకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు సయయద్ ఎజాజ్, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, బాబు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన డీఐజీ

యశవంతపుర: రైలులో జరిగిన దాడిలో గాయపడి బెళగావి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీటీ, కోచ్ హెల్పింగ్ సిబ్బందిని డీఐజీ శరణప్ప శుక్రవారం పరామర్శించారు. బెళగావి జిల్లా ఖానాపుర లోండా వద్ద రైలు వెళ్తుండగా టికెట్ విషయంపై కొందరు వ్యక్తులు టీటీపై దాడి చేశారు. టీటీకి సాయంగా వచ్చిన కోచ్ హెల్పింగ్ స్టాఫ్‌పై దాడి చేశారు. ఘటనలో దేవర్షి వర్మ అనే వ్యక్తి మృతి చెందాడు. గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను డీఐజీ పరామర్శించారు. దేవర్షి కుటుంబానికి రైల్వేశాఖ ద్వారా పరిహారం ఇప్పిస్తామన్నారు. నిందితులను పట్టుకోవటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రైల్వే ఎస్పీ సౌమ్యలతాతో చర్చించారు.

ఇకపై గ్రేస్ మార్కులు కలపరు

శివాజీనగర: వచ్చే విద్యా సంవత్సరం నుంచి గ్రేస్ మార్కులు కలిపే విధానాన్ని రద్దు చేయాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. ఏటా ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు 20 గ్రేస్‌మార్క్స్ ఇస్తున్నారు. ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ఉపసంహరించుకుంది. విధానసౌధలో సీఎం, డీసీఎం నేతృత్వంలో జరిగిన విద్యాశాఖ సీనియర్ అధికారులతో జరిగిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఎట్టకేలకు అంజలి హంతకుడు అరెస్ట్

- వెల్లడించిన పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్


కిమ్స్‌లో నిందితుడు విశ్వ, మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్

హుబ్లీ: నగరంలోని వీరాపుర ఓణికి చెందిన అంజలి అనే అమ్మాయిని ఈ నెల 15న ఉదయం దారుణంగా చాకుతో పొడిచి హత్య చేసిన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. అంజలిని పొడిచి పరారైన నిందితుడిని దావణగెరెలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉదయం అంజలిని హత్య చేసిన నిందితుడు విశ్వనాథ అలియాస్ గిరీష్ సావంత్ స్థానిక గోకుల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కి దావణగెరెకు వెళ్లాడు. అక్కడ సంచరిస్తున్న నిందితుడిని ప్రజలు గుర్తించి దేహశుద్ధి చేశారని తెలిసింది. ఈ క్రమంలో దావణగెరె పోలీసులు, హుబ్లీ పోలీసులు కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై మీడియాతో జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ మాట్లాడుతూ విశ్వనాథ్ అలియాస్ గిరీష్ సావంత్‌ను హుబ్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

ఆస్పత్రిలో కోలుకుంటున్న వైనం

ప్రజల చేతిలో దేహశుద్ధికి గురి కావడంతో తల, ముఖంపై బాగా దెబ్బలు తగలడంతో నిందితుడు మాట్లాడలేని స్థితిలో ఉన్నాడన్నారు. అతను కోలుకున్న వెంటనే పోలీస్ కస్టడీలోకి తీసుకొని అంజలిని హత్య చేసిన వివరాలను కూపీ లాగుతామని ఆమె వివరించారు. కాగా అరసీకెరె రైల్వే స్టేషన్‌లో జనరల్ బోగీ ఎక్కిన నిందితుడు గిరీష్ ఎదురుగా ఉన్న మరో తోటి మహిళను చెడు దృష్టితో చూశాడని చిక్కజాజూరు రైల్వే స్టేషన్ మార్గంలో ఆ మహిళ బాత్రూమ్‌కు వెళ్లగా ఆ మహిళను వెండించిన నిందితుడు బాత్రూం కిటికీ ద్వారా తొంగి చూశాడన్నారు. దీన్ని పసిగట్టి ఆ మహిళ మీకు అక్కచెల్లెళ్లు లేరా? అని దబాయించడంతో నిందితుడు మహిళను చాకు చూపించి బెదిరించాడన్నారు. దీంతో మహిళ గట్టిగా అరవగా భర్త, తోటి ప్రయాణికులు వచ్చి విశ్వను బాగా చితకబాదినట్లుగా తెలిసింది. గదగ్‌కు చెందిన లక్ష్మీ, భర్త మహంతేష్ సవణూరు దావణగెరె రైల్వే పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

గతమంతా నేరాలమయమే

తుమకూరు నుంచి విశ్వమానవ ఎక్స్‌ప్రెస్ రైల్లో భర్తతో పాటు ప్రయాణిస్తుండగా నిందితుడు గిరీష్ దాడి చేశాడు. మొత్తానికి గిరీష్ గతమంతా నేరాలమయంగానే తెలుస్తోంది. కాగా ఆ రైల్లో ప్రయాణికులతో దెబ్బలు తిన్న గిరీష్ సంచరిస్తున్న రైల్లో నుంచే కిందకు దూకాడు. ఆ సమయంలో దావణగెరె రైల్వే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని చిగటేరి జిల్లా ఆస్పత్రిలో చికిత్స ఇప్పించారని తెలిసింది. మాయకొండ వద్ద రైలు నుంచి గిరీష్ దూకగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో పోలీసులకు హుబ్లీ అంజలి హంతకుడు ఇతడేనని ముందుగా పసిగట్టలేక పోయారు. ఆ తర్వాత నిందితుడిని తీరా గమనించాక అంజలి అంతకుడు ఇతడే అని గుర్తించి హుబ్లీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం రాత్రే హుబ్లీ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా గిరీష్ మైసూరులోని మహారాజ హోటల్‌లో పని చేసేవాడని, అంజలి తాను పరస్పరం ప్రేమించుకున్నట్లుగా ఆ మేరకు 15 రోజుల క్రితం ఆలయంలో పెళ్లి చేసుకున్నట్లు కూడా నిందితుడు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

అంజలికి రూ.2 వేలు ఫోన్‌పే

అంజలి రూ.2000 ఫోన్ పే చేయమని అడగగా ఫోన్ పే చేశాడన్నారు. అనంతరం తన ఫోన్ నెంబర్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టి ఫోన్ చేసినా రిసీవ్ చేయలేదని, ఆ అక్కసుతో మైసూరు నుంచి హుబ్లీకి వచ్చి బుధవారం తెల్లవారు జామున అంజలిని మట్టుబెట్టినట్లుగా నిందితుడు పోలీసులకు ఇచ్చిన వివరాలను బట్టి తెలుస్తోంది. హత్య చేశాక నిందితుడు హుబ్లీ కొత్త బస్టాండ్ నుంచి బస్సులో హావేరి బయలుదేరి వెళ్లాడు. అనంతరం హావేరి నుంచి మైసూరుకు వెళ్లాడు. అక్కడ మహారాజ హోటల్‌లో బుధవారం నిద్ర చేసి తిరిగి మైసూరు నుంచి హుబ్లీకి రైల్లో వస్తుండగా తోటి మహిళా ప్రయాణికురాలిని అసభ్యంగా చూడటంతో సదరు ప్రయాణికులు దేహశుద్ధి చేయగా ఆ రైలు నుంచి ఉన్నఫళంగా కిందకు దూకానని, ఈ క్రమంలో దావణగెరె పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. కాగా నిందితుడి ఆరోగ్య పరిస్థితి రీత్య కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించామని, కోలుకున్న వెంటనే పూర్తి దర్యాప్తు ప్రారంభిస్తుమని ఆమె తెలిపారు. నిందితుడిపై నాలుగు బైక్ చోరీ కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలను దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడిస్తామన్నారు.

కోలారు వార్తలు...

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు


జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్

శ్రీనివాసపురం: రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించినందునే విద్యార్థులు, మహిళలు ఒకరి తరువాత ఒకరు హత్యకు గురవుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ వేణుగోపాల్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యార్థిని నేహా హత్య ఘటన మరువక ముందే మరో యువతి అంజలి అంబిగేర దారుణ హత్యకు గురైందన్నారు. కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు కరువయ్యాయన డానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. అంజలి అంబిగేరను దారుణంగా హత్య చేసిన వ్యక్తిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు కారణాలు తెలుసుకుని మృతురాలి కుటుంబానికి పరిహారం అందించి న్యాయం చేయాలన్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మాలూరు: ప్రసిద్ధ మారికాంబ ఆలయ సమీపంలోని ఖాళీ స్థలంలో రూ.40 లక్షల వ్యయంతో భక్తుల అనుకూలం కోసం షెడ్‌ను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం ట్రస్టు ఆధ్వర్యంలో షెడ్ నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణంలోని మారికాంబ ఆలయం జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే ఎంతో ప్రఖ్యాతి గాంచిందన్నారు. అన్ని సముదాయాల వారు అమ్మవారిని కొలుస్తున్నారన్నారు. కరోనా సమయంలో మారికాంబ ఆలయ ట్రస్టు అందించిన సేవలు అపారమన్నారు. ప్రతి నిత్యం వేలాది మందికి అన్నదానం చేశారన్నారు. పలు సేవా కార్యక్రమాలతో మారికాంబ ఆలయం ప్రజల ఆస్తిగా మారిందన్నారు. ట్రస్టు అధ్యక్షుడు పి.వెంకటేష్, నంజుండప్ప, వెంకటేష్, తబలా నారాయణప్ప, బుల్లెట్ వెంకటేష్ పాల్గొన్నారు.

సీబీఐతో దర్యాప్తునకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: నగరసభలో అవినీతి, అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరసభ కమిషనర్ శివానందకు వినతిపత్రం సమర్పించి ఆయన మాట్లాడారు. నగరసభలో డబ్బులు ఇవ్వనిదే ఏ పనీ జరిగని పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా ఇంచార్జి మంత్రి నగర సమస్యలను పట్టించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుండడం వల్ల నగరసభలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరి పోయాయన్నారు. నగరసభ కార్యాలయంలో దళారుల బెడద అధికంగా ఉందన్నారు. ఏ పని కావాలన్నా దళారులతోనే చేయించుకోవాల్సి వస్తోందన్నారు. దీని వల్ల డబ్బులు ఇవ్వనిదే ఏ పని జరగడం లేదన్నారు. నగరసభ కార్యాలయంలో చాలా ఏళ్లగా అధికారులు, సిబ్బంది పాతుకు పోవడం వల్ల వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అందువల్ల సీబీఐతో విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


అపరిచిత వ్యక్తి మృతదేహం

మాలూరు : పట్టణంలోని బస్టాండు ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు మరణించిన ఘటన చోటు చేసుకుంది. మరణించిన వ్యక్తి పేరు, చిరునామా తెలియరాలేదు. మృతుడికి సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయసు ఉంటుంది. సంబంధీకులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని లేదా మరిన్ని వివరాల కోసం 9480802632, 9480802650, 08151–232220 నెంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


గ్రామ దేవతల పూజలో పాల్గొన్న నాయకులు

కోలారు: దేవుడి ఆశీర్వాదంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తానని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. శుక్రవారం తాలూకాలోని సూలూరు గ్రామంలో గ్రామ దేవతల పూజా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న నిధులను సక్రమంగా వినియోగించడం ద్వారా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అందరి సహాయ సహకారాలతో సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తానన్నారు. గ్రామ దేవతల పూజలో అన్ని వర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో కలిసికట్టుగా పాల్గొనడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, సూలూరు జీపీ అధ్యక్షుడు పెమ్మశెట్టిహళ్లి సురేష్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు జంజిమలె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ పెన్నా.. కాలుష్యం చూడన్నా


కెలవరపల్లి రిజర్వాయర్


దక్షిణ పెన్నానదిలో పేరుకుపోతున్న నురుగు

- మురుగునీరు, ఫ్యాక్టరీల వ్యర్థాలు నదిలోకే
- పెద్ద ఎత్తున నురుగు ప్రవాహం
- ఉపయోగానికి పనికిరాని జలం

హోసూరు: నది అంటే ఎంతో అపురూపమైనది. ఎంత కష్టమైనా నదిని కాపాడుకోవడం అందరి విధి. స్వచ్ఛమైన నీటితో సమాజానికి సంపదలా ఉండే నదులు కొందరి స్వార్థం వల్ల కలుషిత కేంద్రాలుగా మారాయి. అదే మాదిరిగా హోసూరు సమీపంలో ప్రవహిస్తున్న దక్షిణ పెన్నానదిలో రసాయన వ్యర్థాలు కలవడంతో నీరు పూర్తిగా కలుషితమైంది. నదిలో నురుగు నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్లు వెళ్లే పొలాల్లో పంటలు పండడం లేదని, శాఖాధికారులు నదిలో రసాయన వ్యర్థాలు కలిపేవారిపై కఠిన చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నంది కొండల్లో జన్మించి

కర్ణాటక రాష్ట్రం నంది కొండల్లో పుట్టే దక్షిణ పెన్నానది బెంగళూరు మహానగరంలో వెలువడే మురుగునీటితో కలిసి వర్తూరు చెరువుకు చేరుకొని అక్కడి నుంచి కర్ణాటక– తమిళనాడు సరిహద్దు కొడియాళం వద్ద తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. ఇక్కడి నుంచి హోసూరు సమీపంలోని ఆవులపల్లి వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌పి డ్యాంకు చేరుతుంది.

ఫ్యాక్టరీల వ్యర్థాలు కలిసి

గత కొద్దిరోజులుగా దక్షిణ పెన్నా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో వరద నీటి ప్రవాహం పెరుగుతూ వచ్చింది. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రైవేట్ ఫ్యాక్టరీల వ్యర్థాలు, మురుగునీటిని నదిలోకే వదులుతున్నారు. ఫలితంగా నది మురుగునీటితో నిండిపోయి ప్రవహిస్తోంది. కెలవరపల్లి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీటిలో పెద్ద మొత్తంలో నురుగు పేరుకుపోయింది. హోసూరు, సూళగిరి తాలూకాల్లో పెద్ద ఎత్తున రైతులు కెలవరపల్లి రిజర్వాయర్ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ కలుషిత నీటి వల్ల పంటలు పండడం లేదని, నది నీటిని స్వచ్ఛం చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నీటిని తాగడానికి, ఇళ్లలో వాడడానికి కూడా పనికిరావడం లేదని చుట్టుపక్కల గ్రామాలవాసులు తెలిపారు. పశువులు తాగితే రోగాల పాలవుతున్నాయని చెప్పారు.

క్లుప్తంగా

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

యశవంతపుర: గ్యాస్ సిలిండర్ లీక్ అయ్యి పేలుడు సంభవించి ఇల్లు దగ్ధమైంది. ఈఘటన ఉత్తర కన్నడ జిల్లా కార్వార తాలూకా నందనగద్దాలో జరిగింది. నిలేశ్ తాశేకర్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం తన ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావటంతో సిలిండర్ పేలింది. ఇల్లు మొత్తం మంటలు వ్యాపించి దుస్తులు, ఫర్నీచర్, వంట సామగ్రి, వాషింగ్ మిషన్ కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చిమంటలు ఆర్పివేశారు. రూ.8 లక్షల మేర నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: హాస్టల్ గదిలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూర్యసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అరసీకెరె తాలూకా కరడిహళ్లి గ్రామానికి చెందిన హర్షిత(21) హీలలగి వద్ద ఉన్న బీఈసీటీ ప్రైవేటు కాలేజీలో బీఈ చదువుతోంది. కాలేజీ ఆవరణలోనే ఉన్న హాస్టల్‌లో ఉంటోంది. హాస్టల్ గదిలో ఈమెతో పాటు ఉంటున్న విద్యార్థినులు స్వంత ఊర్లకు వెళ్లారు. ఒంటరిగా ఉన్న ఆమె గురువారం రాత్రి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సూర్యసిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గర్భిణులకు రక్త పరీక్షలు

కృష్ణరాజపుర: ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా బెంగళూరు నగర జిల్లా కృష్ణరాజపుర ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం 60 మంది గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించారు. బెంగళూరు తూర్పు తాలూకా ఆరోగ్య అధికారులు డాక్టర్ కోమల, డాక్టర్ అశోక్‌రెడ్డి, స్త్రీరోగ నిపుణులు డాక్టర్ లీలా సంపత్, ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, ఎన్‌సీడీ విభాగం నిపుణుడు డాక్టర్ సుకేశ్ అధిక రక్తపీడనంపై అవగాహన కల్పించారు.

ప్రయాణికురాలి మృతి


బస్సు సీటులో విగతజీవిగా సయ్యద్‌భాను

విజయపుర: కేఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ తాను కూర్చున్న సీటులోనే ప్రాణాలు విడిచింది. ఈ ఘటన విజయపురలో జరిగింది. చిక్కబళ్లాపురకు చెందిన సయ్యద్‌భాను కోలారు నుంచి కేఎస్ఆర్టీసీ బస్సులో విజయపుర చేరుకుంది. బస్టాండ్ వద్ద ప్రయాణికులు కిందకు దిగుతున్న సమయంలో సయ్యద్‌భాను కదలిక లేకుండా ఉండాన్ని గమనించారు. డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపేశాడు. పట్టణ పోలీసులు చేరుకుని పరిశీలించగా ఆమె మృతి చెందినట్లు తేలింది. మృతురాలి వద్ద లభించిన ఆధారాలతో ఆమెను సయ్యద్‌భానుగాగుర్తించి బంధువులకు సమాచారం అందించారు.

అటవీశాఖకు జింక అప్పగింత


జింకను చూపుతున్న ప్రజలు

చింతామణి: పట్టణ శివార్లలోని కన్నంపల్లి పక్కన ఉన్న కొండ ప్రాంతాల నుంచి శుక్రవారం ఒక జింక పట్టణంలోకి వచ్చింది. డబుల్ రోడ్డులో వెళ్తుండగా కుక్కలు దాడికి యత్నించాయి. ఆ ప్రాంతవాసులు గమనించి కుక్కలను తరిమి జింకను రక్షించారు. అనంతరం అటవీశాఖ అధికారి చందన్‌కు అప్పగించారు. కుక్కల దాడితో బెదిరిన జింక స్వల్ప అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స అనంతరం అడవిలో వదిలేశారు.

అడ్డగించి బైక్ దోపిడీ

మైసూరు: బైకిస్టును బెదిరించి బైక్‌ను లాక్కెళ్లిన ఘటన మైసూరు తాలూకా వాజమంగల గ్రామంలో జరిగింది. చిక్కహళ్లి వద్ద ఉన్న జీఎల్ గార్డెన్ లేఔట్‌లో వాచ్‌మెన్‌గా వి.శ్యామసుందర్ గురువారం రాత్రి బైక్‌లో వెళుతున్నాడు. ఇద్దరు వ్యక్తులు అతనిని అడ్డగించి దాడికి యత్నించారు. వీరి దాడికి భయపడి శ్యామసుందర్ బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. దుండగులు ఆ బైక్‌ను తీసుకుని పారిపోయారు. వరుణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

వానరాలకు దశదిన కర్మలు


వానరాలను ఖననం చేసిన ప్రాంతంలో పుణ్యతిథి నిర్వహిస్తున్న గ్రామస్తులు

మండ్య: చనిపోయిన మూడు వానరాలకు అంత్యక్రియలు చేయడమే కాకుండా 11వ రోజు పుణ్యతిథి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఘటన పట్టణంలోని హారోహళ్లి గ్రామంలో జరిగింది. సిపాయి కరియప్ప పొలంలో ఈనెల 7న మూడు వానరాలు అకస్మాత్తుగా మరణించాయి. గ్రామస్తులంతా కలసి వానరాలకు అంత్యక్రియలు నిర్వహించారు.11వ రోజు సందర్భంగా శుక్రవారం పువ్వులు, తులసీ హారాలతో వానరాల చిత్రపటానికి అలంకరించి అవి ఇష్టపడే ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. దీపాలు, అగరబత్తీలు వెలిగించి సాంబ్రాణి ధూపాన్ని వేశారు. అనంతరం అన్నదానం చేశారు.

సైన్స్‌కు నిలయం... డాక్టర్ హెచ్‌ఎన్ విజ్ఞాన కేంద్రం


సైన్స్ సెంటర్‌లోని ఒక నమూనా వద్ద సందర్శకులు


మంగళ గ్రహంపై దింపిన ఉపగ్రహం నమూనా


ఖగోళ రహస్యాలు తెలిపే నక్షత్రశాల

- ఖగోళ వింతలు విశేషాలు తెలిపే నక్షత్రశాల
- శబ్ద తరంగాలను తెలిపే సౌండ్ గార్డెన్
- ఆధునిక గ్రంథాలయం
- పూర్వీకుల చరిత్రను తెలిపే శిలాశాసనాలు

గౌరిబిదనూరు: తాలూకాలోని కోటాలదిన్నె సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కర్ణాటక విజ్ఞాన తంత్రజ్ఞాన సొసైటీ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ హెచ్ నరసింహయ్య పేరుతో ఏర్పాటు చేసిన సైన్స్ సెంటర్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. విద్యార్థుల మెదడుకు పదును పెడుతోంది. భౌతికశాస్త్రంపై మక్కువ ఉన్నవారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతోంది. బాహ్యాకాశంలోని వింతలు, నక్షత్రాలు, సూర్య చంద్రుల గతులను తెలుసుకునేందుకు ఇక్కడ సదుపాయాలుఉన్నాయి. ఇక్కడ ప్లానిటోరియం (నక్షత్ర శాల) సైతం ఉంది. మనం అంతరిక్షంలో పయనించే అనుభూతి కలిగించే ప్రదర్శనలు ఇక్కడ ఏర్పాటు చేస్తారు. సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ సైన్స్ సెంటర్‌ను అభివృద్ధి పరచాలనేది ప్రభుత్వ ఆశయం . ప్రస్తుతానికి సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో భౌతశాస్రానికి సంబంధించిన విషయాలను తెలిపే నమూనాలు ఉంచారు. నీటి నిర్వహణను తెలిపే పరికరాలను, బ్యాలెన్స్, అయస్కాంత శక్తి, భూభ్రమణం, న్యూటన్ సిద్ధాంతాలను తెలిపే పరికరాలను ఈ సెంటర్‌లో ఉంచారు. ఇది కేవలం వస్తు ప్రదర్శన కాకుండా విద్యార్థుల అధ్యయనానికి ఉపయోగపడేలా రూపొందిస్తున్నారు. ఇక్కడ ఉద్యానవనం, జంతర్ మంతర్‌ను తెలిపే గణిత గార్డెన్, శబ్దతరంగాలను తెలిపే సౌండ్ గార్డెన్, గ్రంథాలయం, ఆడిటోరియం, మానవుని పుట్టుక వికాసానికి సంభంధించిన గ్యాలరీలు ఉన్నాయి. వినోద విజ్ఞానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేశారు. పూర్వీకుల చరిత్రను తెలిపే శిలాశాసనాలను ఇక్కడ సంరక్షిస్తున్నారు. సామాన్య ప్రజల్లో మూఢనమ్మకాలను పోగొట్టి, శాస్త్రీయభావాన్ని పెంచి తంత్రజ్ఞానం పట్ల ఆసక్తిని, కుతూహలాన్ని కలిగించడానికి ఈ సైన్స్ పార్క్ ఏర్పాటు చేశారని ఇక్కడి కేర్ టేకర్ ప్రభు తెలిపారు. హెచ్ నరసింహయ్య ఉప ప్రాదేశిక విజ్ఞాన కేంద్రం విద్యార్థులకు చాలా ప్రయోజన కారిగా ఉందని జాతీయ స్థాయిలో పేరు గాంచిన విజ్ఞాని కేపీజే రెడ్డి పేర్కొన్నారు. అప్పటి శాసనసభ్యుడు శివశంకరరెడ్డి, నాగరాజప్ప, వెంకటేశ్ మొదలైనవారి చొరవతో ఈ విజ్ఞాన కేంద్రం ఏర్పడిందన్నారు.


నీటి నిర్వహణ నమూనా


శిలాఫలకం


సైన్స్‌ను బోధిస్తున్న ఉపాధ్యాయుడి నమూనా



కిందపడకుండా ఎగిరే బంతి

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మైసూరు: జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు ఇద్దరిని బలిగొన్నాయి. హుణసూరు తాలూకా కట్టెమళలవాడి సమీపంలోని శిరేనహళ్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరూరుకు చెందిన సాగర్ అనే యువకుడు మృతి చెందాడు. ఇతను తన ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌లో హెబ్బాళు గ్రామం నుంచి మరూరు కావలు గ్రామానికి వెళ్తున్నారు. కిత్తూరు గ్రామానికి చెందిన కెండగణ్ణ స్వామి అనే వ్యక్తి హుణసూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. సిరేనహళ్లి వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో సాగర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులకు స్వల్ప గాయాలయ్యాయి. హుణసూరు గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

పాల వాహనం ఢీకొని...

పాల వాహనం ఢీ కొని యువకుడు మరణించిన ఘటన మైసూరు చిక్కనహళ్లి వద్ద జరిగింది. మైసూరు తాలూకా హోసకోటె నివాసి సచిన్ (26), ఇతని స్నేహితులు భీమనహళ్లి మహదేవ స్వామి, జయరామ్, ఆనంద్‌లు ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నారు. కంపెనీలో పని ముగించుకొని హోటల్‌లో భోజనం పార్శిల్ తీసుకుని ఇలావాల–చిక్కనహళ్లి మధ్య ఉండే ఖాళీ స్థలంలో కూర్చొని భోజనం చేశారు. అనంతరం అందరూ కలసి నిలుచుని మాట్లాడుతుండగా వేగంగా వచ్చిన టాటా ఏస్ పాల వాహనం సచిన్ , మహదేవ స్వామిని ఢీ కొట్టింది. గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా సచిన్ మృతి చెందాడు. ఇలవాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రౌడీ కార్యకలాపాలను అణచివేయండి


గౌరవవందనం స్వీకరిస్తున్న నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద్

బనశంకరి: బెంగళూరు నగరంలో రౌడీ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని నగర పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్ నగర డీసీపీలకు సూచించారు. శుక్రవారం ఆడుగోడిలోని సీఏఆర్ సౌత్ కవాతు మైదానంలో ఏర్పాటుచేసిన మాసిక కవాతులో పోలీసు బలగాలనుంచి కమిషనర్ బీ.దయానంద్ గౌరవవందనం స్వీకరించి మాట్లాడారు. జాబితాలో ఉన్న చాలామంది రౌడీషీటర్లు ప్రజలు, అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై ప్రతినిత్యం తనకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీన్నిబట్టి మనం రౌడీ కార్యకలాపాలకు అడ్డు కట్టవేయడంలో విఫలంచెందామని అనిపిస్తోందన్నారు. ముఖ్యంగా రియల్‌ఎస్టేట్ మాఫియాలో రౌడీలు పాల్గొని అమాయకులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇలాంటి రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు సిబ్బంది గస్తీ పెంచాలని చీతా, హొయ్సళ వాహనాలు ట్రాఫిక్ పోలీసులు, నైట్‌బీట్ సిబ్బంది జాగ్రత్తగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు వస్తే తక్షణం స్పందించాలన్నారు. ఏసీపీ, డీసీపీ, సీఐలు ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. డీసీపీ, ఏసీపీలు అత్యుత్తమంగా పనిచేయడం వల్లనే లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సహకరించిన నోడల్ అధికారులకు అభినందనలు తెలిపారు.

బైకిస్టు ప్రాణం తీసిన అడవిపంది

- అటవీశాఖకు వ్యతిరేకంగా ధర్నా


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మండ్య: అడవి పంది దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నాగమంగల తాలూకా చిక్కయగటి గ్రామంలో జరిగింది. మండ్య తాలూకాలోని చిండగిరిదొడ్డి గ్రామానికి చెందిన పుట్టస్వామి కుమారుడు శివ (48) శుక్రవారం మండ్య–నాగమంగల మార్గంలో బైక్‌లో మండ్యకు వెళ్తుండగా హఠాత్తుగా పంది దాడి చేసింది. కింద పడిన శివ ఎడమ తొడ, మర్మాంగంపై గాయపరిచింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నాగమంగల గ్రామీణ పోలీసులు మృతదేహాన్ని మిమ్స్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

మార్చురీ వద్ద మృతుడి కుటుంబ సభ్యులు అటవీ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న శివ మృతితో కుటుంబం వీధి పాలు అయిందని, మృతుడి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. శివ కుమారుడు శ్రీనివాస్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, మృతుడి భార్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అటవీ శాఖ ద్వారా రూ. 15 లక్షల పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పిడుగుల బీభత్సం..ఆవు మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


సజీవదహనమైన ఆవు


చికిత్స పొందుతున్న మహలింగ

పావగడ: పిడుగులు పడి ఆవు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఈఘటన తాలూకాలోని అరసికెరె పోలీస్ స్టేషన్ పరిధి కి చెందిన రంగసముద్రం గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో రైతు కరియప్పకు చెందిన పశువుల కొట్టంపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. మంటలకు కొట్టంలో కట్టివేసిన ఆవు సజీవదహనమైంది. మరో 3 ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆవులకు కాపలాగా కొట్టంలో పడుకుని ఉన్న తాత కరియప్పకు, ఆవులను రక్షించేందుకు వెళ్లిన మనువడు మహలింగ చేతులు కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి బాధితులను ఆస్పత్రికి తరలించారు. అరసికెర పోలీసులు, తహసీల్దార్ సంతోష్ కుమార్, పశువైద్యాధికారి అశ్వర్థనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పిడుగు పాటుకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని, పరిహారం అందివ్వాలని బాధిత కుటుంబీకులు తహసీల్దార్ ను కోరారు.

తుపాకీ గుళ్లకు యువకుడి బలి


సంజు (ఫైల్)

దొడ్డబళ్లాపురం: తుపాకీ గుళ్లు దూసుకొచ్చి యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన చిక్కమగళూరు తాలూకా ఉకువాగిలు గ్రామంలో చోటుచేసుకుంది. కెరెమక్కి గ్రామానికి చెందిన సంజు(33) ఉకువాగులు గ్రామంలో రోడ్డుపక్కన విగతజీవిగా పడి ఉండగా మల్లందూరు పోలీసులు వచ్చి పరిశీలించారు. గుండెలపై బుల్లెట్ గాయం ఉండగా సమీపంలోనే తుపాకీ కూడా లభించింది. దగ్గరలో అటవీ ప్రాంతం ఉండడం వల్ల వేటకు వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తు బుల్లెట్ తగిలి ఉండవచ్చని, లేదా ఎవరైనా హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆశ్రయం కోసం వస్తే హత్య చేశారు


నిందితులు రంజిత్, రమేష్, హతుడు సత్య

దొడ్డబళ్లాపురం: బెంగళూరు సంపంగి రామనగర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాత బిల్డింగ్‌లో అపరిచిత మృతదేహం లభించిన కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసారు. రంజిత్ ప్రదాన్, రమేశ్ నిందితులు. ఒడిశా నుంచి వలస వచ్చిన వీరు బెంగళూరులో మిషన్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగ్ పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. మే 9వ తేదీన సత్య అనే అపరిచిత వ్యక్తి అదే బిల్డింగ్‌లో పడుకోవడానికి రాగా, నిందితులు గొడవపడి గట్టిగా తొయ్యడంతో సత్య వెళ్లి విద్యుత్ వైరుమీద పడి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. దీంతో భయపడ్డ ఇద్దరూ మృతదేహాన్ని పక్కనే ఉన్న మరో పాత బిల్డింగ్‌లో పడేసి వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. మృతుడు సత్యపై పోక్సో కేసు ఉంది. కొన్ని రోజుల క్రితమే బెయిలుపై బయటకు వచ్చాడు.

వంటనూనె అమ్మేసి లారీ బోల్తా పడిందని వంచన


స్వాధీనం చేసుకున్న ఆయిల్ ప్యాకెట్లు

యశవంతపుర: లారీ యజమానిని మోసం చేసిన డ్రైవర్‌ను బీదర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వంట నూనె లోడ్‌తో బయల్దేరిన లారీ డ్రైవర్ పరమేశ్వర్ మార్గం మధ్యలో ఆయిల్‌ను దుకాణాల్లో విక్రయించాడు. అనంతరం యజమానికి ఫోన్ చేశాడు. లారీ బోల్తా పడి ఆయిల్ నేలపాలైందని చెప్పాడు. ఓనర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీదర్ జిల్లా మంఠాళ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి విచారణ చేయగా డ్రైవర్ మోసం వెలుగు చూసింది. అనంతరం ఆయిల్ విక్రయించిన దుకాణాలకు వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

సొంతంగా బస్‌షెల్టర్ నిర్మించుకున్న గ్రామస్తులు

బనశంకరి: బస్‌షెల్టర్ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. విసిగిపోయిన మహిళలు స్వంతంగా బస్‌షెల్టర్ నిర్మించుకున్నారు. ఈఘటన ఉత్తరకన్నడ జిల్లా అంకోలా హరవాడ గ్రామంలో జరిగింది.హరవాడక్రాస్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో బస్సు కోసం ఎండలో వేచి ఉండాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని పదేళ్లుగా విన్నవించినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో గ్రామమహిళలందరూ కలిసికట్టుగా ఏర్పడి కొబ్బరిఆకులతో తాత్కాలికంగా బస్‌షెల్టర్ నిర్మించుకున్నారు.

బ్యాంకులు ఆమోదించకపోతే రుణమాఫీ చేయండి

- విపక్షనేత ఆర్.అశోక్

శివాజీనగర: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు, చెవులు, హృదయం లేదని విపక్షనేత ఆర్. అశోక్ మండిపడ్డారు. కేంద్రం విడుదల చేసిన కరువు పరిహార మొత్తాన్ని బ్యాంకర్లు రైతు రుణాలకు జమ చేస్తున్నా సీఎం సిద్దరామయ్య పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ సర్కార్ కర్ణాటక రైతుల కోసం రూ.3,454 కోట్లు కరువు నిధులు విడుదల చేసిందన్నారు. అయితే రాష్ట్ర వాటా మొత్తాన్ని సీఎం సిద్దరామయ్య ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. పరిహారం సొమ్మును పాత బకాయిలకు బ్యాంకులు జమా చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం పింఛన్, నరేగా సొమ్మును కూడా రైతులకు అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య తక్షణమే స్పందించి పరిహారం మొత్తాన్ని రైతు రుణాలకు జమ చేయకుండా చూడాలన్నారు. బ్యాంకులు ఆమోదించకపోతే రైతుల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడి మృతి


మృతిచెందిన వరుణ్

దొడ్డబళ్లాపురం: అతివేగం యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన జ్ఞానభారతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకాకు చెందిన వరుణ్ (25) ఏషియన్ పెయింట్ దుకాణంలో మేనేజర్‌గా పనిచేస్తూ మూడలపాళ్య కల్యాణనగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తూ నాగరబావి సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. జ్ఞానభారతి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు బోల్తా, డ్రైవర్ మృతి

యశవంతపుర: వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి నీటి కాలువలో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదం బీదర్ సమీపంలోని నౌబాదు వద్ద జరిగింది. ప్రమాదంలో వీరేశ్ నాగశెట్టి (25) డ్రైవర్, యజమానిని ఇంటి వద్ద వదిలి కారులో తన ఊరు అయిన నౌబాద్‌కు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. డ్రైవర్ గాయాలతో అక్కడికక్కడే చనిపోగా కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. బీదర్ గ్రామాంతర పోలీసులు కేసు నమోదు చేశారు.

హోసూరు వార్తలు..

తెరుచుకున్న మద్యం షాపులు


టాస్‌మార్క్ మద్యం అంగళ్లు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలంలో ఒకే చోట మూడు ప్రభుత్వ టాస్‌మార్క్ మద్యం దుకాణాలు ఉండగా, మందుబాబుల గోలను జనం భరించలేకున్నారు. ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్య ఎదురుకావడంతో పాటు తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. గత 9వ తేదీ సైక్లిస్టును ఓ తాగుబోతు సుమోతో ఢీకొనడంతో అతడు చనిపోయాడు. దీంతో ఆవేశానికి గురైన బాధిత బంధువులు, స్థానిక ప్రజలు టాస్‌మార్క్ ముందు బైఠాయించారు. ప్రమాదాలకు కారణమైన మద్యం షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనతో గత వారం రోజులుగా టాస్‌మార్క్ అంగళ్లను మూసివేశారు. ఈ విషయంపై సంబంధిత శాఖాధికార్లు తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, స్థానిక ప్రజా పతినిధులు, ప్రజల వద్ద చర్చలు జరిపారు. షాపులు లేక మందుబాబులు ఇబ్బందులు పడుతున్నారని, 45 రోజుల్లో ఇతర ప్రాంతాలకు మార్చివేస్తామని హామీ ఇచ్చారు. దీంతో షాపులను మళ్లీ తెరిచారు.

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాలి

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో వరుసగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది, ప్రకృతి వైపరీత్యాల నివారణకు అధికారులు సమర్థంగా పనిచేయాలని కలెక్టర్ శరయు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్, క్రిష్ణగిరి మున్సిపాలిటీల్లో వర్షపు నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వర్షలు నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని, ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు నిండిపోతే ఉపరి నీటిని మళ్లించేందు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. ఆస్పత్రుల్లో ఔషధాలను నిలువ ఉంచుకోవాలని, ప్రమాదకర స్థితిలో ఉన్న పాఠశాల భవనాలు, కట్టడాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ముందుగానే తొలగించాలని సూచించారు. సమస్యలు ఉంటే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1077, 101 లకు సమాచారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పన్నీర్ సెల్వం, బాబు, రమేష్‌కుమార్, పద్మలత, సుందరరాజ్, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగికి రూ. 5.54 లక్షల టోపీ

హోసూరు: ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి నుంచి రూ. 5.54 లక్షలను సైబర్ దొంగలు దోచుకున్నారు. హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లి ప్రాంతానికి చెందిన అరవింద్ (28) బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఈ ఏడాది మార్చి 2న అతని సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ వచ్చింది, అందులోని నంబర్‌కు సంప్రదించగా ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా, పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ అధిక డబ్బులు సంపాదించవచ్చునని చెప్పారు. అరవింద్ సరేనని వారు తెలిపిన బ్యాంకు ఖాతాలకు రూ. 5.54 లక్షల నగదును జమ చేశాడు. తరువాత వారి నుంచి ప్రతిస్పందన లేకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఊరికెళ్తే.. ఇంట్లో చోరీ

హోసూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి దోచుకెళ్లిన ఘటన హడ్కోలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతానికి చెందిన కుమార్(29) హోసూరు సమీపంలోని తొరపల్లిఅగ్రహారం గ్రామంలో నివాసముంటూ అక్కడే ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసుకొని స్వగ్రామానికెళ్లిన ఇతను గురువారం రాత్రి తిరిగి వచ్చాడు. ఈ సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 5 పొన్ల బంగారు నగలు, రూ. 80 వేలు నగదును దుండగులు దోచుకెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటనపై కుమార్ ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు ఫిర్యాదు చేశాడు.

బైక్ ప్రమాదంలో ఒకరు మృతి

క్రిష్ణగిరి: బైక్‌ను గూడ్స్ వ్యాన్ ఢీకొని రైతు ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన సూళగిరి పరిధిలో జరిగింది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని చప్పడి గ్రామానికి చెందిన రైతు మునిరాజ్ (53), మిత్రుడు మునిచంద్రన్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం బైక్‌లో హోసూరు– క్రిష్ణగిరి హైవేలో వెళుతూ చప్పడి యూటర్న్ వద్ద వ్యాన్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన ఇరువురిని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మునిరాజ్ దారిలో చనిపోయాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

కరెంటు షాక్‌తో భవన నిర్మాణ కూలీ...

కెలమంగలం: పనిలో ఉండగా భవన నిర్మాణ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన తళి వద్ద చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని ఉణిసేనత్తం గ్రామానికి చెందిన మూర్తి (32). భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఒన్నట్టి ప్రాంతంలో ఇంటిపైకి ఇనుప కమ్మీలు తీసుకెళుతుండగా కరెంటు పోల్ తీగలు తగలడంతో షాక్ కొట్టి అక్కడే మృతి చెందాడు. తళి పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...

ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు


ఈసీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు మల్లాది విష్ణు, రావెల, నారాయణమూర్తి

సాక్షి, అమరావతి: గుంటూరు రేంజ్ ఐజీ పి.త్రిపాఠీని బదిలీ చేయాలని, అనంతపురం ఏఎస్పీ రామకృష్ణను సస్పెండ్ చేయాలని కోరుతూ ఈసీకి వైఎస్సార్‌సీపీ శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలింగ్ రోజున మాచర్ల, సత్తెనపల్లి, గురజాల, నరసారావుపేటల్లోను, కొత్తగణేషునిపాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల లోకి చొరబడి టీడీపీ శ్రేణులు దౌర్జన్యాలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలింగ్ రోజున టీడీపీ చేసిన దౌర్జన్యాలు, అరాచకాలకు త్రిపాఠి వత్తాసు పలికారని తెలిపారు. అనంతపురం అదనపు ఎస్పీ రామకృష్ణచౌదరి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంట్లో సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారని, పోలీసులు దౌర్జన్యం చేశారని ఫిర్యాదులో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఈసీకి అందించారు. గుంటూరు రేంజ్ ఐజీ పి.త్రిపాఠిని బదిలీ చేయాలని, అనంతపురం ఏఎస్పీ రామకృష్ణను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీమంత్రి రావెల కిషోర్‌బాబు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి కోరారు.

కడప ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి వైఎస్సార్‌సీపీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి గురించి మాట్లాడకూడదంటూ కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే విధించింది. కడప కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్‌పై ఏపీ హైకోర్టు జోక్యం చేసుకోవడానికి నిరాకరించడంతో షర్మిల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఎన్నికలు పూర్తయ్యాయి కదా ఈ పిటిషన్‌పై విచారణ అవసరమా అని తొలుత ధర్మాసనం వ్యాఖ్యానించింది. కడప కోర్టు ఆదేశాలను ధిక్కరించారంటూ షర్మిలపై ధిక్కార పిటిషన్లు దాఖలయ్యాయని ఆమె తరపు సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ చెప్పారు. కడప కోర్టు ప్రతివాదుల వాదనలు వినకుండా షర్మిల వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చినట్లుగా ధర్మాసనం అభిప్రాయపడింది. అనంతరం ఏప్రిల్ 16న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. షర్మిలపై దాఖలైన ధిక్కార పిటిషన్లపై ప్రోసీడింగ్స్‌పైనా స్టే విధించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. వేసవి సెలవుల అనంతరం తదుపరి విచారణ చేపడతామని తెలిపింది.

70 మంది ప్రభుత్వ వైద్యులకు షోకాజ్ జారీ

సాక్షి, అమరావతి: ఇన్-సర్వీస్ కోటాలో వైద్య విద్య పీజీ కోర్సులు పూర్తి చేసి నిబంధనల మేరకు ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు అందించని వైద్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వైద్య శాఖ సిద్ధం అయ్యింది. 2017–20 మధ్య ఇన్-సర్వీస్ కోటాలో పీజీ పూర్తి చేసిన 70 మంది వైద్యులకు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ షోకాజ్ నోటీసులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇన్-సర్వీస్ కోటాలో పీజీ అడ్మిషన్‌లు పొందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్)లు కోర్సులు పూర్తయ్యాక ఐదేళ్ల పాటు ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు అందించాలి. ఈ 70 మంది నిబంధనలు అతిక్రమించడంతో పాటు పీజీ చదివిన సమయంలో పొందిన జీతభత్యాలతో పాటు, రూ.20 లక్షలను ప్రభుత్వానికి చెల్లించాల్సిందిగా షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు. జూన్ 15లోగా వైద్యుల నుంచి ఎటువంటి స్పందన లేకపోయినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వైద్యుల వివరాలను dme.ap.nic.in, cfw.ap.nic.in, hmfw-.ap.gov.in ల్లో అందుబాటులో ఉంచారు.

సీసీఎల్‌ఏలో కీలక మార్పులు

- ఐదుగురు సహాయ కార్యదర్శుల స్థానాల మార్పు

సాక్షి, అమరావతి: భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలో కీలక మార్పులు జరిగాయి. ఐదుగురు అదనపు సహాయ కార్యదర్శులను (ఏఏసీలను) కమిషనర్ సాయిప్రసాద్ బదిలీ చేశారు. ప్రధానమైన రెవెన్యూ విజిలెన్స్ ఏఏసీ బాధ్యతలను సీహెచ్ శారదకు అప్పగించారు. సుదీర్ఘకాలంగా విజిలెన్స్ ఏఏసీగా ఉన్న పనిచేసిన సీహెచ్ కృష్ణమూర్తిని అలైనేషన్ విభాగానికి బదిలీ చేశారు. మరో ముఖ్యమైన రెవెన్యూ సర్వీసెస్ ఏఏసీగా పనిచేస్తున్న డి.రమాదేవిని కేఆర్‌ఆర్‌సీ ఏఏసీగా నియమించారు. రెవెన్యూ సర్వీసెస్ ఏఏసీ బాధ్యతలను ఎం.వి.రమణకు అప్పగించారు. కేఆర్‌ఆర్‌సీ ఏఏసీగా ఉన్న జగన్నాథరావును సీఎంఆర్‌వో విభాగం ఏఏసీగా బదిలీ చేశారు. మహాలక్ష్మికి పరిపాలన విభాగం ఏఏసీ అదనపు బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ ఆర్.దుర్గాప్రసాద్‌ను పెన్షన్ల సెక్షన్‌కు మార్చారు. విజిలెన్స్, సర్వీసెస్ సెక్షన్ల నుంచి కృష్ణమూర్తి, డి.రమాదేవిని మార్చడం చర్చనీయాంశమైంది.

కూటమి రేపిన కలకలం...

మైనార్టీల్లో కలవరం!

- 2004లో ముస్లిములకు 4 శాతం రిజర్వేషన్లు
- డాక్టర్ వైఎస్సార్ కల్పించిన వరం...
- గత పదేళ్లలో ఆరువేలమందికిపైగా డాక్టర్లయిన ముస్లిం యువత
- విద్యా ఉద్యోగాల్లో ముస్లిం యువత ముందడుగు..
- రిజర్వేషన్లను కొనసాగిస్తూ సీఎం వైఎస్ జగన్ మరింత ఊతం
- కూటమి విష ప్రచారానికి ముస్లిం సమాజం బెంబేలు..



ఒకే ఒక్క నిర్ణయం...ఇంతమంది జీవితాల్లో ఇంత అద్భుతమైన మార్పు తెస్తుందని ఎవరూ ఊహించరు...దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ పేదరికంలో ఉన్న ముస్లింల వేదనలకు చలించిపోయి, వారి ఎదుగుదలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు...అంతే..ఆ ఒక్క నిర్ణయం ముస్లిం సమాజంలో విద్యావంతులను అమాంతంగా పెంచింది... వారిలో అనేకులు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదుగుతున్నారు. ఇతరత్రా అనేక ఉపాధి కోర్సుల్లో ముస్లిం యువత ప్రతిభను చూపించి, ముస్ముందుకు దూసుకుపోతోంది...ఒక సాధారణ టీవీ మెకానిక్ తన ఇద్దరు కుమార్తెలను, ఒక కుమారుణ్ని డాక్టర్లను చేశారంటే అది వారికి లభించిన రిజర్వేషన్ ఫలితమే... మరెన్నో ముస్లిం పేద కుటుంబాల్లో యువతీయువకులు నేడు ఉన్నత విద్యావంతులై... తమ కుటుంబాలకు.. సమాజానికి గుర్తింపును తెస్తున్నారు.. ఇలాంటి మంచి వాతావరణాన్ని కలుషితం చేసేలా బీజేపీ ముస్లింలకు రిజర్వేషన్లను తొలగిస్తామని ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రకటించడం ఆ సమాజంలో అలజడి రేపుతోంది... రేపటి తమ భవిష్యత్తును తలచుకుని ముస్లింలు తల్లడిల్లుతున్నారు..

యిర్రింకి ఉమామహేశ్వరరావు, సాక్షి, అమరావతి:

కడపలో డాక్టర్ నూరీ పర్వీన్ పేరు తెలియని వారుండరు. కడప పెద దర్గా సెంటర్‌లో కేవలం రూ.10కే వైద్య సేవలు అందించే పది రూపాయల డాక్టర్‌గా ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారామె. దివంగత మహానేత వైఎస్సార్ కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లతో ఎంబీబీఎస్ చదువుకున్న ఆమె ఆయన స్ఫూర్తితో పది రూపాయలకే వైద్యం చేయడం ప్రారంభించారు. ఆమెతో పాటు సోదరి రీనా పర్వీన్, తమ్ముడు బాబా మొహిద్దీన్‌లూ డాక్టర్లే. వీరి తండ్రి ఎండీ మక్బూల్ విజయవాడలో ఓ టీవీ మెకానిక్. తమ పేద కుటుంబం నుంచి ఏకంగా వరుసగా...ముగ్గురు డాక్టర్లుగా ఎదగడం దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ పుణ్యమేనని మక్బూల్ సంతోషంగా చెబుతారు.

■ విజయవాడలో కనీసం సొంత ఇల్లయినా లేని మక్బూల్ టీవీ మెకానిక్‌గా కుటుంబాన్ని పోషించడమే కష్టతరంగా ఉండేది. ఇలాంటి క్లిష్టమైన సమయంలో వైఎస్సార్ ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్ ఫలితంగా ఆయన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు 2010, 2011, 2012 సంవత్సరాల్లో వరుసగా ఎంబీబీఎస్ సీట్లు సాధించడం ఓ అరుదైన ఘనత.


నూరి పర్వీన్


రీనా పర్వీన్


బాబా మొహిద్దీన్



విజయవాడకు చెందిన డాక్టర్ అస్మా తన్వీర్ రిజర్వేషన్ అవకాశంతో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో 2014లో ఎంబీబీఎస్, ఆ తర్వాత 2019లో జనరల్ సర్జన్ (ఎంఎస్) వైద్య విద్య సీట్లు సాధించారు. ప్రస్తుతం డాక్టర్ వృత్తిని కొనసాగిస్తున్నారామె. ఆమె తండ్రి షేక్ కలీముద్దీన్ రిటైర్డ్ ఉద్యోగి. పిల్లల చదువులు తనకు భారమైనప్పటికీ రిజర్వేషన్ అవకాశంతో ఒక కుమార్తె డాక్టర్, ఇద్దరు కుమార్తెలు ఇంజనీరింగ్, కుమారులు వేర్వేరు కోర్సులను పూర్తి చేయడంతో ఆ కుటుంబం ఉన్నతంగా జీవిస్తోంది.

...వీరే కాదు.. దివంగత మహానేత వైఎస్సార్ కల్పించిన నాలుగు శాతం (బీసీ–ఇ) రిజర్వేషన్ రాష్ట్రంలో వేలాది ముస్లిం కుటుంబాల స్థితిగతులనే మార్చేసింది. సామాజికంగా, విద్య పరంగా అత్యంత వెనుకబాటుకు గురైన ముస్లిం సమాజాన్ని గుర్తించి వారిని ముందుకు నడిపించేందుకు వైఎస్సార్ తీసుకున్న రిజర్వేషన్ కేటాయింపు నిర్ణయం ఎన్నో ముస్లిం కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంది. ఆ కుటుంబాల్లో యువతను విద్యాధికులను చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో వైఎస్సార్ ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వేలాది మంది ముస్లిం యువతకు భరోసా ఇచ్చింది. రాష్ట్ర విభజన అనంతరం ఒక్క ఏపీలోనే ఈ పదేళ్లలో వైద్య విద్యా కోర్సుల్లో 6,401 మందికి అండర్ గ్రాడ్యుయేషన్, 1,164 మందికి పోస్ట్ గ్రాడ్యుయేషన్ అవకాశాలు దక్కడం విశేషం. వైద్య విద్యా కోర్సులతో పాటు ఇంజనీరింగ్, ఇతర కోర్సుల్లో అవకాశాలు దక్కినవారు లెక్కలు మిక్కిలి ఉన్నారు.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ (2013 నుంచి 2024 వరకు)లో రిజర్వేషన్లు (బీసీ–ఈ)తో డాక్టర్లయిన ముస్లిం యువత వివరాలు

వైద్య విద్యా కోర్సు	అండర్ గ్రాడ్యుయేషన్
ఎంబీబీఎస్	2,325
బీడీఎస్ (డెంటల్)	397
బీఏఎంఎస్ (ఆయుర్వేదం)	87
బీహెచ్ఎంఎస్ (హోమియో)	163
బీయుఎంఎస్ (యునాని)	628
బీఎస్సీ నర్సింగ్	1481
బీఎస్సీ పారామెడికల్	606
బీపీటీ (ఫిజియోథెరపీ)	714

పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ కోర్సు)



- మెడికల్: 898
- ఎండీఎస్ (డెంటల్): 105
- హోమియో: 24
- ఆయుర్వేదిక్: 44
- నర్సింగ్: 35
- ఎంపీటీ (ఫిజియోథెరపీ): 58

వైఎస్సార్ హామీ ఇచ్చి అమలు చేశారు



ముస్లిం రిజర్వేషన్లపై 2009 ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన వైఎస్సార్ అధికారం చేపట్టిన వెంటనే అమలు చేశారు. తొలుత ఐదు శాతం ప్రకటించినప్పటికీ 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదని సుప్రీం కోర్టు అభ్యంతరంతో నాలుగు శాతం అమలు చేశారు. వైఎస్సార్ ఇచ్చిన రిజర్వేషన్ల వల్ల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చాలా మంది ముస్లిం యువకులు, విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. తమకు అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వీరంతా తమలోని ప్రతిభను నిరూపించుకుంటున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, డీఎస్పీలు, ఆర్డీవోలు, టీచర్లుగా ఉద్యోగాలు పొందుతున్నారు. ఈ సంతోషాన్ని హరించే కుట్రలో భాగంగా... వైఎస్సార్ కల్పించిన రిజర్వేషన్లను తొలగించడానికి కూటమి కుట్రలు చేస్తోంది. ముస్లింలలోని నిమ్న కులాల వారికి సమాజంలో ఉన్న సామాజిక, విద్యాపరమైన వెనుకబాటు కారణంగా రిజర్వేషన్లు అందుతున్నాయి.

– అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం ఎంపీ

వైఎస్సార్ బాటలో సీఎం వైఎస్ జగన్



రిజర్వేషన్లతో ముస్లింల తలరాతలను మార్చిన దివంగత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వంటి గొప్ప పథకాన్ని అమలు చేసి అన్ని వర్గాల పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ పేరు చెబితే ముస్లింలకు రిజర్వేషన్లు, పేదలకు ఆరోగ్య శ్రీ గుర్తుకొస్తాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన తండ్రి కంటే రెండడుగులు ముందుకేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేశారు. ముస్లిం రిజర్వేషన్లు కొనసాగించిన సీఎం వైఎస్ జగన్ నాడు–నేడు ద్వారా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలను ఆధునీకీకరణ చేసి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ వైద్య రంగంలో సుమారు 50 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు. కొత్తగా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయగా, వాటిలో ఐదు కాలేజీలను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఫ్యామిలీ డాక్టర్, డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. రాష్ట్రంలోని 92 శాతం మంది ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందే వెసులుబాటు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు.

–మహబూబ్ షేక్, వైద్య నిపుణుడు, విజయవాడ

ముస్లిం రిజర్వేషన్లు మతపరమైనవి కావు




ముస్లిం రిజర్వేషన్లు మతపరమైనవి కావు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన ముస్లింలను గుర్తించి 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వేషన్లు కల్పించారు. 2004 ఎన్నికల్లో తానూ ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైఎస్సార్ రిజర్వేషన్లు కల్పిస్తే వాటిని అడ్డుకునేందుకు చంద్రబాబు కోర్టులో కేసులు వేయించారు. 4 శాతం రిజర్వేషన్ల వల్ల ముస్లిం యువతకు ఉన్నత విద్యావకాశాలు దక్కుతున్నాయి. ఎంతోమంది ముస్లిం యువత ఇప్పుడు బాగా చదువుకుని ఉన్నతంగా జీవిస్తున్నారు. రిజర్వేషన్లు ముస్లిం సమాజంలో గొప్ప సానుకూల మార్పును తెచ్చాయి.

–షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్

వైఎస్సార్‌సీపీకే మళ్లీ అధికారం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- మాకు కాన్ఫిడెన్స్ ఉంది.. ఓవర్ కాన్ఫిడెన్స్ లేదు
- చంద్రబాబుకు ఆయన మీద ఆయనకే నమ్మకం లేదు
- ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మాటలను విశ్వసించి ఆయనతో నిలబడ్డారు.. జనంపై సీఎం పెట్టుకున్న నమ్మకం జూన్ 4న క్రిస్టల్ క్లియర్‌గా కనిపిస్తుంది
- ప్రజలు నమ్మటం లేదని చంద్రబాబు సూపర్ సిక్స్ గురించి ప్రచారం చేసుకోలేదు
- వివేకా హత్య, ల్యాండ్ టైట్లింగ్ గురించి తప్ప తను చేసిన మంచి గురించి ఎక్కడైనా చెప్పాడా?
- టీడీపీ గెలవడానికి ఒక్క కారణమైనా చెప్పగలరా?
- ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని చంద్రబాబు చెప్పలేక పోతున్నారు
- కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగాలంటే పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాను తొలగించాలి

సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో విజయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉందని, గతం కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల వారు తమ పార్టీకే ఓటు వేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ వైపు నిలబడ్డారని చెప్పారు. అందువల్లే మళ్లీ అధికారంలోకి వస్తున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మాటలను విశ్వసించి, ఆయనతో నిలబడ్డారన్నారు. తమకు కాన్ఫిడెన్స్ ఉందని, ఓవర్ కాన్ఫిడెన్స్ లేదని చెప్పారు. జనంపై సీఎం పెట్టుకున్న నమ్మకం జూన్ 4న క్రిస్టల్ క్లియర్‌గా కనిపిస్తుందన్నారు. ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్న తీరు చూస్తుంటే మళ్లీ విజయం సాధించడం ఖాయం అని అన్నారు. 'సీఎం వైఎస్ జగన్‌పై వ్యతిరేకత పెంచుకున్న చంద్రబాబు కూటమిలో గెలుస్తామన్నా కాన్ఫిడెన్స్ ఎక్కడా కనిపించడం లేదు. అసలు చంద్రబాబుకు ఆయన మీద ఆయనకే నమ్మకం లేదు. చంద్రబాబుకు ఆయన అజెండా మీదా నమ్మకం లేదు. ఆయన సూపర్ సిక్స్ గురించి కూడా ప్రచారం చేసుకోలేదు. ఎంతసేపూ సీఎం జగన్‌పై వ్యక్తిగతంగా దాడి చేయడం, వివేకానందరెడ్డి హత్య కేసు, కుటుంబం గురించి మాట్లాడటం, చివర్లో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం. వాస్తవానికి అసెంబ్లీలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను సపోర్టు చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలు చేయాలని నీతి ఆయోగ్ చెప్పింది. పోలింగ్ తర్వాత ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టీడీపీ ఎందుకు మాట్లాడటం లేదు? తన హామీలు జనం నమ్మడం లేదని తెలిసే చంద్రబాబు దుష్ప్రచారం ఎంచుకున్నారు. తుదకు టీడీపీ డ్రామాలన్నీ వికటించాయి' అని అన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..



కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు గెలుస్తున్నాం..

- పోలింగ్ పర్సంటేజ్ పెరిగితే మేము ఓడిపోతామన్న భ్రమలో టీడీపీ ఉంది. మాపై వ్యతిరేకత ఉన్న వర్గాలు ఎక్కడా లేవు. సీఎం జగన్ మాత్రం తాను చేసిన అభివృద్ధి – సంక్షేమం, చేసిన మంచి చూసి ఓటు వేయాలని పదే పదే అడిగారు. టీడీపీ గెలవడానికి ఉన్న ఒక్క కారణమైనా చెప్పగలరా? అందుకే ఎన్నికల్లో విజయం సాధిస్తామని చంద్రబాబు కూడా గట్టిగా చెప్పలేక పోతున్నారు. టీడీపీ కూటమి వల్లే పోలింగ్‌లో హింస జరిగింది.
- ఈసీ, టీడీపీ కలిసి కుట్రలు చేయటం వల్లే కొన్ని చోట్ల గొడవలు, దాడులు, హింసాకాండలు జరిగాయి. కూటమి నేతలు చెప్పిన అధికారులే హింసకు కారణమయ్యారు. ఇప్పుడు వాళ్లనే ఈసీ తొలగిస్తూ చర్యలు తీసుకుంది. ఇంకా తొలగించాల్సిన వాళ్లు కొందరున్నారు. పోలింగ్‌కు ముందు అడ్డగోలుగా అధికారులను బదిలీ చేశారు. అల్లర్లు జరిగాయంటే ఈసీ విఫలం అయ్యినట్లే. వీటి వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నట్లే. ఈ ఆఫీసు అప్ గ్రేడ్ చేస్తుంటే రికార్డులు మాయం అవుతున్నాయని గవర్నర్‌కు పిచ్చి పిచ్చి లేఖలు రాస్తున్నారు.
- కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగాలంటే పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాను తొలగించాలి. టీడీపీ కొంత మంది పోలీసులను తమ ఏజెంట్లుగా మార్చుకుంది. ప్రశాంతంగా కౌంటింగ్ జరగాలని కోరుకుంటున్నాం. ఎన్నికల కమిషన్ బాధ్యతాయుతంగా ఉంటే ఇంత విధ్వంసం, అల్లర్లు జరిగేవి కావు. ఒక వర్గానికి కొమ్ము కాస్తున్న వారిని పక్కన పెట్టాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాం. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని ప్రాంతాల్లోనూ గెలుస్తాం. సీఎం జగన్ పాలనలో లబ్ధి పొందని వర్గాలు, న్యాయం జరగని కుటుంబం అంటూ ఏవీ లేవు. అందరికీ మేలు చేసినందునే భారీ సీట్లతో గెలవబోతున్నాం.

మేము ఆరోజే చెప్పాం..

- సంక్షేమాభివృద్ధి పథకాలు కొనసాగితేనే తమ బతుకుల్లో వెలుగు పెరుగుతుందని ప్రజలు నమ్మారు. జూన్ 4న కౌంటింగ్ రోజు స్పష్టమైన తీర్పు గమనించబోతున్నాం. జనం కోసం తపించే నాయకుడిని ప్రజలు అభిమానిస్తారు, ఆదరిస్తారు, అక్కున చేర్చుకుంటారనే నమ్మకం ఈ ఎన్నికల్లో కలుగుతుందని మేం భావిస్తున్నాం.
- ఎస్పీలు, కలెక్టర్లను ఈసీ బదిలీ చేసినప్పుడు ఈనాడులో 'ఈడ్చిపడేసిన ఈసీ' అని పెద్ద బ్యానర్ హెడ్డింగ్ పెట్టి రాశారు. ఆ రోజు నుంచే చెబుతున్నాం.. పురందేశ్వరి, ఇంకెవరైనా, ప్రతిపక్షాలైనా వారి కంప్లయింట్స్ చెప్పడంలో, రాయడంలో తప్పేం లేదు. కానీ, ఎవరిని నియమించాలో కూడా వాళ్లే సూచించారు. ఎప్పుడైతే కూటమి ఏర్పడిందో అప్పుడే చంద్రబాబుకు కేంద్రం నుంచి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారేమో అనిపించింది. ఆ మేరకు ఒత్తిళ్లు పని చేశాయనడానికి బలమైన కారణం హడావుడిగా పెద్ద సంఖ్యలో అధికారులను మార్చేయడమే.
- రాష్ట్రంపై పట్టులేని వారిని తీసుకువస్తే కష్టం అని ఆ రోజే చెప్పాం. ఆఖరుకు పోలింగ్, పోలింగ్ తర్వాతి రోజు జరిగిన హింస చూస్తే మేం చెప్పిన మాట ఎంత కరెక్టో అర్థం అవుతోంది. టీడీపీ కుట్ర పూరితంగా ప్లాన్, పథకం ప్రకారం పురందేశ్వరి, సెంట్రల్‌లోని బీజేపీ లీడర్ల సాయంతో అందరినీ తప్పించిందని అర్థం అవుతోంది.

పెద్దారెడ్డి ఇంట్లో పోలీసుల విధ్వంసం ప్రపంచం చూసింది

- నిన్న ఎన్నికల కమిషన్ పరిశీలన చేసి కరెక్ట్ చేసుకోవడం సంతోషించదగ్గ విషయం. వాళ్లు చెప్పిన వారిని నియమిస్తే వారు ప్రతిపక్ష పార్టీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తారనే ఆలోచన ఈసీకి అప్పుడే వచ్చి ఉండాలి. అలా ఆలోచిస్తే ఇంతగా హింసాత్మక ఘటనలు జరిగేవి కాదు. ఇది పూర్తిగా ఈసీ ఫెయిల్యూర్. ఈ నేపథ్యంలో మళ్లీ అధికారులపై వేటు అని.. బ్యానర్లు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది.
- ప్రజలతో మమేకమై, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసి తద్వారా వారి ఆశీస్సులు తీసుకొని మళ్లీ పాలన కొనసాగించాలని కోరుకుంటాం. టీడీపీ కూటమిలా.. అడ్డగోలుగా వ్యవస్థల్లో దూరి ఎస్పీలను, కలెక్టర్లను మార్చేసి.. వారి ద్వారా ఎన్నికలను మేనేజ్ చేయాలనుకోవడం దుర్మార్గం. ఈ–ఆఫీస్ అప్‌గ్రేడ్ చేయొద్దు అని, పథకాలు ఆపేసి కాంట్రాక్టర్లకు బిల్లులు పే చేస్తున్నారని రాస్తున్నారు. అసలు చంద్రబాబు అధికారంలోకి వచ్చేశానని అనుకుంటున్నాడా? స్టేట్ గవర్నమెంట్ అంటే పంచాయతీ ఆఫీసా?
- తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంటిపై పోలీసుల దాడి అన్యాయం. కావాల్సిన అధికారులను నియమించుకొని దౌర్జన్యానికి దిగి, హింసాకాండ క్రియేట్ చేసి, లాభం పొందాలని టీడీపీ కుట్ర చేసింది. సీసీ కెమెరాలు ఉండేది నేరస్తులను పట్టుకోవడానికి. వాటిని పోలీసులే ధ్వంసం చేయడం కంటే ఘోరం మరొకటి ఉంటుందా? దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తున్నాం. ఎన్నికల కమిషన్‌లో లొసుగులను ఆసరా చేసుకొని, అక్కడున్న కొంత మంది వ్యక్తులను పట్టుకొని టీడీపీ అడ్డగోలుగా ప్రవర్తించింది. లాస్ట్ స్టేజ్‌లో కూడా టీడీపీకి, చంద్రబాబుకు బుద్ధి రాలేదని అర్థం అవుతోంది.

అల్లర్లకు అచ్చెన్న ఎత్తుగడ

- పోర్టు వాహనాలతో రోడ్లు పాడైపోతున్నాయంటూ ఆందోళనకు కుట్ర
- పోలీసులకు ఫోన్ చేసి మరీ హెచ్చరించిన అచ్చెన్న
- ముందస్తుగా భారీ ఎత్తున మోహరించిన పోలీసు బలగాలు


నౌపడ పోలీస్ స్టేషన్ వద్ద మోహరించిన పోలీసులు

టెక్కలి: ఎన్నికల్లో కూటమికి పరాభవం తప్పదనే సంకేతాలు ఆ పార్టీ నేతల్లో అసహనం రేపుతోంది. ఇందుకు ప్రతీకారంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకూ వెనుకాడటం లేదు. ఇప్పటికే కొన్ని చోట్ల ఆ పార్టీ నాయకులు అల్లర్లకు తెగబడుతున్నారు. ఇందులో భాగంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం టెక్కలి నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్రలకు తెరతీశారు. దీనికోసం జిల్లా అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిన మూలపేట పోర్టును అడ్డుకునేందుకు ప్లాన్ వేశారు. పోర్టు వాహనాలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయని, ఆ వాహనాలను అడ్డుకుంటామనీ కొంత మంది పోలీసులకు అచ్చెన్నాయుడు ఫోన్ చేసి మరీ హెచ్చరించినట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. టెక్కలితో పాటు సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు పరిసర ప్రాంతాల్లో సుమారు 600 మంది పోలీసులు శుక్రవారం భారీగా మోహరించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అల్లరి మూకలు చేస్తున్న విధ్వంసం నేపథ్యంలో స్థానికంగా ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా ఇక్కడ కూడా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

ఆది నుంచీ అడ్డుకోవాలనే...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టినప్పటి నుంచి అచ్చెన్నాయుడు అండ్ పచ్చ బ్యాచ్ ఏదో ఒక రూపంలో అడ్డుకోవాలని కుట్రలు పన్నుతూ వచ్చారు. పోర్టు నిర్మాణం జరిగితే జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసు అడుగడుగునా ఎల్లో మీడియా సహకారంతో విషం చిమ్మారు. ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రజలంతా సహకరించడంతో వారి ఎత్తుగడలు సాగలేదు. ఇప్పుడు ఓటమి భయంతో పోర్టును అడ్డుపెట్టుకుని విధ్వంసాలు సృష్టించేందుకు పక్కాగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. వారి కుట్రలను తిప్పికొట్టేందుకు పోలీసులు అదే స్థాయిలో పక్కాగా నిఘా వేస్తున్నారు.

బహుజనులంతా వైఎస్సార్‌సీపీ వైపే

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజనుల పక్షపాతి అని, రాష్ట్రంలోని బహుజనులంతా ఆయన వైపే ఉన్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు చెప్పారు. జూన్ 4 తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో బహుజనుల రాజ్యం మళ్లీ ఆవిష్కృతం అవుతుందని తెలిపారు. పెత్తందారులు, పేదలకు జరిగిన ఈ ఎన్నికల యుద్ధంలో అంతిమ విజయం బహుజనులదేనని అన్నారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పేదలవైపు ఉన్న వైఎస్సార్సీపీకి, సీఎం వైఎస్ జగన్‌కి ప్రజలు అఖండ విజయం చేకూర్చబోతున్నారని చెప్పారు. వైఎస్ జగన్ పాలనలో బడుగుల సంక్షేమమే ధ్యేయంగా అద్భుతమైన పథకాలు ప్రవేశపెట్టి, ప్రజారంజక పాలన చేశారన్నారు. పెరిగిన ఓటు శాతం ప్రభుత్వంపై వ్యతిరేకత అంటూ పచ్చ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వంపై అనుకూలత ఈ ఎన్నికల్లో ప్రస్ఫుటంగా కనిపించిందని తెలిపారు. వైఎస్ జగన్ ఐదు సంవత్సరాలుగా అమలు చేసిన పథకాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించిందన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన 151 స్థానాలకంటే ఎక్కువ సీట్లతో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తోందని తెలిపారు. చంద్రబాబు కూటమి చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు ఏమాత్రం నమ్మలేదని చెప్పారు. గెలుపుపై చంద్రబాబు, టీడీపీ నేతలది వట్టి మేకపోతు గాంభీర్యమేనన్నారు. టీడీపీకి కొందరు పోలీసు అధికారులు వత్తాసు పలికారనే విషయం హింసాత్మక ఘటనల ద్వారా రుజువైందని తెలిపారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే టీడీపీ కార్యకర్తలు దాడులకు దిగారని అన్నారు. చంద్రబాబుతో పాటు హింసకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు అధికారులు భక్షి, త్రిపాఠి, బిందు మాధవ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ తర్వాత జరుగుతున్న హింస ఆందోళన కలిగిస్తోందని, ఆ ప్రాంతాల్లో ఉన్న పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశామని చెప్పారు. పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా టీడీపీ నేతలతో కుమ్మక్కయ్యారని, పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. టీడీపీ వాళ్లు ఫిర్యాదు చేస్తే విచారణ లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా ఆయన పోలీసు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. ఆయన కౌంటింగ్‌ను కూడా ప్రభావితం చేయాలని చూసే అవకాశం ఉందని తెలిపారు. దీపక్ మిశ్రాపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

న్యూస్ మేకర్

ఒక సినిమా నిర్మాణంలో మామూలుగా అయితే కొన్ని నగలు తెప్పిస్తారు. కాని 'హీరామండీ' వెబ్ సిరీస్ కోసం 300 కిలోల నగలు అవసరమయ్యాయి. అవి కూడా బ్రిటిష్ కాలం నాటివి. మొగల్ సంస్కృతీ వారసత్వానివి. ఢిల్లీలో శ్రీ పరమణి జువెలర్స్‌కు చెందిన అన్షు గుప్తా భర్త వినయ్‌తో కలిసి మూడేళ్ల పాటు శ్రమించి ఈ నగలు తయారు చేశారు. నత్, ఝూమర్, హాత్ ఫూల్, పస్సా, టీకా... ఎన్నో నగలు. అన్షు గుప్తా పరిచయం.

సినిమా నగల స్పెషలిస్ట్



భర్త వినయ్‌తో అన్షు గుప్తా











స్త్రీలు, అలంకరణ అవిభాజ్యం. స్త్రీలు, ఆభరణం కూడా అవిభాజ్యమే. ఆభరణంతో నిండిన అలంకరణ భారతీయ స్త్రీలలో వేల సంవత్సరాలుగా ఉంది. బంగారం, వెండి, వజ్రాలు, రత్నాలు, కెంపులు, మరకతాలు, ముత్యాలు... వీటితో తయారైన ఆభరణాలు రాచరిక స్త్రీలకు ప్రీతికరమైనవి. ఐశ్వర్యవంతులకు స్థాయిని కలిగించేవి. అయితే వీరే కాకుండా కళాకారులకు కూడా ఆభరణాలు కీలకమైనవి. మొగలుల కాలంలో విరాజిల్లిన తవాయిఫ్‌లు (రాజ నర్తకీమణులు) తమ ప్రదర్శనల్లో ఆకర్షణ కోసం భారీ ఆభరణాలను ఉపయోగించేవారు. మరి వారి గురించిన గాథను తెరకెక్కించేటప్పుడు ఆ ఆభరణాలు ఎక్కడి నుంచి వస్తాయి? వాటిని అందించడానికి ముందుకు వచ్చిన జువెలర్స్ అన్షు గుప్తా, ఆమె భర్త వినయ్ గుప్తా.

హీరా మండి

మొగలుల కాలంలో లాహోర్‌లోని ఒక ఏరియా పేరే హీరా మండి. దాని అంతకు ముందు పేరు షాహీ మొహల్లా. అంటే రాచవాడ. పక్కనే ఉన్న కోట నుంచి నవాబులు నడిచి వచ్చేంత దూరంలో ఉండే కొన్ని భవంతుల సముదాయమే షాహీ మొహల్లా. ఇక్కడ తవాయిఫ్‌లు ఉండేవారు. వీరు ఆట, పాటల్లో నిష్ణాతులు. సాయంత్రమైతే వీరి భవంతుల్లో ప్రదర్శనలు జరిగేవి. నవాబులు, శ్రీమంతులు, రసికులు వీటికి హాజరయ్యి తిలకించేవారు. ఈ తవాయిఫ్‌లకు విశేష పలుకుబడి ఉండేది. వీరి దగ్గర ఐశ్వర్యం ఉండేది. రాచరిక రహస్యాలు మొదట వీరికే తెలిసేవి. వీరు మంత్రాంగం నడిపేవారు. 1857 సైనిక తిరుగుబాటులో కూడా వీరు పాల్గొన్నారు. కాని బ్రిటిష్ కాలం వచ్చేసరికి ఇదంతా గతించిపోయింది. షాహీ మొహల్లా కాస్తా సరుకులు అమ్మే మండీగా హీరా మండీగా మారింది. ఆనాడు వెలిగిన వారంతా అంతరించిపోయారు. వేశ్యలుగా మారారు. వారి గాథనే దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ 'హీరామండీ' పేరుతో భారీ వెబ్ సిరీస్‌గా తీశాడు. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది.

భారీ నగలు

పర్‌ఫెక్షనిస్ట్ అయిన దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీ 'హీరామండీ'లో తవాయిఫ్‌ల కోసం నాటి మొగల్ తరహా నగలు కావాలని భావించాడు. గతంలో తన 'బాజీరావు మస్తానీ' కోసం పని చేసిన ఆభరణాల శిల్పులైన అన్షు గుప్తా, ఆమె భర్త వినయ్ గుప్తాలను సంప్రదించాడు. వీరు ఢిల్లీవాసులు. వీరికి శ్రీ పరమణి జువెలర్స్ అనే నగల కార్ఖానా, షోరూమ్ ఉన్నాయి. 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కార్ఖానాలో ఖరీదైన ఆభరణాలు దొరుకుతాయి. 'కథ విన్న వెంటనే టైటిల్ దగ్గరి నుంచి ప్రతి పాత్రా ఆభరణాలతో ముడిపడి ఉన్నందుకు ఉత్సాహం వచ్చింది. చరిత్రలోకి వెళ్లి పరిశోధించి నాటి ఆభరణాలు తయారు చేయాలి. మొగలులు కళాప్రియులు. వారి కాలంలో ఆభరణాలలో కెంపులు. ముత్యాలు, వజ్రాలు విరివిగా వాడేవారు. ఆపాదమస్తకం అలంకరించుకోవడానికి వందల రకాల ఆభరణాలు ఉండేవి. అవన్నీ మేము తయారు చేయడానికి ముందుకు వచ్చాం. నేను, నా భర్త వినయ్ మూడేళ్లు కష్టపడి ఈ నగలు తయారు చేయించాం' అని తెలిపింది అన్షు గుప్తా.

అసలు సిసలు బంగారంతో

''హీరామండీ కోసం కొన్ని ముఖ్యమైన నగలు అసలు బంగారంతోనూ, మిగిలినవి బంగారు పూత కలిగిన వెండితోనూ తయారు చేయించాలని నిర్ణయించాం. వజ్రాలు, ముత్యాలు అన్నీ ఒరిజినల్‌వే వాడాం. మా కార్మికులు మూడేళ్ల పాటు శ్రమపడి మూడు గదుల్లో పది వేల చిన్న, పెద్ద ఆభరణాలు తయారు చేశారు. వీటిని తూస్తే 300 కిలోలు ఉంటాయి. నథ్ (ముక్కు పుడక) దగ్గరి నుంచి నెమలి నెక్లెస్ వరకూ వీటిలో ఉన్నాయి. షూటింగ్‌లో ప్రత్యేక గార్డులు వీటికి కాపలా ఉన్నారు. 'మేం చేసిన ఆభరణాలు పాత్ర కోసం ధరించి వీటితో పారిపోతే ఒక సినిమా తీసేన్ని డబ్బులొస్తాయి' అనేది నటి రిచా చద్దా సరదాగా. హీరామండీని చూస్తే ఒక పాత్ర ధరించిన పాపిడి బిళ్లతో మరో పాత్ర ధరించిన పాపిటబిళ్లకు పోలిక ఉండదు. గాజులు, ఉంగారాలు, చెవి కమ్మలు... తెర మీద అద్భుతంగా ఆవిష్కృతమైన తీరుతో మా కష్టం వృథా పోలేదనిపించింది'' అని సంతోషాన్ని వ్యక్తం చేసింది అన్షు గుప్తా.

దిల్లీకి చెందిన పవిత్రాచారి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే... మల్టీ-టాలెంట్ ఆర్టిస్ట్. ప్లేబ్యాక్ సింగర్, సాంగ్ రైటర్, వోకలిస్ట్, కంపోజర్‌గా రాణిస్తోంది. 'కళ కళ కోసం కాదు. సమాజం కోసం' అని నమ్మిన పవిత్ర తన 'కళ'తో వివిధ స్వచ్ఛందసేవా సంస్థలతో కలిసి పనిచేస్తోంది. తాజాగా 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా' జాబితాలో 'ఎంటర్‌టైన్‌మెంట్' విభాగంలో చోటు సాధించింది...

అపురూప స్వరాల అన్వేషి

మల్టీ టాలెంట్



పవిత్ర

దశాబ్దకాలం పాటు ఇండిపెండెంట్ ఆర్టిస్ట్‌గా తనదైన గుర్తింపు తెచ్చుకుంది పవిత్ర. ఆ తరువాత సినిమా రంగంలోకి అడుగుపెట్టి ఏఆర్ రెహమాన్‌లాంటి దిగ్గజాలతో కలిసి పని చేసింది.

ప్రతి దిగ్గజం నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడంలో ముందుంటుంది పవిత్ర.

'శూన్యం నుంచి కూడా రెహమాన్ సంగీతం సృష్టించగలరు' అంటుంది.

65వ గ్రామీ అవార్డ్‌లలో పవిత్ర పాట 'దువా' బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ కేటగిరీకి నామినేట్ అయింది. హెచ్‌సీఎల్, ఇండిగో ఎయిర్‌లైన్స్‌లాంటి ప్రముఖ కంపెనీల యాడ్స్‌లో నటించింది.

'అనిరుథ్ వర్మ కలెక్టివ్'లో భాగంగా యూఎస్‌లో ఎన్నో ప్రాంతాలలో తన సంగీతాన్ని వినిపించింది. 'చిత్రహార్ లైవ్' టైటిల్‌తో చేసిన ఇన్‌స్టాగ్రామ్ సిరీస్‌కు మంచి పేరు వచ్చింది, 'ఈ ప్రాజెక్ట్ ద్వారా సంగీతానికి సంబంధించిన నాస్టాల్జియాను హైలైట్ చేశాను. వ్యక్తిగతంగా, ఆన్‌లైన్‌లో ఈ ప్రాజెక్ట్‌కు ఎంతో స్పందన వచ్చింది' అంటుంది పవిత్ర.

గత సంవత్సరం కొన్ని అద్భుతమైన వోటీటీ ప్రాజెక్ట్‌లలో భాగమైన పవిత్ర ఆ ప్రాజెక్ట్‌ల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడమే కాదు, తన ప్రతిభతో వాటికి కొత్తదనాన్ని తెచ్చింది.

'దిల్లీ అమ్మాయి'గా పాపులర్ అయినప్పటికీ పవిత్ర మూలాలు చెన్నైలో ఉన్నాయి. తన సంగీతయాత్రలో భాగంగా దిల్లీ, చెన్నై, ముంబై నగరాల మధ్య తిరుగుతుంటుంది. ఇప్పుడు చెన్నైలో ఎక్కువ రోజులు ఉండడానికి ప్రాధాన్యత ఇస్తోంది. హిందీ పాటలే కాదు తమిళం, తెలుగు, కన్నడం, మలయాళంలాంటి భాషల్లోనూ పాడుతోంది.

మల్టిపుల్ ప్రాజెక్ట్‌లలో భాగం కావడమే కాదు వాటిపై తనదైన ముద్ర వేయడంలో ప్రత్యేకత సాధించింది పవిత్ర.

'ఒకేదగ్గర ఉండిపోవడం కంటే నిరంతర అన్వేషణతో కొత్త దారులు వెదుక్కోవడం నాకు ఇష్టం. ప్రతి దారిలో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ముందుకు వెళ్లడం అంటే ఇష్టం. కొత్త ఆసక్తి అన్వేషణకు కారణం అవుతుంది. ఆ అన్వేషణలో భాగంగా కంఫర్ట్ జోన్ నుంచి బయటికి వచ్చి కొత్త ప్రపంచంలోకి వెళ్లే అవకాశం దొరుకుతుంది. మల్టిపుల్ ప్రాజెక్ట్‌లలో గుర్తింపు తెచ్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను' అంటుంది పవిత్ర.

సంగీతం, సామాజికం అనేవి రెండు వేరు వేరు ప్రపంచాలని ఎప్పుడూ అనుకోలేదు పవిత్ర. ఆర్ట్స్-బేస్‌డ్ థెరపిస్ట్‌గా ఎంతో మందికి సాంత్వన చేకూర్చింది. వారి నడకకు కొత్త బలాన్ని ఇచ్చింది.

'లైఫ్‌స్కిల్స్ ఎడ్యుకేషన్ విత్ మ్యూజిక్' కాన్సెప్ట్‌తో వివిధ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల కోసం సంగీత కచేరీల ద్వారా నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

పాటే కాదు పరిశోధన కూడా..

పవిత్రకు సంగీతప్రపంచం అంటే ఎంత ఇష్టమో, సంగీత ధోరణులకు సంబంధించిన పరిశోధన అంటే కూడా అంతే ఇష్టం. ప్రఖ్యాత గాయని శుభాముద్గల్ దగ్గర సంగీతంలో శిక్షణ తీసుకున్న పవిత్ర 'ఖాయాల్'పై ఆసక్తి పెంచుకోంది. ఈ సంగీత ప్రపంచంలోని స్త్రీవాద ధోరణుల గురించి లోతైన పరిశోధన చేసింది.

భారత ఉపఖండంలో హిందుస్థానీ శాస్త్రీయ సంగీతానికి సంబంధించిన ప్రధాన రూపం... ఖాయాల్. అరబిక్ నుంచి వచ్చిన ఈ మాటకు అర్థం... ఊహ.

హిందుస్థానీ శాస్త్రీయ సంగీత విద్యార్థిగా ఖాయాల్ సంగీతంలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. పరిశోధన ఫలితంగా కొత్త విషయాల పట్ల అవగాహన ఒక కోణం అయితే నా గానాన్ని స్వీయ విశ్లేషణ చేసుకోవడం మరో కోణం' అంటున్న పవిత్ర ఖాయాల్ సంగీతానికి సంబంధించి రిసోర్స్ బ్యాంక్‌ను తయారు చేసింది. దీనికి ముందు ఖాయాల్ రచనలు, వాటి మూలం, సామాజిక, సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో అధ్యయనం చేసింది. ఎంతోమంది నిపుణులతో మాట్లాడింది.

మంచి కాఫీ లాంటి బ్యూటీ

బ్యూటిప్స్

కాఫీ మనకు గుడ్‌మార్నింగ్ చెప్పడమే కాదు, గుడ్‌లుక్‌ను కూడా ఇస్తుంది. కాఫీ గింజల పొడి (ఇన్‌స్టంట్ మిక్స్‌లు కాదు)తో బ్యూటీ ప్యాక్‌లను చూద్దాం.



- పొడి చర్మాన్ని ఆరోగ్యవంతం చేయడంలో కాఫీ, ఆలివ్ ఆయిల్ బాగా పని చేస్తాయి. టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో సగం టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖం, మెడ, చేతులకు పట్టించాలి. పదిహేను నిమిషాల తర్వాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ ఆరిన తర్వాత నీటితో శుభ్రం చేయాలి.
- ముఖం మీద మచ్చలు, పిగ్మెంటేషన్ తగ్గిపోయి చర్మం నిగనిగలాడాలంటే... అర టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో అంతే మోతాదు తేనె, టీ స్పూన్ నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి సున్నితంగా మసాజ్ చేయాలి. పది నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తుంటే ముఖం కాంతివంతమవుతుంది.
- కళ్ల కింద నల్లటి వలయాలు, చర్మం ఉబ్బి వేళ్లాడుతున్నట్లయితే (పఫీ ఐస్) రాత్రి పడుకునే ముందు కాఫీ డికాషన్‌లో దూది ముంచి కళ్ల చుట్టూ పట్టించి, కళ్లు మూసుకుని పది నిమిషాల సేపు రెప్పల మీద ఉంచాలి. ఇలా రోజూ చేస్తుంటే వారం రోజుల్లో కళ్లు ఆరోగ్యంగా, అందంగా తయారవుతాయి.
- మొటిమలు పోవాలంటే మూడు టీ స్పూన్‌ల కాఫీ పొడిలో టేబుల్ స్పూన్ పెసరపిండి లేదా శనగపిండి, మూడు టీ స్పూన్‌ల తేనె, రెండు టీ స్పూన్‌ల కలబంద గుజ్జు, లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్ రెండు చుక్కలు వేసి కలపాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి పట్టించి పదిహేను నిమిషాలకు పూర్తిగా ఆరిపోతుంది. అప్పుడు మెల్లగా వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చన్నీటితో శుభ్రం చేయాలి.

హెల్త్ టిప్స్

మీకు తెలుసా?

జామపండుకు పేదల ఆపిల్ అని పేరు. అయితే పండే కాదు... ఆకుల వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఒకటి రెండు జామాకులను తీసుకుని శుభ్రంగా కడిగి వాటిని నీటిలో వేసి పది నిమిషాల పాటు మరిగించాలి. అనంతరం ఆ నీటిని వడకట్టి అందులో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి హెర్బల్ టీ మాదిరిగా తాగాలి. రోజుకు ఇలా రెండు సార్లు తాగితే చాలు... ఈ కింది ప్రయోజనాలు కలుగుతాయి.



- ముఖం మీద ఉండే మొటిమలు, మచ్చలు పోతాయి. చర్మం కాంతివంతంగా, మృదువుగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు.
- డయాబెటిస్ అదుపులో ఉంటుంది
- అధిక బరువును తగ్గించడంలో జామ ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి శరీర మెటబాలిజంను పెంచి కొవ్వును కరిగిస్తాయి. దీంతో బరువు తగ్గడం తేలికవుతుంది.
- స్త్రీలు నెలసరి సమయంలో కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులతో సతమతం అవుతుంటారు. అలాంటి వారికి జామ ఆకులు ఎంతగానో మేలు చేస్తాయి. నొప్పులను తగ్గిస్తాయి.
- కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో జామ ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. దీంతో రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. హార్ట్ ఎటాక్ ముప్పు రాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

● మాయా టాండన్

డాక్టర్ రోడ్ సేఫ్టీ



డాక్టర్ మాయా టాండన్



పద్మశ్రీ అవార్డు అందుకుంటూ...

ఉద్యోగ విరమణ తర్వాత చాలామంది విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలనే ఉద్దేశంతో ఇంటికే పరిమితం అవుతుంటారు. కానీ, జైపూర్ వాసి డాక్టర్ మాయా టాండన్ మాత్రం తన రిటైర్మెంట్ జీవితాన్ని రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నవారిని కాపాడేందుకు అంకితం చేసింది. స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి లక్షా ముప్పై మూడు వేల మందికి రోడ్డు భద్రతకు సంబంధించిన శిక్షణ ఇచ్చింది. జీవితం పట్ల ఉత్సాహం, సమాజం కోసం పనిచేయాలనే తపనతో గత ముప్పై ఏళ్లుగా డాక్టర్ మాయా టాండన్ చేస్తున్న కృషికి గానూ ఆమెను ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారం వరించింది. వైద్యసేవలోనే తరిస్తున్న టాండన్ గురించి ఆమె మాటల్లోనే...


''అజ్మీర్‌లో పుట్టి పెరిగాను. చిన్ననాటి నుంచి కుటుంబ మద్దతు నాకు ఎక్కువే ఉంది. అన్ని బోర్డ్ పరీక్షలలో మంచి మార్కులు సాధించి, అజ్మీర్‌లోని మెడికల్ స్కూల్‌లో చేరాను. జీవితమంతా నాదైన మార్గాన్ని ఎంచుకునే స్వేచ్ఛ నాకు లభించింది. అజ్మీర్‌లోని హాస్పిటల్‌లో వైద్యురాలిగా చేరాను. అక్కడే టాండన్‌తో జరిగిన పరిచయం పెళ్లికి దారితీసింది. పెళ్లి తర్వాత జైపూర్‌కు వెళ్లాను. కొడుకు పుట్టిన తర్వాత అనస్తీషియాలజీలో డిప్లొమా చేశాను. డిప్లొమా పూర్తయ్యేనాటికి కూతురు కూడా పుట్టింది. ఆ తర్వాత అనస్తీషియాలోనే ఎమ్మెస్ కూడా చేశాను. జైపూర్‌లోని మెడికల్ కాలేజీలో అనస్తీషియాపై స్పీచ్‌లు ఇచ్చేదాన్ని. అందులో భాగంగా పీడియాట్రిక్ అనస్తీషియా కోసం లండన్ ఫెలోషిప్‌కు హాజరయ్యాను. అక్కణ్ణుంచి వచ్చాక జైపూర్‌లో పనిచేయడం ప్రారంభించాను.

మూడు రోజుల కోర్సు తిప్పిన మలుపు

సాధారణంగా అందరికీ అనస్తీషియాలజిస్ట్ పాత్ర తెర వెనుక పనిగా కనిపిస్తుంది. నేను మాత్రం రోగి జీవితం అనస్తీషియాలజిస్ట్ పై ఆధారపడి ఉంటుందని నమ్ముతాను. 1975లో సవాయ్ మాన్‌సింగ్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్‌గా, అనస్తీషియా హెడ్‌గా పనిచేస్తూ దాని నిర్వహణను చూశాను. 1985లో పదవీ విరమణ చేసే సమయంలో జైపూర్‌లోని రాజస్థాన్ పోలీసు అకాడమీ నన్ను సంప్రదించి, రోడ్డు భద్రత, ప్రాణాలను రక్షించడంపై మూడు రోజులు కోర్సు ఇవ్వాలని కోరింది. రిటైర్‌మెంట్ తర్వాత అదే నా జీవిత గమనాన్ని మలుపు తిప్పుతుందని తెలియకనే వారి అభ్యర్థనను అంగీకరించాను. మూడు రోజుల కోర్సు చాలా సక్సెస్ అయ్యింది. దీంతో జైపూర్, చుట్టుపక్కల హైవేలపై పోస్ట్ చేసే సీనియర్ అధికారులందరి కోసం మరొక కోర్సు ఏర్పాటు చేశారు. ఒక ఫొటోగ్రాఫర్ ఆ ఈవెంట్ ఫొటోలు తీయడానికి వచ్చాడు. కొన్ని నెలల తర్వాత అతను నాకు ఫోన్ చేసి, నేను అతని ప్రాణాలను రక్షించానని చెప్పాడు. అదెలా అని ఆశ్చర్యపోయాను. ఆ ఫొటోగ్రాఫర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతని తొడల వెనక భాగంలో రక్తస్రావం అవుతూ ఉంది. అతని చుట్టూ ఉన్న వ్యక్తులు ఎలా సహాయం చేయాలో తెలియక ప్రమాదం తాలూకు ఫొటోలు తీసుకుంటున్నారు. తనను ఎత్తి, ఒక చోట ఎలా కూర్చోబెట్టాలో చెప్పి, రక్తస్రావం తగ్గేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సాటివారికి వివరించి, ప్రమాదం నుంచి బయటపడిన విధం గురించి తెలియజేశాడు. దీంతో ఆ కోర్సు ప్రాముఖ్యత ఎంతటిదో గ్రహించాను. సమయానుకూలంగా తీసుకునే జాగ్రత్తలు మన ప్రాణాలను ఎలా కాపాడతాయో ఆ రోజు మరింతగా కళ్లకు కట్టాయి. ఎక్కడైనా ప్రమాదం జరిగితే చుట్టూ అందరూ గుమికూడుతారు. ఆ గుంపులోని వ్యక్తులలో ఎవరికీ ప్రాణాలను రక్షించే దశలు తెలియవు. దీంతో భారతదేశంలో రహదారి భద్రత తీరుతెన్నులు మార్చాలనే ఉద్దేశ్యంతో 'సహాయ' ట్రస్ట్‌ను ప్రారంభించాను. అప్పటి నుండి 1,33,000 మంది వ్యక్తులకు ఉచిత కోర్సులు, సెమినార్లు, ఉపన్యాసాలు ఇస్తూ వచ్చాను.



రోడ్డు సేఫ్టీపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్న మాయా టాండన్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తూ....

కోర్సులు అన్నీ ఉచితమే

కార్డియోపల్మొనరీ రిససిటేషన్ (సీపీఆర్), ప్రమాదాలను ఎదుర్కోవడానికి సరైన నిర్వహణ పద్ధతులు, అవగాహన పెంచడం దీని లక్ష్యం. పోలీసు విచారణ నుండి లైఫ్ సేవర్‌ను రక్షించే వివిధ చట్టాల గురించి కూడా కోర్సులో పాల్గొనేవారికి తెలియజేస్తాం. గాయపడిన వ్యక్తికి సీపీఆర్, ప్రథమ చికిత్స ఎలా అందించాలో మేం చూపిస్తాం. ప్రజలను చేరుకోవడానికి మాకు వివిధ మార్గాలు ఉన్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో సెమినార్లు ఇస్తాం. వర్క్‌షాప్‌లు, తరగతులను కూడా నిర్వహిస్తాం. అదనంగా ర్యాలీలు చేస్తాం. వీధి నాటకాలు కూడా వేయిస్తాం.

ఒక చిన్న కోర్సులో మొదటి పది సెకన్లలో ఏమి చేయాలో వారికి సూచనలు అందించడానికి ప్రాధాన్యత ఇస్తాం. ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు తలకు గాయాలు, రక్తస్రావం కోసం తనిఖీ చేయమని చెబుతాం. సమస్య ఏమిటో నిర్ధారించుకున్న తర్వాత ఆ వ్యక్తికి ఊపిరి, గుండెకు సంబంధించిన సమస్య ఉంటే సీపీఆర్‌ని ఆశ్రయించడం ఉత్తమమైన మార్గం. అంతర్గత రక్తస్రావం, కార్డియాక్ అరెస్ట్ వంటి సమస్యలలో సీపీఆర్ మాత్రమే సహాయం చేస్తుంది. మాల్స్, విమానాశ్రయాలు వంటి బహిరంగ ప్రదేశాల్లో అత్యవసర సేవలు ఉండేలా ప్రభుత్వ సంస్థలతో కలిసి ట్రస్ట్ పని చేస్తుంది.

అవగాహన లోపమే ప్రధాన అడ్డంకి

వర్క్‌షాప్‌లకు హాజరయ్యేందుకు ప్రజలను తీసుకురావడం మేం ఎదుర్కొంటున్న ప్రధాన అడ్డంకి. భారతీయ ప్రజానీకం ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటారు. కొంత సమయాన్ని అవగాహనకు కేటాయించాలనుకోరు. మా కోర్సులకు వచ్చి, విషయాల పట్ల అవగాహన పెంచుకోకపోవడంతో ఇంకా తక్కువ ప్రతిస్పందన రేటునే చూస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో భారతదేశం ముందుంది. ప్రతిస్పందనలో మాత్రం చాలా వెనుకుంది. దీంతో మన మూలాలైన గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి, ప్రజలను రక్షించడానికి కావల్సిన శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాం. కోర్సులో పాల్గొన్న వ్యక్తులు స్వచ్ఛందంగా సేవ చేయడానికి లైఫ్‌సేవర్‌కి తగిన పరికరాలను ట్రస్ట్ అందిస్తుంది. హైవేలకు సమీపంలో నివసించే గ్రామస్థులకు శిక్షణ ఇవ్వడానికి అందరి నుంచి ఆర్థిక సాయం కూడా కోరుతుంటాను. ఎందుకంటే గాయపడిన వారిని చేరుకోవడానికి, మొదటగా స్పందించిన వారికి.. విరాళం ఇవ్వడానికి కూడా మేము సహాయం చేస్తుంటాం' అని వివరిస్తుంది ఈ డాక్టర్.



ముఖంపై మచ్చలా...
సులువుగా ఇలా తొలగుతాయి!

సూర్య కిరణాలు చర్మానికి నేరుగా తాకడం వల్ల.. చర్మంలో ఉండే మెలనిన్‌లో హెచ్చుతగ్గులు వస్తాయి. ఈ మెలనిన్ శాతం పెరిగినప్పుడు ముఖంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. చూడటానికి అందవికారంగా అనిపించే ఈ మచ్చలను పోగొట్టుకునేందుకు మార్కెట్టులో దొరికే ఖరీదైన క్రీములను, రకరకాల మందులను ఉపయోగించి, ఆ తర్వాత వాటి వల్ల కలిగే దుష్ఫలితాలతో బాధపడేకన్నా కొన్ని చిట్కాలను పాటిస్తే మచ్చలు సులువుగా పోవడంతోపాటు.. చర్మం కొత్త మెరుపును కూడా సంతరించుకుంటుంది.

- ఎండిన తమలపాకులను పొడి చేసి దానికి కొంచెం కొబ్బరినూనె కలిపి ఆ మిశ్రమాన్ని మచ్చలపై రాసినా ఉపయోగం ఉంటుంది.
- రాత్రి పడుకునే ముందు కొంచెం నీళ్లలో చపాతీని నానబెట్టి మర్నాడు ఉదయం దాన్ని పేస్ట్‌లాగా చేసి ముఖానికి పట్టించండి. ఇలా కొన్ని రోజులపాటు క్రమం తప్పకుండా చేస్తే బ్లాక్‌హెడ్స్ తొలగిపోతాయి.
- కుంకుమపువ్వును పొడి చేసి దానికి కొంత తేనె కలిపి ముఖానికి రాసుకుంటే బ్లాక్‌హెడ్స్ తొందరగా మాయమవుతాయి.
- కొంచెం నిమ్మరసాన్ని కాటన్‌తో తీసుకుని నల్లటి మచ్చలపై రాసి సుతిమెత్తగా మసాజ్ చేయాలి. దీనిలో ఉన్న విటమిన్-సి మచ్చలపై మంచి ప్రభావం చూపిస్తుంది.
- కాటన్ బాల్ మీద పాలు లేదా మజ్జిగ చుక్కలు వేసి దాన్ని మచ్చలున్న ప్రాంతంపై రాసుకోండి. వీటిలో ఉండే ల్యాక్టిక్ యాసిడ్ చర్మాన్ని తెల్లగా మార్చుతుంది.
- మచ్చలున్న ప్రదేశంలో తేనెను రాసి 20 నిమిషాల తర్వాత కడిగేయండి. తేనెలో ఉండే ఔషధ గుణాలు నల్లమచ్చలను తొలగించడంలో తోడ్పడతాయి.
- విటమిన్-ఇ ఆయిల్‌ను రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసుకుని తెల్లారి లేచిన తర్వాత కడుక్కోవాలి. వీటితోపాటు రోజూ సన్‌స్క్రీన్ లోషన్‌ను ముఖానికి తప్పకుండా రాసుకుంటూ ఉండాలి.
- బంగాళాదుంప ముక్కల్ని తీసుకుని ముఖంపై రుద్దుకున్నా... మొటిమలు, వాటి తాలూకు మచ్చలు, వైట్ హెడ్స్ లాంటివి దూరమవుతాయి.
- అర స్పూన్ నిమ్మరసానికి కాస్తంత గ్లిజరిన్ జోడించి ఆ మిశ్రమాన్ని నల్ల మచ్చలున్న ప్రాంతంలో రాస్తే తొందర్లోనే వాటి బాధ వదిలిపోతుంది.
- చిటికెడు పసుపును అర గుప్పెడు గోరింటాకుతో కలిపి పేస్ట్‌లా చేసి మచ్చలపై రాస్తే మంచి ఫలితం ఉంటుంది.
- కొంచెం పసుపు, కరివేపాకును కలిపి మెత్తని పేస్టులా చేసి మచ్చలపై రాయాలి.
- ఎండిన తులసి ఆకులను పొడి చేసి దానికి వేపాకు పొడి, పుదీనా కలుపుకోవాలి. దానికి కొంత పసుపు, రోజ్‌వాటర్ కలిపి పేస్ట్‌లాగా చేసి రాస్తే నల్లమచ్చలు మాయమవడమే కాకుండా చర్మం మెరుపును సంతరించుకుంటుంది.
- దానిమ్మ తొక్కలను ఎండబెట్టి పొడి చేసుకొని నాలుగు చుక్కల నిమ్మరసం కలిపి నల్లమచ్చలున్న చోట రాయాలి. పదినిమిషాల తర్వాత కడిగేయాలి. ఇలా మచ్చలున్న చోట నిత్యం రాస్తుంటే త్వరలోనే మంచి మార్పు కనిపిస్తుంది.
- తాజా మెంతి ఆకులు మెత్తగా రుబ్బి రాత్రిళ్లు ముఖానికి రాసుకోవాలి. మర్నాడు గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. ఇలా తరచూ చేయడం వల్ల నల్ల మచ్చలు దూరమవుతాయి. అలాగే గుప్పెడు మెంతి ఆకుల్ని నీటిలో వేసి బాగా మరిగించి చల్లారాక ముఖానికి రాసుకుని, ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే ముఖం తాజాగా కనిపిస్తుంది.
- గ్రీన్ టీ లో దూది ముంచి మచ్చలపై రోజూ రాసుకుంటూ ఉండాలి.
- వంటనూనె, నిమ్మరసం సమపాళ్లలో తీసుకుని బాగా కలిపి మచ్చలున్న ప్రాంతంలో సున్నితంగా మర్దన చేయాలి. పది నిమిషాల య్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు.
- చెంచా తేనె, ఒక గుడ్డు తెల్లసొనను బాగా కలిపి ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రంగా కడగాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల నల్లమచ్చలు, మృతకణాలు తొలగిపోతాయి.
- రెండు చెంచాల నిమ్మరసం, తగినంత దాల్చిన చెక్క పొడిని బాగా కలుపాలి. ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, భుజాలు, వీపునకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్‌ను వారంలో నాలుగుసార్లు ప్రయత్నించవచ్చు.
- తాజా అలోవెరా జెల్‌ను ముఖానికి పట్టించి 10 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి.
- ఒక చెంచా పసుపును రెండు చెంచాల పుదీనా రసంలో కలుపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత శుభ్రం చేసుకోవాలి.
- తాజా టొమాటో గుజ్జును రాత్రిపూట నల్లమచ్చలపై రాసి ఉదయం పూట ముఖాన్ని శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తే మచ్చలు తొందరగా తొలగుతాయి.

ష్...ష్...
గుర్రు పెట్టకుండా నిద్రపోండి!



హాయిగా నిద్రపోయేవాళ్లను గుర్రుపెట్టి నిద్రపోతున్నారని చెబుతాం కానీ, అది నిజం కాదు. ఎందుకంటే గురక నిద్ర అనేది మంచి నిద్రకు నిదర్శనం కాదు. దానివల్ల అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా ఇతరులకు నిద్రాభంగం కలుగుతుంది. అందువల్ల గురక నివారణకు సులభ పరిష్కార మార్గాలను తెలుసుకుందాం.

● నిద్రించేటప్పుడు ముక్కుల నుంచి ఊపిరితిత్తుల్లోకి గాలి వెళ్లే మార్గంలో అడ్డంకులు ఏర్పడితే నోటి ద్వారా శ్వాస తీసుకునే ప్రయత్నం జరుగుతుంది. ఆ మార్గంలోనూ అవాంతరాలుంటే అప్పుడు కుచించుకుపోయిన మార్గం నుంచి గాలి వెళ్లే క్రమంలో చుట్టుపక్కల ఉన్న కణజాలాలు కదలికకు గురై చప్పుళ్లు వస్తాయి. ●మానసిక ఒత్తిడి, ఆందోళన కూడా కారణాలే. ● అలర్జీలు, సైనస్ ఇన్ఫెక్షన్, ముక్కులోపలి భాగంలో వాపు, అడినాయిడ్స్... వీటన్నింటి వల్ల శ్వాస మార్గానికి అడ్డంకులేర్పడటమే కారణం ● మధ్య వయసు, ఆపై వయసుకు వచ్చిన తర్వాత గొంతు భాగం సన్నబడుతుంది. దీని వల్ల గురక రావడానికి అవకాశం ఉంటుంది. అలాగే మహిళలతో పోలిస్తే పురుషుల్లో వాయు నాళాలు తక్కువ వ్యాకోచంతో ఉంటాయి. అధిక బరువు ఉండడం వల్ల మెడ, గొంతు భాగంలో అధిక బరువు పడినా గురక వస్తుంది. ● సైనస్ సమస్యలో ముక్కు రంధ్రాలు మూసుకుపోయి గాలి కష్టంగా వెళ్లాల్సి వచ్చి శబ్దం వస్తుంది.

అధికమించడానికి చిట్కాలు

● రోజూ రాత్రి నిద్రపోయేముందు గుప్పెడు పచ్చి అటుకులను తింటే గురక రాకుండా కంట్రోల్ అవుతుంది ● అర టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ కలిపి రాత్రి నిద్రపోయే ముందు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది ●కొద్దిగా పిప్పర్‌మెంట్ ఆయిల్‌ను చేతివేళ్లకు రాసుకుని వాసన చూస్తుంటే గురక తగ్గుతుంది ●గ్లాసు వేడి నీటిలో అర టీ స్పూన్ యాలకుల చూర్ణం కలిపి రాత్రి నిద్రపోయే ముందు తాగి నిద్రపోతే మంచి ఫలితం కనిపిస్తుంది ● రాత్రి పడుకునే ముందు మరిగే నీటిలో నాలుగైదు చుక్కలు యూకలిప్టస్ ఆయిల్ వేసి ఆవిరి పట్టాలి. తద్వారా చాలా కంట్రోల్ అవుతుంది.

గ్యాస్ట్రిక్ సమస్య
నివారణ మీ చేతుల్లోనే..!

వేళకు తిండి తినకపోవటం, సరైన నిద్ర లేకపోవటం, జంక్‌ఫుడ్ తినడం, నీళ్లు సరిగా తాగకపోవడం. ఒకేసారి ఎక్కువ మొత్తంలో తినటం... లేదంటే గంటలు గంటలు అసలేం తినకపోవడం.... ఫలితంగా కడుపులో మంటలు, ఛాతీలో బరువుగా ఉండటం, పులి తేనుపులు, కాస్త తినగానే కడుపు నిండిపోయినట్లు అనిపించడం, ఏదీ నయించకపోవడం.. ఏదో గందర గోళంగా అనిపించటం... ఇవన్నీ గ్యాస్ట్రిక్ సమస్యలు అయితే, వీటన్నింటినీ దూరం చేసుకోవటం కూడా మన చేతుల్లోనే ఉంది. అదెలాగో చూద్దాం.

- ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా ఎక్కువమంది ఎదుర్కొంటున్న సమస్య గ్యాస్ట్రిక్ సమస్య. ఇది ఏమంత ప్రమాదకరమైనది కాదు కానీ, నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలమీదికి వచ్చినంత గందరగోళానికి గురి చేస్తుంది. అంతేకాదు, గుండెపోటు లక్షణాలకు దగ్గరగా ఉండటం వల్ల భయం కలిగిస్తుంది. దీనిని నివారించాలంటే ఏం చేయాలో చూద్దాం.
- గ్యాస్ట్రిక్ సమస్య నివారణకు ముందు చేయాల్సిన పని వేళకు తిండి తినటం.
- ముఖ్యంగా ఇది రాత్రి పది గంటల తర్వాత తిని, ఏ అర్ధరాత్రో పడుకునేవారికి వస్తుంది.
- అందువల్ల రాత్రి భోజనం/ఫలహారం చేసిన గంట తర్వాత నిద్రించాలి.
- బ్రేక్‌ఫాస్ట్ ఉదయం 9 గంటల కల్లా తినాలి. ఎందుకంటే, రాత్రి తిండికి, ఉదయం ఫలహారానికి మధ్య చాలా విరామం ఉంటుంది. దీని వల్ల కడుపులో గ్యాస్ ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. అలాగే ఉదయం ఫలహారం ఎక్కువగానూ, మధ్యాహ్నం తక్కువగానూ, రాత్రి ఇంకా తక్కువగానూ తినడం గ్యాస్ సమస్యతోపాటు చాలా రకాల సమస్యల నుంచి బయట పడేస్తుందని పోషకాహార నిపుణుల అభిప్రాయం.
- సెనగపిండి వల్ల గ్యాస్ పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ఈ ఇబ్బంది ఎదుర్కొంటున్న వారు సెనగపిండితో చేసిన చట్నీ, పకోడీ, బజ్జీలు వంటివి తినకూడదు. పులిసిన పదార్థాలు కూడా గ్యాస్‌ను పెంచుతాయి కాబట్టి వాటికి దూరంగా ఉండటం మంచిది.
- గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడేవారు తమవెంట బిస్కెట్లు, పండ్లు, మంచినీరు ఉంచుకోవడం మంచిది. ఎందుకంటే, తిండివేళ దాటితే, బిస్కెట్లు గానీ, పండ్లుగానీ తిని మంచినీరు తాగితే, గ్యాస్ట్రిక్ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.
- రోజూ రాత్రిపూట ఒక స్పూను జీలకర్రను గ్లాసు నీటిలో నానబెట్టి, ఉదయమే ఆ నీటిని మరిగించి, వడకట్టుకుని తాగితే గ్యాస్ నివారణ అవడంతోపాటు అధిక బరువు నుంచి కూడా తప్పించుకోవచ్చు.
- మంచినీరు ఎక్కువ తాగాలి.

ఇవి తీసుకుంటే మంచిది...

- బ్రెడ్, బ్రౌన్ రైస్, తృణధాన్యాలు, ఓట్స్, బార్లీ, క్వినోవా.
- చేపలు, గుడ్లు, బంగాళదుంప, చిలగడదుంప, క్యారట్, బీట్‌రూట్, ముల్లంగి వంటి రూట్ ఫుడ్స్, ఆకుపచ్చటి కూరగాయలు, పాలు, పెరుగు, చీజ్ వంటి తక్కువ కొవ్వు ఉండే ఆహారాలు.
- ఆకు కూరలు, చేపలు, గింజలు వంటి ఆహారాలు
- దోసకాయ, పాలకూర, పుచ్చకాయ వంటివి కడుపు లోని ఆమ్లాన్ని పలచన చేస్తాయి.
- హెర్బల్ టీలు, పెరుగు, కేఫీర్ వంటి ప్రోబయోటిక్ అధికంగా ఉండే ఆహారాలు.



ఇవి తీసుకోకూడదు

- ఆయిల్ ఉండే ఆహారాలు, బర్గర్లు, వేపుళ్లు, చిప్స్
- ఆరెంజ్ జ్యూస్, కాఫీ, టీ, టొమాటోలు, వెనిగర్
- గ్యాస్ ఉత్పత్తి చేసే కూరగాయలు - బ్రోకలీ, క్యాబేజీ, బ్రస్సెల్స్ మొలకలు, బీన్స్, కాలీఫ్లవర్
- మసాలా ఆహారాలు - వేడి, మంటను కలిగించే సుగంధ ద్రవ్యాలు, కడుపు లైనింగ్‌ను మరింత మంటకలిగించే మసాలా పదార్థాలకు నో చెప్పండి.
- పుష్కలంగా ద్రవాలు తాగాలి - అల్లం, పుదీనా వంటివి తీసుకోవాలి.
- లోతైన శ్వాస తీసుకోవడం - లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం.

ఎన్టీఆర్ డ్రాగన్?



ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభం అవుతుందని, చిత్రీకరణ ప్రధానంగా విదేశాల్లో ఉంటుందనే టాక్ ఎప్పట్నుంచో వినిపిస్తోంది. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కావొచ్చనే ఊహాగానాలూ ఇటీవల తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కాగా ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా గురించి సరికొత్త వివరాలు వెల్లడి కానున్నాయని తెలిసింది. మరోవైపు 'డ్రాగన్' టైటిల్ హక్కులు బాలీవుడ్ దర్శక-నిర్మాత కరణ్ జోహార్ దగ్గర ఉన్నాయని, దర్శకుడు ప్రశాంత్ నీల్ అండ్ టీమ్ అడగడంతో ఈ టైటిల్‌ను కరణ్ ఇచ్చేశారని బాలీవుడ్ సమాచారం. మరి.. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లోని సినిమాకు ఫైనల్‌గా 'డ్రాగన్' టైటిల్ ఖరారవుతుందా? వెయిట్ అండ్ సీ.



● ఐశ్వర్యా రాయ్

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యా రాయ్ పాల్గొంటున్నారు. గురువారం నలుపు రంగు డిజైనర్ ఫ్రాక్‌లో రెడ్ కార్పెట్‌పై నడిచారామె. అయితే ఆమె మేకప్, హెయిర్ స్టయిల్ అన్నీ బాగున్నాయనీ, గౌను అంత బాగాలేదనే విమర్శలొచ్చాయి. ఇక శుక్రవారం బ్లూ, సిల్వర్ కలర్స్ మిక్స్‌తో నెమలిని తలపించేలాంటి ఫ్రాక్‌లో ఐష్ తళుకులీనారు. ఈ చిత్రోత్సవాల్లో తొలిసారి పాల్గొనడానికి కియారా అద్వానీ ఫ్రాన్స్ చేరుకున్నారు. ఇంకా అదితీ రావు హైదరీ, శోభితా ధూళిపాళ కూడా హాజరు కానున్నారు.

భైరవ స్పెషల్ పర్సన్ బుజ్జి



● ప్రభాస్

తెలుగు చిత్ర పరిశ్రమలో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ ఎవరు? అంటే అందరికీ టక్కున గుర్తొచ్చే పేరు ప్రభాస్. తమ అభిమాన హీరో పెళ్లి ఎప్పుడా అని ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ వివాహంపై ఎప్పటికప్పుడు రూమర్లు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. అయితే పెళ్లి వార్తల గురించి ప్రభాస్ ఎప్పుడూ స్పందించలేదు. తాజాగా శుక్రవారం ఉదయం ''డార్లింగ్స్... ఫైనల్లీ నా జీవితంలోకి చాలా ప్రత్యేకమైన వ్యక్తి ప్రవేశించనున్నారు.. వేచి చూడండి' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రభాస్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ పెళ్లి గురించేనా? ఆయన పరిచయం చేయబోతున్న ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరు? అనే చర్చ జరిగింది. కాగా శుక్రవారం సాయంత్రం ప్రభాస్ సోషల్ మీడియా ద్వారా ''డార్లింగ్స్... బుజ్జిని మీకు పరిచయం చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని మరో పోస్ట్ షేర్ చేశారు. దాంతో ప్రభాస్ పెట్టిన ఈ రెండు పోస్ట్‌లు 'కల్కి 2898 ఏడీ' సినిమా ప్రచారంలో భాగం అనే టాక్ తెరపైకి వచ్చింది.. ఈ చిత్రంలో భైరవ పాత్రలో ప్రభాస్ నటిస్తుండగా... బుజ్జి పేరుతో ఓ పాత్ర ఉంది. ఆ బుజ్జి ఎవరు అనేది ఈరోజు సాయంత్రం తెలిసిపోతుంది. ఇక నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వినీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది.

కన్నప్పలో కాజల్

విష్ణు మంచు టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. శివ భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా ఈ సినిమాని దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'కన్నప్ప' సినిమాలో కాజల్ అగర్వాల్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం వెల్లడించింది. ఇంకా ఈ సినిమాలో మోహన్‌బాబు, శరత్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే ఈ సినిమా టీజర్ ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రిలీజ్ కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 'మోసగాళ్ళు' (2021) మూవీ కోసం విష్ణు మంచు, కాజల్ అగర్వాల్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు 'కన్నప్ప' కోసం కలిశారు.



● కాజల్ అగర్వాల్



● సూర్య, విజయ్ కనిష్క

హిట్ లిస్ట్
టీజర్ బాగుంది - సూర్య

''హిట్ లిస్ట్' మూవీ టీజర్ చాలా బాగుంది. సినిమా ఇంకా బాగుంటుందని ఆశిస్తున్నాను. విజయ్ కనిష్కతో పాటు టీమ్‌కి ఈ మూవీ మంచి సక్సెస్ ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో సూర్య అన్నారు. తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా సముద్ర ఖని, శరత్‌కుమార్, గౌతమ్ వాసుదేవ మీనన్ ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కె. కార్తికేయన్ దర్శకత్వం వహించారు. దర్శకుడు కేఎస్ రవికుమార్ నిర్మించారు. ఈ మూవీని శ్రీ శ్రీనివాస స్క్రీన్స్, శ్రీ శ్రీనివాస ఇన్‌ఫ్రా, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగులో రిలీజ్ చేస్తున్నాయి. త్వరలో రిలీజ్ కానున్న ఈ సినిమా టీజర్‌ని సూర్య లాంచ్ చేశారు. ''యాక్షన్, సస్పెన్స్, క్రైమ్ జానర్‌లో రూపొందిన చిత్రం 'హిట్ లిస్ట్'. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది'' అన్నారు మేకర్స్.

డర్టీ ఫెలో రెడీ



శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, 'మిస్ ఇండియా 2022' సిమ్రితి హీరోయిన్లుగా ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహించిన చిత్రం 'డర్టీ ఫెలో'. గూడూరు భద్రకాళీ సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ 24న రిలీజ్‌కి రెడీ అయింది. ఈ సినిమా ట్రైలర్‌ని 'బింబిసార' మూవీ ఫేమ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ఠ విడుదల చేసి, మాట్లాడుతూ-''డర్టీ ఫెలో' ట్రైలర్ బాగుంది. ఈ సినిమా విజయం సాధించి, యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అన్నారు. శాంతి చంద్ర, మూర్తి సాయి ఆడారి మాట్లాడుతూ- ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. మా సినిమాలోని అన్ని పాటలకు మంచి స్పందన వచ్చింది. మా చిత్రంలో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామ కృష్ణ .యస్, సంగీతం: డా. సతీష్ కుమార్ .పి.

యావరేజ్ స్టూడెంట్



● స్నేహా మాలవ్య, పవన్ కుమార్

'మెరిసే మెరిసే' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన పవన్ కుమార్ కొత్తూరి హీరోగా మారారు. ఆయన హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహాదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై పవన్ కుమార్ కొత్తూరి, బిషాలీ గోయెల్ నిర్మించిన ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా పవన్ కుమార్ కొత్తూరి మాట్లాడుతూ- ''యూత్‌ఫుల్ లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. అన్ని వర్గాల ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఝాన్సీ, రాజీవ్ కనకాల, 'ఖలేజా' గిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ బి. కొడకండ్ల, కెమెరా: సజీష్ రాజేంద్రన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
253	62
73,917	22,466

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,687	▽	11
డోజోన్స్	39,953	▲	84
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,420	▽	18
డాక్స్	18,704	▽	34
షాంఘై	3,154	▲	32
నికాయ్	38,787	▽	133

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
71,900	▽	270
బంగారం (22 క్యారెట్)		
68,480	▽	250
వెండి (కేజీ)		
92,500		0

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.57	107.12
€	యూరో	ఒకటి	89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.06	54.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.76	56.70
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.54	64.19
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.08	23.59
¥	చైనా యువాన్	ఒకటి	10.41	12.48

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ రూ. 7.30 డివిడెండ్

- క్యూ4లో లాభం 65 శాతం డౌన్
- రూ. 1,322 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ముడి వస్తువుల ధరలు, ఇతర వ్యయాలు పెరగడంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నికర లాభం 65 శాతం క్షీణించి రూ. 1,322 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఇది రూ. 3,741 కోట్లుగా నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 7.30 తుది డివిడెండ్ ప్రకటించింది. సమీక్షా కాలంలో సంస్థ ఆదాయం రూ. 47,427 కోట్ల నుంచి రూ. 46,511 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 43,170 కోట్ల నుంచి రూ. 44,401 కోట్లకు పెరిగాయి. ముడి వస్తువుల వ్యయాలు రూ. 23,905 కోట్ల నుంచి రూ. 24,541 కోట్లకు పెరిగాయి. పూర్తి ఆర్థిక సంవత్సరంలో నికర లాభం రూ. 4,139 కోట్ల నుంచి రూ. 8,973 కోట్లకు



చేరింది. ఆదాయం రూ. 1,66,990 కోట్ల నుంచి రూ. 1,78,010 కోట్లకు పెరిగింది.

కొత్త ప్రభుత్వ లక్ష్యం అత్యుత్తమ బడ్జెట్

మంచి మెజారిటీతో మళ్లీ అధికారంలోకి మోదీ ప్రభుత్వం • సీఐఐ వార్షిక బిజినెస్ సమావేశంలో ఆర్థికమంత్రి

న్యూఢిల్లీ: ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వ తక్షణ లక్ష్యం.. జూలైలో అత్యుత్తమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడమేనని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు లోక్‌సభలో మంచి మెజారిటీతో ప్రధాని నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని ఆర్థిక మంత్రి ఉద్ఘాటించారు. ఎన్నికల అనంతరం మోదీ వరుసగా మూడోసారి ప్రధాని అవుతారని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక వాణిజ్య శిఖరాగ్ర సమావేశంలో ఆమె ఈ మేరకు పారిశ్రామిక దిగ్గజాలను ఉద్దేశించి ప్రసంగించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జూలైలో పూర్తి సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుందని పేర్కొన్న ఆమె, దీనిని అత్యుత్తమంగా రూపొందించడానికి సీఐఐతో చర్చలు జరుపుతామని అన్నారు. భారత్ వృద్ధి తీరు స్థిరంగా కొనసాగుతుందని, దీనికి సంబంధించి దేశం ముందు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వివరించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం కానుందన్నారు. సోలార్, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా రంగాల పురోగతికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు యువతకు గణనీయమైన ఉద్యోగ అవకాశాలను అందిస్తాయని అన్నారు.



ఆర్థిక మంత్రి నుంచి సీఐఐ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంటున్న ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ చైర్మన్ కేవీ కామత్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-5-2024	
విశాఖ	550-00
చిత్తూరు	628-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00
రిటైల్ ధర	6.10

జీ ఎంటర్‌టైన్‌మెంట్ లాభం రూ. 13 కోట్లు

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్) నాలుగో త్రైమాసిక నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 13.35 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం క్యూ4లో రూ. 196 కోట్ల నష్టం నమోదైంది. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 2,126 కోట్ల నుంచి రూ. 2,185 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ. 2,083 కోట్ల నుంచి రూ. 2,044 కోట్లకు తగ్గాయి. షేరు ఒక్కింటికి రూ. 1 చొప్పున కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫార్సు చేసింది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం రూ. 48 కోట్ల నుంచి రూ. 141 కోట్లకు పెరగ్గా, ఆదాయం రూ. 8,168 కోట్ల నుంచి రూ. 8,766 కోట్లకు చేరింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయం, ఇతరత్రా సేల్స్, సర్వీస్‌ల ద్వారా ఆదాయం వృద్ధి చెందినట్లు జీల్ వెల్లడించింది. కొత్త ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వన్‌-టైమ్ ప్రాతిపదికన కొన్ని కేటాయింపులు జరపాల్సి రావచ్చని, దీంతో మార్జిన్లపై కొంత ప్రభావం పడొచ్చని పేర్కొంది. అయితే, రెండో త్రైమాసికం నుంచి మార్జిన్ క్రమంగా మెరుగుపడగలదని వివరించింది.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో టీ షర్టులు

హైదరాబాద్: ఫ్యాషన్ దుస్తుల సంస్థ 'అన్‌లిమిటెడ్' 10,000 రకాలకు పైగా టీ షర్టులను అందుబాటులోకి తెచ్చింది. అన్ని వయస్సుల వారికి తగ్గట్లు రూపొందించిన ఈ షర్టులు విభిన్న డిజైన్లు, ఆకట్టుకునే రంగులు, సౌకర్యమైన ఫ్యాషన్లతో ఆకర్షణీయంగా ఉన్నాయి. కొన్ని బ్రాండ్లపై ఒకటి కొంటే మరొకటి ఉచితం ఆఫర్ ఉంది. దేశ వ్యాప్తంగా షోరూంలలో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160 బ్లాక్ ఎడిషన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ సిరీస్‌లో బ్లాక్ ఎడిషన్‌ను భారత్‌లో ప్రవేశపెట్టింది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర వేరియంట్‌నుబట్టి రూ.1,09,990 నుంచి రూ.1,19,990 వరకు ఉంది. 5 స్పీడ్ గేర్ బాక్స్, ఎస్ఐ, 4 స్ట్రోక్, ఎయిర్ కూల్డ్, ఎస్‌వోహెచ్‌సీ, ఫ్యూయల్ ఇంజెక్షన్ ఇంజిన్, డబుల్ క్రాడిల్ సింక్రో స్టిఫ్ ఫ్రేమ్ పొందుపరిచారు. ఆర్‌టీఆర్ 160 – 2 వాల్వ్ వేరియంట్ 5.3 సెకన్లలో గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 4 వాల్వ్ వేరియంట్ 4.8 సెకన్లలో గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది.

రెండో రోజూ లాభాలు

- మెటల్, ఆటో, కన్జూమర్ షేర్లకు డిమాండ్

ముంబై: మెటల్, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 253 పాయింట్లు పెరిగి 73,917 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62 పాయింట్లు బలపడి 22,466 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. అధిక వెయిటేజీ ఎంఅండ్‌ఎం(6%)తో పాటు, ఐటీసీ(1%),రిలయన్స్ ఇండస్ట్రీస్(1%), మారుతీ సుజుకీ(1%) షేర్లు రాణించి సూచీలను లాభాల వైపు నడిపాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు సెన్సెక్స్ బలపడి 74,070 వద్ద, నిఫ్టీ 98 పాయింట్లు పెరిగి 22,502 ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. చిన్న, మధ్య తరహా షేర్లను కొనునేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో



బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.18%, 1.39 శాతం చొప్పున లాభపడ్డాయి.

నేడు ఎక్స్ఛేంజీల ప్రత్యేక ట్రేడింగ్

శనివారం (నేడు) సెలవు దినం అయినప్పటికీ స్టాక్ మార్కెట్ పని చేస్తుంది. ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు లేదా అంతరాయాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు శనివారం ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తెలిపాయి. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు తొలి సెషన్ ప్రధాన ప్రాథమిక సైట్‌లో.., ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య మరో సెషన్ డిజాస్టర్ రికవరీ సైట్‌లో ట్రేడింగ్ జరగనుంది. అన్ని సెక్యూరిటీస్, డెరివేటివ్ ఉత్పత్తులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంటాయి. గరిష్ట పరిమితిని 5 శాతంగా నిర్ణయించాయి.



దాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు బలపడి 83.37 స్థాయి వద్ద నిలిచింది.

బంధన్ బ్యాంక్ లాభం రూ. 55 కోట్లు



కోల్‌కతా: నాలుగో త్రైమాసికంలో బంధన్ బ్యాంక్ నికర లాభం రూ. 55 కోట్లకు పరిమితమైంది. క్రితం క్యూ4లో ఇది రూ. 808 కోట్లు. తాజాగా రైటాఫ్‌లు, మొండిబాకీలకు అధిక కేటాయింపులు జరపాల్సి రావడం వంటి అంశాలు లాభాలు తగ్గడానికి కారణం. జనవరి-మార్చి త్రైమాసికంలో ప్రొవిజనింగ్ రూ. 735 కోట్ల నుంచి రూ. 1,774 కోట్లకు పెరిగిందని బ్యాంక్ ఎండీ చంద్రశేఖర్ ఘోష్ తెలిపారు. అలాగే రూ. 3,852 కోట్లు రైటాఫ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. క్యూ4లో నికర వడ్డీ మార్జిన్ 7.6 శాతంగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 4.9 శాతం నుంచి 3.8 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.1 శాతంగా ఉన్నాయి. జూలైలో ఎండీ, సీఈవో పదవి నుంచి రిటైర్ కానున్న ఘోష్.. రిటైర్మెంట్ తర్వాత హోల్డింగ్ కంపెనీ బంధన్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌లో వ్యూహాత్మక బాధ్యతలు పోషించనున్నట్లు తెలిపారు.

మార్కెట్‌లోకి డ్రోగో కొత్త డ్రోన్

ఒకసారి చార్జింగ్‌తో 4 ఎకరాల్లో పిచికారీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్స్ తయారీలో ఉన్న డ్రోగో డ్రోన్స్ కృషి 3 ప్రో డ్రోన్‌కు డీజీసీఏ నుంచి ఆమోదం లభించింది. ఒకసారి చార్జింగ్‌తో నాలుగు ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేయడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డ్రోన్స్ కేవలం రెండు ఎకరాల్లో మాత్రమే పిచికారీ చేయగలవని డ్రోగో డ్రోన్స్ సీఈవో యశ్వంత్ బొంతు తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ సేవల్లోకి ప్రవేశించే పనిలో నిమగ్నమయ్యామని.. డీజీసీఏ అనుమతి కోసం వేచి చూస్తున్నట్టు వివరించారు. డ్రోన్స్ ద్వారా సర్వే, మ్యాపింగ్, ఉత్పత్తుల రవాణా విభాగాల్లోకి ఎంట్రీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. డ్రోగో డ్రోన్స్ తాజాగా ఇఫ్కోతో ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 30 లక్షల ఎకరాల్లో పురుగు మందులను పిచికారీ చేయనున్నారు.

ఒకే ప్లాన్‌తో టీవీ చానళ్లు, ఓటీటీ యాప్‌లు

డిష్ టీవీ స్మార్ట్‌ప్లస్ సర్వీసులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఒకే ప్లాన్‌తో ఇటు టీవీ చానళ్లు, అటు ఓటీటీ యాప్స్‌ను కూడా పొందే విధంగా డిష్ టీవీ కొత్తగా స్మార్ట్‌ప్లస్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ప్లాన్ కిందే వీటిని పొందవచ్చని సంస్థ సీఈవో మనోజ్ దోభల్ తెలిపారు. రూ. 200 ప్యాక్ నుంచి ఇది అందుబాటులో ఉంటుంది. పాత, కొత్త కస్టమర్లు.. స్మార్ట్‌ప్లస్ కింద సదరు ప్లాన్‌లోని టీవీ ఛానళ్లతో పాటు డిఫాల్టుగా లభించే హంగామా వంటి అయిదు ఓటీటీ యాప్లతో పాటు జీ5, డిస్నీప్లస్ హాట్‌స్టార్, సోనీ లివ్ తదితర యాప్‌ల నుంచి ఒకటి ఎంచుకోవచ్చు. కావాలనుకుంటే మూడు రోజుల తర్వాత మరో యాప్‌నకు మారవచ్చు. పూర్తిగా 16 యాప్‌లు పొందాలంటే నెలకు రూ. 179 చార్జీ ఉంటుంది. కొత్త సర్వీసులతో మార్కెట్ వాటా 3-4 శాతం మేర పెంచుకోగలమని ఆశిస్తున్నట్లు మనోజ్ తెలిపారు. ప్రస్తుతం తమకు డీటీహెచ్ మార్కెట్లో 21 శాతం వాటా ఉందని వివరించారు. వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో ఆండ్రాయిడ్ 4కే బాక్స్, క్లౌడ్ టీవీ వంటి ఉత్పత్తులు అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సినీ నటి శ్రద్ధా దాస్ పాల్గొన్నారు.



జూన్ 1న బంగ్లాదేశ్‌తో భారత్ వార్మప్ మ్యాచ్

దుబాయ్: ఇప్పుడైతే భారత ఆటగాళ్లంతా ఐపీఎల్ ఫ్రాంచైజీ జట్లలో ఆడుతున్నారు. అయితే టి20 ప్రపంచకప్‌కు ముందు కలిసి కట్టుగా, భారత జట్టుగా రోహిత్ శర్మ బృందం ఏకైక వార్మప్ మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో ఆడనుంది. జూన్ 2 నుంచి అమెరికా, వెస్టిండీస్‌లలో జరిగే ప్రపంచకప్‌లో టీమిండియా లీగ్ దశ పోటీలన్నీ అమెరికాలోనే షెడ్యూల్ చేశారు. దీంతో ప్రాక్టీస్ మ్యాచ్ కూడా అక్కడే ఆడుతుంది. అయితే వేదికను ఖరారు చేయాల్సి ఉంది. పోటీపడే మొత్తం 20 జట్లలో 17 జట్లు మే 27 నుంచి జూన్ 1 వరకు వార్మప్‌లో పాల్గొంటుండగా... డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, రన్నరప్ పాకిస్తాన్, సెమీఫైనలిస్ట్ న్యూజిలాండ్‌లు ప్రాక్టీస్ మ్యాచ్‌లు లేకుండానే నేరుగా టోర్నీలోనే బరిలోకి దిగనున్నాయి. ఈ మూడు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌ల వల్లే బహుశా వార్మప్ మ్యాచ్‌లకు దూరంగా ఉండొచ్చు. ఈ నెల 22 నుంచి ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్తాన్ నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడనుంది.



పూరన్

లక్నో విజయంతో ముగింపు

- 18 పరుగులతో ముంబైపై గెలుపు
- పూరన్ విధ్వంసం
- రోహిత్ మెరుపులు వృథా

ముంబై: ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో అందరికంటే ముందుగా ప్లేఆఫ్స్ దశకు దూరమైంది. ఇప్పుడు ఆఖరి స్థానంతో లీగ్ దశను పేలవంగా ముగించింది. మధ్యలో వర్షం ఆటంకం కలిగించిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 18 పరుగుల తేడాతో ముంబైపై ఘనవిజయం సాధించింది. ముందుగా లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (29 బంతుల్లో 75; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) సునామీలా చెలరేగిపోయాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (41 బంతుల్లో 55; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. పియూశ్ చావ్లా, తుషారా చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు చేసి ఓడింది. రోహిత్ శర్మ (38 బంతుల్లో 68; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), నమన్ ధీర్ (28 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిపించారు.

పూరన్ ధనాధన్

పది ఓవర్లలో లక్నో స్కోరు 69/3. పడిక్కల్ (0), స్టొయినిస్ (22 బంతుల్లో 28; 5 ఫోర్లు), దీపక్ హుడా (11) అవుటయ్యారు. ఇంకో 10 ఓవర్లలో వంద కొట్టినా... 170 దాటదు! కానీ పూరన్ తన 29 బంతుల్లో అంతా మార్చేశాడు. రాహుల్‌తో కలిసి విధ్వంసరచన చేశాడు. అన్షుల్ 13వ ఓవర్లో పూరన్ 4, 0, వైడ్, 4, 6, 6, 1లతో 22 పరుగులు రాబట్టాడు. 15వ ఓవర్‌ను అర్జున్ టెండూల్కర్ ప్రారంభించి 2 బంతులేస్తే పూరన్ సిక్సర్లుగా మలిచాడు. కండరాలు పట్టేయడంతో అర్జున్ వెనుదిరిగాడు. మిగతా ఓవర్‌ను నమన్ ధీర్ వేయగా పూరన్ 6, 4, 1 కొట్టాడు. ఆఖరి బంతిని రాహుల్ సిక్స్ బాదడంతో ఈ ఓవర్లో 29 పరుగులు వచ్చాయి. పూరన్ 19 బంతుల్లోనే ఫిఫ్టీ చేసుకోగా... రాహుల్ 37 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఆఖర్లో బదోని (10 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో లక్నో 200 పైచిలుకు స్కోరు చేసింది.

రోహిత్, ధీర్ ఫిఫ్టీ-ఫిఫ్టీ

భారీ లక్ష్యఛేదనకు అవసరమైన హిట్టింగ్‌తో రోహిత్ ముంబై స్కోరును పరుగుపెట్టించాడు. మరో ఓపెనర్ బ్రెవిస్ (20 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వేగంలో వెనుకబడినా రోహిత్ బౌండరీలతో జోరు కనబరిచాడు. 28 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. 88 పరుగుల వద్ద బ్రెవిస్ అవుటయ్యాక ముంబై తడబడింది. సూర్యకుమార్ (0), రోహిత్, హార్దిక్ (16), నేహల్ (1) వికెట్లను కోల్పోవడంతో ముంబై లక్ష్యానికి దూరమైంది. ఈ దశలో నమన్ ధీర్ మెరిపించినా అప్పటికే ఆలస్యమైంది. నమన్ 25 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించినా ముంబైని ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) తుషారా (బి) చావ్లా 55; పడిక్కల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషారా 0; స్టొయినిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చావ్లా 28; హుడా (సి) నేహల్ (బి) చావ్లా 11; పూరన్ (సి) సూర్య (బి) తుషారా 75; అర్షద్ (సి) నేహల్ (బి) తుషారా 0; బదోని (నాటౌట్) 22; కృనాల్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-1, 2-49, 3-69, 4-178, 5-178, 6-178. **బౌలింగ్:** తుషారా 4-0-28-3, అర్జున్ 2.2-0-22-0, అన్షుల్ 3-0-48-0, పియూశ్ చావ్లా 4-0-29-3, నేహల్ 2-0- 13-0, హార్దిక్ 2-0-27-0, నమన్ 0.4-0-17-0, షెఫర్డ్ 2-0-30-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మోసిన్ (బి) బిష్ణోయ్ 68; బ్రెవిస్ (సి) కృనాల్ (బి) నవీనుల్ 23; సూర్య (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; ఇషాన్ (బి) నవీనుల్ 14; హార్దిక్ (సి) నవీనుల్ (బి) మోసిన్ 16; నేహల్ (సి) కృనాల్ (బి) బిష్ణోయ్ 1; నమన్ (నాటౌట్) 62; షెఫర్డ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-88, 2-89, 3-97, 4-116, 5-120, 6-188. **బౌలింగ్:** అర్షద్ 2-0-11-0, హెన్రీ 2-0-24-0, కృనాల్ 4-0-29-1, మోసిన్ 4-0- 45-1, నవీనుల్ 4-0-50-2, రవి బిష్ణోయ్ 4-0-37-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
చెన్నై	13	7	6	0	14	0.528
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లక్నో	14	7	7	0	14	-0.667
బెంగళూరు	13	6	7	0	12	0.387
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	14	4	10	0	8	-0.318

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

చివరి బెర్త్ ఎవరిదో?

నేడు చెన్నై, బెంగళూరు మధ్య కీలక పోరు • మ్యాచ్‌కు వర్ష సూచన

బెంగళూరు: ఐపీఎల్ 17వ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్... మూడుసార్లు రన్నరప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్లు 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధిస్తాయా లేక లీగ్ దశలోనే నిష్క్రమిస్తాయా ఈరోజే తేలిపోనుంది. ఇప్పటికే కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్తాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు 'ప్లే ఆఫ్స్'కు అర్హత పొందగా... చివరిదైన నాలుగో బెర్త్ కోసం చెన్నై, బెంగళూరు జట్లు ఈరోజు చిన్నస్వామి స్టేడియంలో ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం చెన్నై 14 పాయింట్లతో నాలుగో స్థానంలో... బెంగళూరు 12 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాయి.

- చెన్నైపై బెంగళూరు గెలిస్తే... చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, లక్నో జట్లు 14 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలుస్తాయి. ఈ నేపథ్యంలో మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టుకే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది.
- బెంగళూరు, ఢిల్లీ, లక్నో జట్ల కంటే చెన్నై రన్‌రేట్ మెరుగ్గా ఉంది. చెన్నైపై గెలవడంతోపాటు ఆ జట్టు రన్‌రేట్‌ను అధిగమించాలంటే బెంగళూరు 18 పరుగుల తేడాతో చెన్నైను ఓడించాలి. ఒకవేళ చెన్నై లక్ష్యాన్ని నిర్దేశిస్తే ఆ లక్ష్యాన్ని బెంగళూరు 11 బంతులు మిగిలి ఉండగానే ఛేదించాలి. అయితేనే బెంగళూరుకు ప్లే ఆఫ్స్ బెర్త్ లభిస్తుంది.
- మరోవైపు చెన్నై విజయం సాధించినా లేదా వర్షం వల్ల మ్యాచ్ రద్దయినా ఆ జట్టు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లే ఆఫ్స్ బెర్త్‌ను దక్కించుకుంటుంది.
- స్థానిక వాతావరణ శాఖ ప్రకారం శనివారం బెంగళూరు నగరానికి భారీ వర్ష సూచన ఉండటం గమనార్హం. ఫలితంగా బెంగళూరు జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఆ జట్టు ప్రదర్శనపైనే కాకుండా వరుణ దేవుడి దయపై కూడా ఆధారపడి ఉన్నాయి.



రుతురాజ్, డు ప్లెసిస్

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

అర్జున్‌కు మూడో విజయం



న్యూఢిల్లీ: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత రెండో ర్యాంకర్ అర్జున్ ఇరిగేశి మూడో విజయం నమోదు చేశాడు. మాన్యుయల్ పెట్రోసియాన్ (అర్మేనియా)తో శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 46 ఎత్తుల్లో గెలుపొందాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ రెండో ఓటమి చవిచూశాడు. అభిజిత్ గుప్తా (భారత్)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో రిత్విక్ 41 ఎత్తుల్లో ఓడిపోయాడు. భారత మహిళాగ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. గ్లెబ్ దూడిన్ (హంగేరి)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను హారిక 26 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

- అశ్విని-తనీషా ద్వయం కూడా
- ముగిసిన మిరాబా పోరాటం



బ్యాంకాక్: ఈ సీజన్‌లో తమ జోరు కొనసాగిస్తూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ నాలుగో టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో మరో అలవోక విజయంతో సాత్విక్-చిరాగ్ ద్వయం ముందంజ వేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 38 నిమిషాల్లో 21-7, 21-14తో జునైదీ ఆరిఫ్-రాయ్ కింగ్ యాప్ (మలేసియా) జోడీని ఓడించింది. ఈ ఏడాది ఐదో టోర్నీలో ఆడుతున్న సాత్విక్-చిరాగ్ మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచి, ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ సాధించింది. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీలో మాత్రం ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. మహిళల డబుల్స్ విభాగంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా 21-15, 21-23, 21-19తో లీ యు లిమ్-షిన్ సెంగ్ చాన్ (దక్షిణ కొరియా)లపై గెలిచారు. ఈ ఏడాది తొమ్మిదో టోర్నీలో ఆడుతూ తొలిసారి అశ్విని-తనీషా ద్వయం సెమీఫైనల్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మైస్నం మిరాబా లువాంగ్ పోరాటం ముగిసింది. ప్రపంచ 84వ ర్యాంకర్ మిరాబా క్వార్టర్ ఫైనల్లో 12-21, 5-21తో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు.

పర్వీన్ హుడాపై నిషేధం

- పారిస్ ఒలింపిక్స్‌కు దూరమైన భారత మహిళా బాక్సర్
- 57 కేజీల విభాగంలో మళ్లీ బెర్త్ కోసం పోటీపడనున్న భారత్



న్యూఢిల్లీ: భారత మహిళా బాక్సర్ పర్వీన్ హుడా పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కోల్పోయింది. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) సస్పెన్షన్ వల్లే ఆమె పారిస్ విశ్వ క్రీడలకు దూరం కానుంది. 'వాడా' రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ (ఆర్టీపీ) నియమావళి ప్రకారం ఆమె ఎప్పుడు ఎక్కడ ఉన్నారనే సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైంది. గత 12 నెలలుగా మూడుసార్లు పర్వీన్ ఈ సమాచారాన్ని ఇవ్వలేకపోవడంతో 'వాడా' ఆమెపై 22 నెలలు నిషేధం విధించింది. పర్వీన్ ఈ తప్పిదాన్ని ఉద్దేశపూర్వకంగా చేయలేదని 'వాడా' అధికారులకు భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) వివరణ ఇచ్చింది. దాంతో 'వాడా' ఈ నిషేధాన్ని 14 నెలలకు కుదించింది. శుక్రవారంతో మొదలైన ఈ నిషేధం వచ్చే ఏడాది జూలై వరకు కొనసాగుతుందని బీఎఫ్ఐ తెలిపింది. గత ఏడాది హాంగ్జౌలో జరిగిన జరిగిన ఆసియా క్రీడల్లో మహిళల 57 కేజీల కేటగిరీలో పర్వీన్ కాంస్య పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పర్వీన్‌పై నిషేధం నేపథ్యంలో ఇప్పుడు 57 కేజీల విభాగంలో బెర్త్ ఖాళీ అయింది. పారిస్ ఒలింపిక్స్‌లో మహిళల, పురుషుల విభాగాలలో ఏడు చొప్పున ఒలింపిక్ వెయిట్ కేటగిరీలు ఉండగా... భారత్ నుంచి ఇప్పటికే ముగ్గురు మహిళా బాక్సర్లు (నిఖత్ జరీన్-50 కేజీలు; ప్రీతి-54 కేజీలు; లవ్లీనా బొర్గొహైన్-75 కేజీలు) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. పురుషుల విభాగంలో భారత్ నుంచి ఎవరూ అర్హత సాధించలేదు. పర్వీన్‌పై నిషేధం కారణంగా... ఈనెల 23 నుంచి జూన్ 3 వరకు బ్యాంకాక్‌లో జరిగే వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ మహిళల విభాగంలో మూడు వెయిట్ కేటగిరీల్లో (57, 60, 66 కేజీలు), పురుషుల విభాగంలో ఏడు వెయిట్ కేటగిరీల్లో పోటీపడుతుంది.

క్లుప్తంగా...

25న డీవైఈవో పోస్టులకు పరీక్ష

సాక్షి, అమరావతి: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈవో) పోస్టులకు ఈనెల 25న సీబీటీ విధానంలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు శనివారం నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఉదయం 9గంటల నుంచి 11.30 వరకు పరీక్ష సమయాన్ని కేటాయించినట్టు పేర్కొంది. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని గుర్తించి.. సమయానికి చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని కోరింది.

గురుకుల ఎస్‌వోఈలో 20న కౌన్సెలింగ్

మధురవాడ (విశాఖ): ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల, పాఠశాలల్లో ప్రవేశాలకు ఈనెల 20న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు మారికవలస ఎస్‌వోఈ (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్) ప్రిన్సిపాల్ కె.విశ్వనాథం తెలిపారు. మారికవలస (విశాఖ జిల్లా)లోని గిరిజన, గురుకుల ఎస్‌వోఈతోపాటు విస్సన్నపేట(ఎన్టీఆర్ జిల్లా)లోని సీవోఈ (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఇక్కడే కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఏప్రిల్ 7న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హులైన అభ్యర్థులు ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఇప్పటికే అర్హులైన అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించామని, ఫోన్ ద్వారా కూడా సమాచారం ఇచ్చినట్టు వివరించారు. మారికవలస ఎస్‌వోఈలో 8వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరాలకు, విస్సన్నపేట సీవోఈలో ఇంటర్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ ఉమ్మడి జిల్లాలకు చెందిన గిరిజన బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ 9441567937ను సంప్రదించాలని కోరారు.

అగ్నిపథ్ ర్యాలీలో సంగీత కళాకారులకు ఆహ్వానం

విజయవాడ కల్చరల్: భారత వాయుసేన ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే సైనిక నియామకం కోసం నిర్వహించే ర్యాలీలో పాల్గొనటానికి సంగీత విద్వాంసుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సీఈవో మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. భారతీయ పౌరులైన యువత 02 జనవరి 2004–జూలై 2007 మధ్యలో జన్మించి ఉండాలని, మెట్రిక్యులేషన్, టెన్త్ పాసై ఉండాలని, భారతీయ సంగీత రంగంలో గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి డిప్లొమా లేదా సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. 22-5-2024 నుంచి 5-6-2024 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తి వివరాలను https://agnipathvayu.cdac.in లో పొందుపరిచారు.

బస్సు కిటికీలో ఇరుక్కున్న తల

మహిళ అవస్థ



తల ఇరుక్కుపోయి అవస్థ పడుతున్న మహిళ

యశవంతపుర: బస్సు కిటికీలో నుంచి తల బయట పెట్టడం ప్రమాదకరమని మరోసారి రుజువైంది. ఓ మహిళ తల బస్సు కిటికీలో చిక్కుకున్న ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం హాసన్-బెంగళూరు మార్గంలోని ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ కిటికీలో నుంచి తల బయటకు పెట్టారు. అయితే కిటికీ తలుపులు బిగుసుకుపోవడంతో తల చిక్కుకుపోయింది. ఎంత ప్రయత్నించినా అద్దం తెరుచుకోలేదు, తల బయటకు రాలేదు. తోటి ప్రయాణికులు ఆమె అవస్థను గమనించి తెరవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో బస్సును ఆపేసి డ్రైవర్, కండక్టర్ గంటపాటు శ్రమిస్తే కిటికీ అద్దాలు వదులయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.



మెరిసి మురిపించిన విద్యుల్లత

నింగిని చీల్చుకుంటూ దేదీప్యమానమైన వెలుతురుతో నేలవైపు దూసుకొచ్చింది ఓ మెరుపు. భూమి నుంచి ఆకాశానికి ఏర్పాటు చేసిన బాటలా కనిపిస్తున్న ఈ విద్యుల్లతను నంద్యాల జిల్లా మహానందిలో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- మహానంది

కౌండిన్య అభయారణ్యంలో అరుదైన కప్ప



తిరుపతి మంగళం: తూర్పు కనుమల్లో భాగంగా, పలమనేరు సమీపంలోని కౌండిన్య అభయారణ్యంలో అరుదైన కప్పను గుర్తించినట్టు హైదరాబాద్‌కు చెందిన జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ దీపాజైస్వాల్, డాక్టర్ ఎస్.ఎస్.జాదవ్, డాక్టర్ కరుతపాండి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీలంక తడిభూముల్లో మనుగడ సాగిస్తున్న శ్రీలంక బ్యాక్డ్ ఫ్రాగ్ (కప్ప) భారతదేశంలో రెండు శతాబ్దాల క్రితమే కనుమరుగైన జాతిగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. శాస్త్రీయంగా ఈ కప్పను హైలారానా గ్రాసిలిస్గా పిలుస్తారని చెప్పారు. మంచినీటి అనుబంధంగా జీవించే ఈ కప్పను సుదీర్ఘ కాలం చేసిన పరిశోధనల్లో కనిపెట్టడం జీవ వైవిధ్య అధ్యయనాల్లో ఒక ప్రధాన మలుపుగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

'మిల్లెట్ సిస్టర్స్' ఆదర్శం

20వేల మందికి జీవనోపాధితో స్ఫూర్తినిస్తున్న విజయనగరం వాసి

- సీఐఐ వుమెన్ ఎగ్జంప్లర్ 2024 అవార్డు అందుకున్న సరస్వతి మల్లువలస
- న్యూఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి అవార్డు స్వీకరణ
- ప్రశంసాపత్రం, ట్రోఫీతో పాటు రూ.మూడు లక్షల నగదు ప్రదానం



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సరస్వతి మల్లువలస

సాక్షి, అమరావతి: నిజ జీవితంలో పేదరికం, సామాజిక, లింగ వివక్ష వంటి రుగ్మతలను సమర్థంగా ఎదుర్కొని తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచిన విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన సరస్వతి మల్లువలస జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. సీఐఐ ఫౌండేషన్ మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, సామాజిక లింగ – ఆధారిత వివక్షను ఎదుర్కొన్న అట్టడుగు మహిళా నాయకులను గుర్తించి ఎగ్జంప్లర్ పేరుతో అవార్డునిస్తోంది. ఇందులో భాగంగా సీఐఐ వుమెన్ ఫౌండేషన్ 19వ ఎడిషన్‌లో సూక్ష్మ మధ్య చిన్నతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) రంగంలో సరస్వతి ఎంపిక కాగా శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక బిజినెస్ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ అవార్డును అందించారు. మొత్తం మూడు విభాగాల్లో అవార్డులను ప్రకటించగా విద్యారంగం నుంచి మహారాష్ట్రకు చెందిన రంజిత పవార్, ఆరోగ్యరంగంలో బిహార్‌కు చెందిన రుమీ పర్వీన్, ఎంఎస్ఎంఈ రంగంలో మన రాష్ట్రానికి చెందిన సరస్వతి ఎంపికయ్యారు. అవార్డు గ్రహీతలకు ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు రూ.మూడు లక్షల నగదును అందజేశారు. ఈ అవార్డు కోసం దేశవ్యాప్తంగా మొత్తం 300మంది పోటీపడగా వాటిలో తుది పోటీకి 16మందిని ఎంపిక చేసి స్వయంగా వెళ్లి పరిశీలించి, వారిని ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసినట్లు సీఐఐ శుక్రవారం పేర్కొంది.

మహిళా రైతులతో నెట్‌వర్క్

విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన సరస్వతి మల్లువలస నిజజీవితంలో గృహహింస, లింగ వివక్షను ఎదుర్కొన్నారు. ఆహార భద్రత, ఆర్థిక అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సి రావడమే ఈ వివక్షకు ప్రధాన కారణమని గుర్తించిన ఆమె ఇంకెవ్వరూ ఇలాంటి కష్టాలు ఎదుర్కోకూడదని మిల్లెట్ సిస్టర్స్ పేరుతో చిన్న స్థాయి మహిళా రైతుల నెట్‌వర్క్‌ను స్థాపించారు. దీని ద్వారా 20,000 మంది మహిళలకు ఆదాయాన్ని మెరుగుపర్చేలా జీవనోపాధిని కల్పించి ఆదర్శంగా నిలిచారు. మహిళా సాధికారితలో అయిదు 'ఈ'లు ఎడ్యుకేషన్, ఈక్వాలిటీ, ఎంప్లాయిమెంట్, ఎకనామిక్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ ప్రధానమైనవిగా గుర్తించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సీఐఐ 19వ ఎడిషన్‌లో ఎంపికైన 16 మందితో కలిపి ఇప్పటి వరకు 120 కంటే ఎక్కువ మందిని గుర్తించామని, వీరి ద్వారా 30 లక్షల మంది జీవితాల్లో స్పష్టమైన మార్పులను గమనిస్తున్నట్లు సీఐఐ పేర్కొంది.

కొనసాగుతున్న ద్రోణి, ఆవర్తనం!

- మూడు రోజులు మోస్తరు వర్షాలు
- మెరుపులు, పిడుగులకు అవకాశం



సాక్షి, విశాఖపట్నం: రాయలసీమను ఆనుకుని ఉన్న ఉత్తర తమిళనాడుపై సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. అలాగే దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి కొమరిన్ ప్రాంతం వరకు రాయలసీమ మీదుగా ద్రోణి కొనసాగుతోంది. వీటి ఫలితంగా రానున్న మూడు రోజులు వర్షాలు కురవనున్నాయి. శని, ఆదివారాల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం నివేదికలో తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు అక్కడక్కడ పిడుగులకు ఆస్కారం ఉందని, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆదివారం నాటికి నైరుతి రుతుపవనాలు దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందని వివరించింది.

గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

- వర్ష సూచన నేపథ్యంలో ఈఏపీ సెట్ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి
- ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ వర్ష సూచన నేపథ్యంలో ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. వచ్చే నాలుగైదు రోజుల్లో ఏపీ అంతటా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో 18 నుంచి 23వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు రాసే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.


ముగిసిన బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు

ఏపీ ఈఏపీ సెట్–2024 బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు సెట్ చైర్మన్, జేఎన్‌టీయూ కాకినాడ వీసీ ప్రసాదరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం రెండోరోజు 44,621 మంది విద్యార్థులకు గాను 40,880 మంది (91.62 శాతం) పరీక్ష రాశారని పేర్కొన్నారు. రెండు రోజుల్లో 80,766 మంది పరీక్షలకు హాజరైనట్టు వివరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు భారీగా దరఖాస్తులు

11 ఏళ్ల తర్వాత ఏకంగా 1.91 లక్షల మంది నమోదు

- 26న దేశవ్యాప్తంగా పరీక్ష
- ఆన్‌లైన్‌లో అడ్మిట్ కార్డులు
- రాష్ట్రం నుంచి పరీక్ష రాయనున్నవారు 21,844
- గతేడాది భారీగా పెరిగిన కటాఫ్ మార్కులు
- 23 ఐఐటీల్లో మొత్తం 17,385 సీట్లు



సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్ కోర్సులకు దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో దరఖాస్తులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా దాదాపు 11 ఏళ్ల తర్వాత గరిష్టంగా 1.91 లక్షల మంది పరీక్షకు నమోదు చేసుకున్నారు. గతేడాది ఈ పరీక్షకు 1,89,744 మంది దరఖాస్తు చేశారు. సాధారణంగా జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చూపినవారిలో టాప్ 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. వీరిలో రెండేళ్ల కిందటి వరకు 60 శాతం మంది కూడా అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసుకునేవారు కాదు. అలాంటిది ఇప్పుడు వారి సంఖ్య ఏకంగా 76 శాతానికి పెరిగింది.

ఉత్తీర్ణత శాతం తక్కువే..

అడ్వాన్స్‌డ్ పరీక్షకు నమోదు చేసుకున్నవారితో పోలిస్తే హాజరయ్యేవారి సంఖ్య ఏటా తక్కువగానే ఉంటోంది. అలాగే పరీక్ష రాసిన వారిలో ఉత్తీర్ణులయ్యేవారి సంఖ్య కూడా స్వల్పమే. గత కొన్నేళ్లుగా పరీక్షలకు సంబంధించి కటాఫ్ మార్కులతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా తగ్గుతూ వచ్చింది. జనరల్‌తో పాటు రిజర్వ్‌డ్ కేటగిరీల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. గతేడాది అత్యధికంగా 1.80 లక్షల మందికి పైగా పరీక్ష రాస్తే 43,773 మంది మాత్రమే అర్హత సాధించారు. గతేడాది కటాఫ్ కూడా బాగా పెరిగింది. ఇక అడ్వాన్స్‌డ్‌లో పురుషులతో పోలిస్తే మహిళల హాజరు, ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షలు అత్యంత కఠినంగా ఉంటాయని, వాటిలో అర్హత సాధించాలంటే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

రెండు సెషన్లలో పరీక్ష

దేశవ్యాప్తంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆన్‌లైన్‌లో అడ్మిట్ కార్డులను అందుబాటులో ఉంచింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు. దేశంలోని 23 ఐఐటీల్లో 17,385 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 21,844, తెలంగాణ నుంచి 24,121 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. నిపుణుల విశ్లేషణ ప్రకారం.. దేశవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందిన 2.50 లక్షల మందిలో సుమారు 60 వేల మందికిపైగా పరీక్షకు దరఖాస్తు చేయలేదు. వారు 12వ తరగతి/ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించలేకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసిన అభ్యర్థులు, ఉత్తీర్ణత శాతం ఇలా..

ఏడాది	దరఖాస్తులు	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం	మహిళలు
2017	1,71,814	1,59,540	51,040	31.99	7,259
2018	1,65,656	1,55,158	31,988	20.62	4,176
2019	1,74,432	1,61,319	38,705	23.99	5,356
2020	1,60,838	1,50,838	43,204	28.64	6,707
2021	1,51,193	1,41,699	41,862	29.54	6,452
2022	1,60,038	1,55,538	40,712	26.17	6,516
2023	1,89,744	1,80,372	43,773	24.26	7,509

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కటాఫ్ మార్కులు..

కేటగిరీ	2023	2022	2021	2020	2019	2018	2017
జనరల్	86	55	63	69	93	90	128
ఈడబ్ల్యూఎస్	77	50	56	62	83	81	115
ఓబీసీ	77	50	56	62	83	45	64
ఎస్సీ	43	28	31	34	46	45	64
ఎస్టీ	43	28	31	34	46	45	64
పీడబ్ల్యూడీ	43	28	31	34	46	45	64

'సెకీ' విద్యుత్ చౌక

- రైతుల కోసం 7 వేల మెగావాట్లు కొనుగోలుకు సెకీతో ఒప్పందం
- అతి తక్కువ ధరకు యూనిట్ రూ.2.49కు కొనుగోలు
- ఏటా దాదాపు రూ.3,750 కోట్లు ఆదా
- చంద్రబాబు హయాంలో యూనిట్‌కు రూ.8.90 చెల్లించి పీపీఏలు
- బాబు నిర్వాకం వల్ల రాష్ట్ర డిస్కంలపై 25 ఏళ్లపాటు ఏటా రూ.3500 కోట్ల భారం



సాక్షి, అమరావతి: కరెంటు కోసం అర్ధరాత్రి వేళ పొలాల్లో పడిగాపులు కాస్తూ, రైతులు ప్రాణాలు పోగొట్టుకున్న చీకటి రోజుల నుంచి విముక్తి కలిగిస్తూ పగటిపూటే నిరంతరాయంగా 9 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. రానున్న 30 ఏళ్లలో అన్నదాతలకు ఎలాంటి విద్యుత్ కష్టాలు లేకుండా చేయడం కోసం సౌర విద్యుత్‌ను సమకూరుస్తోంది. ఇందుకోసం ప్రైవేటు రంగం నుంచి కాకుండా, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి 7 వేల మెగావాట్లు తీసుకుని వ్యవసాయానికి అందించాలని సంకల్పించింది. ఇలా సెకీ నుంచి కొనుగోలు చేసే విద్యుత్ అత్యంత చౌకగా వస్తోందని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

'సెకీ'తో లాభమేగానీ నష్టం లేదు

2003 ఎలక్ట్రిసిటీ యాక్ట్ ప్రకారం సెకీ ఒప్పందాలకు కేంద్ర, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండళ్ల నుంచి ఆమోదం లభించింది. దీంతో ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి సెకీ నుంచి విద్యుత్ కొనుగోలు మొదలవుతుంది. తొలి ఏడాది 3 వేల మెగావాట్లు, 2025లో మరో 3 వేల మెగావాట్లు, 2026లో మరో 1,000 మెగావాట్లు చొప్పున మొత్తం ఏడాదికి 7 వేల మెగావాట్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనుంది. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ఒప్పందంలో ఒక భాగస్వామిగా ఉండటం వల్ల చెల్లింపులకు ఎటువంటి ఆటంకం కలగదు. ప్రస్తుత సరాసరి విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్ రూ.5.10 ఉంది. సెకీ విద్యుత్ అతి తక్కువకు యూనిట్ రూ.2.49 కు వస్తోంది. ఏపీకి ఎన్టీపీసీ సరఫరా చేస్తున్న సౌర విద్యుత్ ధర (ట్రేడింగ్ మార్జిన్ కలిపి) యూనిట్ రూ.2.79 కన్నా ఇది తక్కువ. ఈ లెక్కన సెకీ ఒప్పందంతో ఏటా దాదాపు రూ.3,750 కోట్లు రాష్ట్రానికి ఆదా అవుతుంది. సెకీ నుంచి విద్యుత్ తీసుకోవడం వల్ల 25 ఏళ్ల పాటు ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి కూడా రాష్ట్రానికి మినహాయింపు వస్తుంది. అదే రాష్ట్రంలో ఉత్పత్తి అయిన విద్యుత్‌కు పాతికేళ్ల పాటు సెంట్రల్ గ్రిడ్ ఛార్జీలు చెల్లించాల్సి వచ్చేది. దీనికి కూడా కేంద్రం మినహాయింపునిచ్చింది. రాష్ట్రంలో అంతర్గతంగా సౌర ప్రాజెక్టులు కట్టినప్పుడు వాటికి కావలసిన విద్యుత్ లైన్లు, అంతర్గతంగా విద్యుత్ ప్రసార వ్యవస్థ బలోపేతానికి అయ్యే ఖర్చు, బయటి రాష్ట్రం నుంచి నేరుగా తీసుకున్నప్పుడు అయ్యే ఖర్చు తక్కువ అవుతుంది.

టీడీపీ వల్లనే నష్టం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేసుకున్న పీపీఏల ధరలకు, వైఎస్ జగన్ ప్రభుత్వం సెకీతో కుదుర్చుకున్న ఒప్పందంలోని ధరలకు అసలు పొంతనే లేదు. చంద్రబాబు హయాంలో సగటు ధరకన్నా ఎక్కువకు కొనుగోలు ఒప్పందాలు జరిగాయి. అప్పట్లో మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2.44 కు లభిస్తుంటే (బాక్డౌన్ చార్జీలతో కలిపి రూ.3.54) చంద్రబాబు ఏకంగా యూనిట్‌కు రూ.8.90 వెచ్చించారు. పవన విద్యుత్ యూనిట్‌కు రూ.4.84 వరకు అధిక ధర చెల్లించి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ)లు కుదుర్చుకున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం, ఇదే సెకీ నుంచి యూనిట్‌కు రూ.4.57తో గాలివీడులో 400 మెగావాట్లు, మైలవరంలో యూనిట్‌కు రూ.2.77 చొప్పున మరో 750 మెగావాట్లను కొనుగోలు చేసింది. ఇలా చంద్రబాబు హయాంలో మొత్తం దాదాపు 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల డిస్కంలపై ఏడాదికి రూ.3,500 కోట్ల భారం పడింది. ఈ భారాన్ని 25 ఏళ్ల పాటు మోయాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే గత ఐదేళ్లుగా సోలార్ ధరలు ఇంచుమించు ఒకేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలు 'సెకీ'తో ఒప్పందం కారణంగా బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.6 నుంచి రూ.12 కు కొనే బదులు గ్రీన్ పవర్‌ను యూనిట్ రూ.2.49 కొనవచ్చు. ఫలితంగా డిస్కంలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది.

29 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని వైద్య కళాశాలల్లో 29 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2024–25లో ప్రారంభిస్తున్న ఫేజ్–2 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఖాళీలను భర్తీ చేయనున్నారు. డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ విధానాల్లో పోస్టుల భర్తీ చేపడతామని బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. అవసరాలకు అనుగుణంగా పోస్టుల సంఖ్య ఇంకా పెరగడం లేదా తగ్గే అవకాశాలున్నాయన్నారు. పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను https://dme.ap.nic.in, http://apmsrb.ap.gov.in/msrb/ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచామన్నారు. అర్హులైన డాక్టర్లు శనివారం నుంచి ఈనెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ అభ్యర్థులు రూ.1,000 బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, వికలాంగ అభ్యర్థులు రూ.500 చొప్పున దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనాటమీ–3, ఫిజియాలజీ–7, బయోకెమిస్ట్రీ–6, ఫార్మకాలజీ–6, మైక్రో బయాలజీ–7 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

విజయవాడ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రూప్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి జూన్ 4 వరకు రాజమండ్రి–విశాఖపట్నం (07466), 26 నుంచి జూన్ 4 వరకు విశాఖపట్నం–రాజమండ్రి (07467), 27 నుంచి జూన్ 3 వరకు మచిలీపట్నం–విశాఖపట్నం (17219), 28 నుంచి జూన్ 4 వరకు విశాఖపట్నం–మచిలీపట్నం (17220), 17 నుంచి జూన్ 3 వరకు తిరుపతి–కాకినాడ టౌన్ (17249), 17 నుంచి జూన్ 4 వరకు కాకినాడ టౌన్–తిరుపతి (17250), 27 నుంచి జూన్ 3 వరకు గుంటూరు–విశాఖపట్నం (17239), 28 నుంచి జూన్ 4 వరకు విశాఖపట్నం–గుంటూరు (17240), 27 నుంచి జూన్ 3 వరకు గుంటూరు–రాయగడ (17243), 28 నుంచి జూన్ 4 వరకు రాయగడ–గుంటూరు (17244), 19 నుంచి జూన్ 3 వరకు విశాఖపట్నం–మహబూబ్‌నగర్ (12861), 20 నుంచి జూన్ 4 వరకు మహబూబ్‌నగర్–విశాఖపట్నం (12862), 27 నుంచి జూన్ 4 వరకు గుంటూరు–విశాఖపట్నం (22702/22701) రైళ్లను రద్దు చేశారు.


బాలల భద్రతకు చర్యలు చేపట్టండి

డీజీపీని కోరిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో జరుగుతున్న ఘటనల్లో బాలల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తను కోరారు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పోలింగ్ అనంతరం కొన్ని జిల్లాల్లో రాజకీయ, కుటుంబ కక్షల ప్రభావంతో బాలలపైన, మహిళలు (గర్భిణులు, బాలింతలు) పైన విచక్షణారహితంగా దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న బాలలు భయభ్రాంతులకు గురై తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నట్టు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయమై బాలల కోసం పనిచేసే స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు చేశారని తెలిపారు. మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డీజీపీని కోరామని పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణలో 450 సినిమా థియేటర్లు మూత

'మా' ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా



తెనాలి రూరల్: తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి 450 సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతబడ్డాయని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. గుంటూరు జిల్లా పెదరావూరు స్టూడియోలో శుక్రవారం జరిగిన 'మా' ఏపీ కార్యనిర్వాహక సమావేశంలో మాట్లాడుతూ త్వరలో ఏపీలో మల్టీప్లెక్స్ థియేటర్లు సైతం మూతబడే అవకాశాలున్నాయన్నారు. దీనికి ప్రధాన కారణం థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడమేనని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని రెండు ప్రభుత్వాలకు 'మా– ఏపీ' బృందం నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక వైపున ఓటీటీ దెబ్బ వేస్తుండగా మరోవైపు నిర్మాణ వ్యయం భారీగా పెరగడం థియేటర్లపై దుష్ప్రభావం చూపుతున్నదని తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు సినిమా పెద్దలతో సంప్రదింపులు జరిపి టికెట్ ధరలు తగ్గించాలని ఆయన సూచించారు. తెలుగు సినిమాను బతికించే దిశగా రెండు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మనవి చేశారు. హీరోలు భారీ పారితోషికాలను తగ్గించుకోవాలని కోరారు. నిర్మాత చదలవాడ హరిబాబు, సహాయ దర్శకుడు వెంకీ రావణ్, ఇంటూరి విజయ భాస్కర్, నటులు మిలటరీ ప్రసాద్, ఎర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఉమాశ్రీకి పీహెచ్‌డీ



పీహెచ్‌డీ అందుకున్న ఉమాశ్రీ

రాయచూరు రూరల్: నగరానికి చెందిన ఉమాశ్రీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాను అందుకున్నారు. గురువారం విజయ నగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్కేయూ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాహెబ్ అలీ నిరగుడి చేతుల మీదుగా అందించారు. ఉమాశ్రీ ఎంచుకున్న మల్టీమీడియా ఇంటరాక్షనల్ ప్యాకేజీ ఆన్ ఇంటలిజెన్స్ ప్రాబ్లం సాల్వింగ్, ఎబిలిటీ అకాడమి పెర్ఫార్మెన్స్ ఇన్ మ్యాథమేటిక్స్ అమాంగ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్ అనే అంశంపై ప్రతిపాదించిన వ్యాసానికి ఈ పట్టాను స్వీకరించారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న భక్తులు

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లాలో త్రైత సిద్ధాంత శిఖామణి గ్రంథాలు, భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. శుక్రవారం సైదాపూర్, మైలాపూర్, కాళ బెళగుంది, బలిచక్ర, హలగేరలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్వర్యంలో రాసిన పుస్తకాలను ఇంటింటికీ అందజేశారు. కార్య క్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక భక్తులు వీరేష్, శ్రీదేవి, మనోహర్, భరత్, సురేష్, గణేష్, రామాంజి, రవి, నాగేంద్ర, పురుషోత్తం, వరుణ్, వెంకట రాముడు, సుధాకర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వరూ



వినతిపత్రం సమర్పిస్తున్న మహంతేష్

రాయచూరు రూరల్: ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన ఉద్యోగి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సంఘం కార్యదర్శి మహంతేష్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో జాగీర్‌జాడలదిన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు బీఎల్‌ఓగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించినందున ఆయన కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రాజ కాలువలో పూడికతీతకు శ్రీకారం



జేసీబీతో పూడికను తొలగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాజ కాలువలో పేరుకున్న పూడికతో వర్షాకాలంలో నగరంలోని 30, 31వ వార్డుల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరుతాయి. వానలు వచ్చే లోపు ప్రధాన రాజ కాలువలో పూడిపోయిన చెత్తా చెదారాన్ని నగరసభ అధికారులు, సిబ్బంది తొలగించడానికి నడుం బిగించారు. గురువారం నగరసభ కమిషనర్ గురులింగప్ప, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ ఆదేశాల మేరకు వర్షపు నీరు సజావుగా వెళ్లడానికి అధికారులు జేసీబీలతో పూడికను తీయడానికి పూనుకున్నారు. సియాతలాబ్, కాలాతలాబ్, మ్యాదరవాడి, మున్నూరు వాడి, నీరుబావికుంట ప్రాంతాల్లో ప్రజలు వానాకాలం అంటే బెంబేలెత్తిపోతుంటారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు ప్రవేశించకుండా రక్షణ గోడలు నిర్మిస్తామని ప్రజాప్రతినిధుల హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలించి మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు

బళ్లారి అర్బన్: కురుగోడు తాలూకాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులను జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. కురుగోడు తాలూకాలోని దమ్మూరు, వీటీ క్యాంప్‌ల వద్ద కాలువల్లో పూడికతీత, సింధిగేరి అటవీ శాఖ ట్రెంచ్, హెచ్ వీరాపుర, సోమలాపుర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ టీపీ ఈఓ కేవీ.నిర్మల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు



రాయచూరులోని అరబ్ మొహల్లా వద్ద అండర్‌పాస్‌లోకి చేరిన నీరు



రాయచూరులోని హైదరాబాద్ రహదారిలో నిలిచిన ట్రాఫిక్



రాయచూరు తాలూకాలో భారీ వర్షానికి నీటమునిగిన యడ్లాపూర్ రోడ్డు

- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- గాలి వానతో విరిగిన చెట్లు, రోడ్లలో నీరు

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి మార్చి, ఏప్రిల్ రెండు నెలల పాటు విపరీతమైన ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. 45 డిగ్రీల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపటంతో ఎండవేడిమికి తట్టుకోలేక జనం అల్లాడిపోయిన నేపథ్యంలో వరుణుడు కనికరించడంతో వాతావరణంలో కాస్త మార్పు వచ్చింది. గురువారం రాత్రి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ వర్షం పడటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గాలి బాగా వీచి, వాన జోరుగా కురవడంతో నగరంలో పలు కాలనీల్లో చెట్లు నేలకొరిగాయి. భగభగమండే ఎండల్లో గాలి, వాన రావడంతో నగరంలో పలు రోడ్లలోని గుంతల్లో నీరు నిలబడ్డాయి. వాతావరణం చల్లబడటంతో నగర వాసులు ఊరట చెందారు. ఎండవేడిమికి అల్లాడిపోతున్న ప్రజలకు వాన రావడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. వానతో పాటు గాలి కూడా జోరుగా రావడంతో చెట్లు కూలిపడిపోయాయి. రోడ్లలో అక్కడక్కడ చెట్లు పడిపోయిన దృశ్యాలు కనిపించాయి. ఓ మోస్తరు వానకే నగరంలోని మట్టిరోడ్లలో నీరు నిలిచాయి.

భారీ వర్షం.. లోతట్టు జలమయం

రాయచూరు రూరల్: జిల్లాలో శుక్రవారం తెల్లవారు జామున ఒంటి గంటకు జడి వానగా ప్రారంభమై ఐదు గంటల వరకు భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్లు బురద గుంటలుగా మారాయి. నాలుగు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో నగరంలోని గాంధీ చౌక్, మున్నూరు వాడి, కూరగాయల మార్కెట్‌లోకి వర్షపు నీరు చొరబడ్డాయి. అరబ్ మొహల్లా కాలనీ పక్కనే ఉన్న అండర్‌పాస్‌లోకి వర్షపు నీరు చేరాయి. రాయచూరు–హైదరాబాద్ ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాలూకాలోని బిచ్చాలి పరిధిలోని యడ్లాపూర్ వద్ద భారీ వర్షానికి రోడ్డు నీటమునగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.



జలమయమైన మినీ విధానసౌధ ప్రాంగణం



బళ్లారిలో గాలీ వానకు విరిగిన చెట్టు కొమ్మలు

కేజీఎఫ్‌ను ముంచెత్తిన వర్షం

కేజీఎఫ్ : నగరంలో గురువారం రాత్రి కురిసిన భారీ వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరంలోని మినీ విధాన సౌధ ప్రాంగణం చుట్టూ నీరు చేరి ప్రజలు కార్యాలయంలోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. మినీ విధాన సౌధ చుట్టూ డ్రైనేజీ అశాస్త్రీయంగా నిర్మించడం వల్ల వర్షం వచ్చిందంటే మినీ విధాన సౌధ ముందు భాగంతో పాటు చుట్టూ నీరు చేరి పని నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. వివిధ శాఖల కార్యాలయాలు, తాలూకా కార్యాలయం ఒకే చోట ఉండడం వల్ల పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ పనుల కోసం వస్తుండడం వల్ల వర్షం వచ్చిందంటే మినీ విధానసౌధ ప్రాంగణం మరింత అధ్వానంగా తయారవుతోంది. తాలూకా కార్యాలయం మాత్రమే కాకుండా కేఎస్‌ఆర్టీసీ డిపో ముందు కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అశాస్త్రీయంగా నిర్మించిన డ్రైనేజీలను సరి చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బళ్లారిలో ఓ రోడ్డులోని గుంతలో నిలిచిన వర్షపు నీరు

సమర్థ నాయకుడినే ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: గెలిచిన తర్వాత సమస్యలను గాలికి వదిలే నాయకుడికి ఎట్టి పరిస్థితుల్లోను ఓట్లు వేయకూడదని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ నుంచి బరిలో ఉన్న అమర్‌నాథ్ పాటిల్ తరపున చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా కంప్లి నియోజకర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందిన అనంతరం పట్టభద్రుల సమస్యలను పరిష్కరించడంపై చొరవ తీసుకోవాలన్నారు. మళ్లీ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని, ఓటు ద్వారా పట్టభద్రులు వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇటీవల కర్ణాటకలో ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీజేపీ ప్రభంజనం సృష్టిస్తోందన్నారు. కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేసిందన్నారు. దేశంలో మోదీ పాలనను మళ్లీ జనం కోరుకుంటున్నారన్నారు. విద్యావంతులు కూడా బాగా ఆలోచించి మంచి ఎమ్మెల్సీని ఎన్నుకోవాలన్నారు. నిత్యం అందుబాటులో ఉండే, పిలిస్తే పలికే నేతగా గుర్తింపు పొందిన అమర్‌నాథ్ పాటిల్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, బీజేపీ నాయకులు వీరేష్, కుమారస్వామి, సిద్దప్ప, బ్రహ్మయ్య, మురళీమనోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆహ్లాదానికి ఎగ్జిబిషన్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ వ్యవస్థాపకులు రియాజ్ అహ్మద్ తదితరులు

బళ్లారిఅర్బన్: వేసవి సెలవుల్లో ప్రజల ఆహ్లాదానికి ఏటా మాదిరిగా ఈసారి కూడా ప్రభుత్వ ఐటీఐ కాలేజీ మైదానంలో రెయిబో ఫన్‌ఫేర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు ఎగ్జిబిషన్ వ్యవస్థాపకుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఎగ్జిబిషన్ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎగ్జిబిషన్‌లో విశేషంగా పక్షులు, మూగజీవాలు, వన్యప్రాణులు అందరినీ ఆకట్టుకుంటాయన్నారు. వివిధ రాష్ట్రాల గృహోపకరణ వస్తువులు, చేనేత వస్త్రాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. చిన్నపిల్లల వినోదం కోసం తాజ్ మహల్ నమూనా, ప్రత్యేకంగా వాటర్ బోట్, మినీ రైల్, జెయింట్ వీల్ గేమ్స్, ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వెస్ట్రన్ స్టైల్ అల్పాహారాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు రెండు నెలల పాటు ఈ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్ మేనేజ్‌మెంట్ చందు, ఆర్. మనోహర్, శ్రీరామచంద్రమూర్తి, జాకీర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నిద్రిస్తుంటే ఇంట్లో చోరీ



జాగిలంతో ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

హొసపేటె: తాలూకాలోని వడ్డరహళ్లిలో గురువారం రాత్రి మిద్దెపై నిద్రిస్తుండగా గ్రామానికి చెందిన ప్రదీప్ ఇంటిలో చోరీ ఘటన జరిగింది. ఇంటిలో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న ఒకటిన్నర తులాల బంగారు గొలుసు, 750 గ్రాముల వెండి, రూ.లక్ష నగదును అపహరించారు. హొసపేటె రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.

వైభవంగా వాసవీ మాత రథోత్సవం



అలంకరణలో సరస్వతి దేవి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

రాయచూరు రూరల్: నగరంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం సాయంత్రం వందలాది మంది భక్తుల సమక్షంలో అమ్మవారికి అభిషేకం చేశారు. సరస్వతి దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. నగరేశ్వరాలయంలో వాసవి మాతకు విశేష పూజలు జరిపి అమ్మవారి విగ్రహానికి పుష్ప వృష్టి, ప్రత్యేక అలంకార, పల్లకీ సేవలతో ఊరేగించారు. దేవికి పూలు పండ్లు, ధవస, ధాన్యాలతో తులాభారం నెరవేర్చారు. కార్యక్రమంలో పురుషోత్తం, పలుగుల నాగరాజ్, వీరేష్, వీరణ్ణ శెట్టి, వెంకటేష్, ఇల్లూరు గోపాలయ్య కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



చెట్టుకు ఉరి వేసుకున్న ప్రవీణ్



ప్రవీణ్(ఫైల్)

హొసపేటె: అప్పుల బాధ తాళలేక ఓ యువ రైతు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన తాలూకాలోని మండలగిరి గ్రామంలో చోటు చేసుకుంది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో కరువు విలయ తాండవం చేస్తుండగా రైతుల రుణాలపై వడ్డీ రోజురోజుకూ పెరుగుతోంది. మండలగిరి గ్రామానికి చెందిన ప్రవీణ్ రామన్న కురి(24) అనే యువ రైతు అర్ధరాత్రి దుర్గమ్మ గుడి సమీపంలోని తన వ్యవసాయ భూమిలోని వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు మంజునాథ్ కురి విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పనుల నిమిత్తం చేసిన అప్పు విషయమై ఇంట్లో తీవ్ర చర్చ జరిగిందన్నారు. సాయంత్రం కనిపించకుండా పోయిన అన్నయ్య ఈరోజు తెల్లవారు జామున శవమై కనిపించడం తమ దురదృష్టమన్నారు. మృతుడు ప్రవీణ్ కురి ఈనెల 10న వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాడని తెలిపారు. ఘటనపై కుకనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గాలివానతో విద్యుత్‌కు అంతరాయం



చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా ఉన్న దృశ్యం

హొసపేటె: కొట్టూరు పట్టణంలో మళ్లీ వరుణుడు విజృంభించి ఈదురుగాలులు వీయడంతో పాటు వర్షం రావడంతో పబ్లిక్ లైబ్రరీ ఎదురుగా ఉన్న కరెంటు స్తంభం విరిగి పడింది. అదే విధంగా తాగునీటి ప్లాంట్ సమీపంలో పెద్ద వృక్షం నేలకూలింది. ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కూడా వర్షం నీరు చేరడంతో వైద్యం కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు కొన్ని చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు తెగి నేలకూలడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. గాలి, వానల కారణంగా నేలకొరిగిన చెట్లను తొలగించి రోడ్డులో వాహన రాకపోకలను పునరుద్ధరించారు. నేలకూలిన స్తంభాలను సరిచేసి విద్యుత్ సరఫరా కల్పించాలని నగర ప్రజలు కోరారు.

ఎత్తిపోతల పథకం కొనసాగించండి



వినతిపత్రాన్ని అందిస్తున్న రైతు సంఘం నేతలు

బళ్లారిఅర్బన్: జిల్లాలోని సిరుగుప్ప తాలూకా ఇబ్రహీంపురం, మణ్ణూరు, సూగురు, కూరిగనూరు గ్రామాల్లో ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు నిలిచి పోయాయి. దీంతో రైతులకు ఎన్నో ఇబ్బందులు తలెత్తాయి. తక్షణమే పనులను కొనసాగేలా జిల్లా చిన్న నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆదేశాలు ఇవ్వాలని ఆ ప్రాంత రైతులు ఇబ్రహీంపుర వీరణ్ణగౌడ, కర్చిగనూరు బసవనగౌడ, నాగనగౌడ, పురుషోత్తంగౌడ తదితరులు తుంగభద్ర రైతు సంఘం తరపున జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఎట్టకేలకు అంజలి హంతకుడు అరెస్ట్

- వెల్లడించిన పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్



కిమ్స్‌లో నిందితుడు విశ్వ, మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్

హుబ్లీ: నగరంలోని వీరాపుర ఓణికి చెందిన అంజలి అనే అమ్మాయిని ఈ నెల 15న ఉదయం దారుణంగా చాకుతో పొడిచి హత్య చేసిన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. అంజలిని పొడిచి పరారైన నిందితుడిని దావణగెరెలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఉదయం అంజలిని హత్య చేసిన నిందితుడు విశ్వనాథ అలియాస్ గిరీష్ సావంత్ స్థానిక గోకుల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కి దావణగెరెకు వెళ్లాడు. అక్కడ సంచరిస్తున్న నిందితుడిని ప్రజలు గుర్తించి దేహశుద్ధి చేశారని తెలిసింది. ఈ క్రమంలో దావణగెరె పోలీసులు, హుబ్లీ పోలీసులు కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై మీడియాతో జంట నగరాల పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ మాట్లాడుతూ విశ్వనాథ్ అలియాస్ గిరీష్ సావంత్‌ను హుబ్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

ఆస్పత్రిలో కోలుకుంటున్న వైనం

ప్రజల చేతిలో దేహశుద్ధికి గురి కావడంతో తల, ముఖంపై బాగా దెబ్బలు తగలడంతో నిందితుడు మాట్లాడలేని స్థితిలో ఉన్నాడన్నారు. అతను కోలుకున్న వెంటనే పోలీస్ కస్టడీలోకి తీసుకొని అంజలిని హత్య చేసిన వివరాలను కూపీ లాగుతామని ఆమె వివరించారు. కాగా అరసీకెరె రైల్వే స్టేషన్‌లో జనరల్ బోగీ ఎక్కిన నిందితుడు గిరీష్ ఎదురుగా ఉన్న మరో తోటి మహిళను చెడు దృష్టితో చూశాడని చిక్కజాజూరు రైల్వే స్టేషన్ మార్గంలో ఆ మహిళ బాత్రూమ్‌కు వెళ్లగా ఆ మహిళను వెండించిన నిందితుడు బాత్రూం కిటికీ ద్వారా తొంగి చూశాడన్నారు. దీన్ని పసిగట్టి ఆ మహిళ మీకు అక్కచెల్లెళ్లు లేరా? అని దబాయించడంతో నిందితుడు మహిళను చాకు చూపించి బెదిరించాడన్నారు. దీంతో మహిళ గట్టిగా అరవగా భర్త, తోటి ప్రయాణికులు వచ్చి విశ్వను బాగా చితకబాదినట్లుగా తెలిసింది. గదగ్‌కు చెందిన లక్ష్మీ, భర్త మహంతేష్ సవణూరు దావణగెరె రైల్వే పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

గతమంతా నేరాలమయమే

తుమకూరు నుంచి విశ్వమానవ ఎక్స్‌ప్రెస్ రైల్లో భర్తతో పాటు ప్రయాణిస్తుండగా నిందితుడు గిరీష్ దాడి చేశాడు. మొత్తానికి గిరీష్ గతమంతా నేరాలమయంగానే తెలుస్తోంది. కాగా ఆ రైల్లో ప్రయాణికులతో దెబ్బలు తిన్న గిరీష్ సంచరిస్తున్న రైల్లో నుంచే కిందకు దూకాడు. ఆ సమయంలో దావణగెరె రైల్వే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని చిగటేరి జిల్లా ఆస్పత్రిలో చికిత్స ఇప్పించారని తెలిసింది. మాయకొండ వద్ద రైలు నుంచి గిరీష్ దూకగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో పోలీసులకు హుబ్లీ అంజలి హంతకుడు ఇతడేనని ముందుగా పసిగట్టలేక పోయారు. ఆ తర్వాత నిందితుడిని తీరా గమనించాక అంజలి అంతకుడు ఇతడే అని గుర్తించి హుబ్లీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం రాత్రే హుబ్లీ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా గిరీష్ మైసూరులోని మహారాజ హోటల్‌లో పని చేసేవాడని, అంజలి తాను పరస్పరం ప్రేమించుకున్నట్లుగా ఆ మేరకు 15 రోజుల క్రితం ఆలయంలో పెళ్లి చేసుకున్నట్లు కూడా నిందితుడు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

అంజలికి రూ.2 వేలు ఫోన్‌పే

అంజలి రూ.2000 ఫోన్ పే చేయమని అడగగా ఫోన్ పే చేశాడన్నారు. అనంతరం తన ఫోన్ నెంబర్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టి ఫోన్ చేసినా రిసీవ్ చేయలేదని, ఆ అక్కసుతో మైసూరు నుంచి హుబ్లీకి వచ్చి బుధవారం తెల్లవారు జామున అంజలిని మట్టుబెట్టినట్లుగా నిందితుడు పోలీసులకు ఇచ్చిన వివరాలను బట్టి తెలుస్తోంది. హత్య చేశాక నిందితుడు హుబ్లీ కొత్త బస్టాండ్ నుంచి బస్సులో హావేరి బయలుదేరి వెళ్లాడు. అనంతరం హావేరి నుంచి మైసూరుకు వెళ్లాడు. అక్కడ మహారాజ హోటల్‌లో బుధవారం నిద్ర చేసి తిరిగి మైసూరు నుంచి హుబ్లీకి రైల్లో వస్తుండగా తోటి మహిళా ప్రయాణికురాలిని అసభ్యంగా చూడటంతో సదరు ప్రయాణికులు దేహశుద్ధి చేయగా ఆ రైలు నుంచి ఉన్నఫళంగా కిందకు దూకాడని, ఈ క్రమంలో దావణగెరె పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. కాగా నిందితుడి ఆరోగ్య పరిస్థితి రీత్యా కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించామని, కోలుకున్న వెంటనే పూర్తి దర్యాప్తు ప్రారంభిస్తుమని ఆమె తెలిపారు. నిందితుడిపై నాలుగు బైక్ చోరీ కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలను దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం

- ఐదు సార్లు బీజేపీ విజేత
- ఒక్కసారి కాంగ్రెస్ హస్తగతం



అమర్‌నాథ్ పాటిల్ (బీజేపీ)



చంద్రశేఖర్ పాటిల్ (కాంగ్రెస్)

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని జిల్లాల్లో జూన్ 3న జరగబోయే ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. కళ్యాణ కర్ణాటక పరిధిలో బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలు వస్తాయి. ఈ ఎన్నికలకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించాయి. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ అమర్‌నాథ్ పాటిల్, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్, స్వతంత్ర అభ్యర్థిగా నారా ప్రతాప్‌రెడ్డి బరిలో ఉన్నారు. 1988 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో ఐదు సార్లు బీజేపీని విజయం వరించింది. 1988, 1994, 2000, 2006లో బీజేపీ నుంచి ఎంఆర్ తంగా, 2012లో బీజేపీ నుంచి అమర్‌నాథ్ పాటిల్ గెలుపొందారు. 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ నుంచి అమర్‌నాథ్ పాటిల్, కాంగ్రెస్ నుంచి చంద్రశేఖర్ పాటిల్ పోటీ పడగా మొదటిసారి కమలం నుంచి విజయాన్ని హస్తగతం చేసుకున్నారు.

కొత్త పద్ధతులతో కీటకాల బెడదకు చెక్



మాట్లాడుతున్న శివకుమార్ సింగ్

రాయచూరు రూరల్: వ్యవసాయంలో కీటకాల నియంత్రణకు నూతన పద్ధతులు పాటించాలని తెలంగాణలోని పాలమూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ శివకుమార్ సింగ్ పిలుపునిచ్చారు. ఆయన రాయచూరు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జీవశాస్త్రం, వృక్షశాస్త్రం అంశాలపై మాట్లాడారు. న్యానో సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులతో వ్యవసాయ రంగంలో నూతన వంగడాలకు అవకాశం ఉంటుందన్నారు. పంటలపై విషపూరితమైన రసాయనిక మందుల వినియోగం వల్ల పరిసరాలపై చెడు ప్రభావం కలిగిస్తుందన్నారు. న్యానో సాంకేతిక రంగంలో వచ్చిన అంశాలను వినియోగించుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్, భౌతిక, రసాయనిక, జైవిక, విజ్ఞాన శాస్త్రాల్లో కూడా న్యానో సాంకేతిక రంగంపై ఆధారపడ్డాయన్నారు. కార్యక్రమంలో డీన్ పార్వతి, భాస్కర్, గణేష్ నాయక్, బసవరాజ్, మహేంద్రరెడ్డి, గీత, స్వాతిలున్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు

శ్రీనివాసపురం: రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించినందునే విద్యార్థులు, మహిళలు ఒకరి తరువాత ఒకరు హత్యకు గురవుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఎన్ వేణుగోపాల్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యార్థిని నేహా హత్య ఘటన మరువక ముందే మరో యువతి అంజలి అంబిగేర దారుణ హత్యకు గురైందన్నారు. కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు కరువయ్యాయన డానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. అంజలి అంబిగేరను దారుణంగా హత్య చేసిన వ్యక్తిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు కారణాలు తెలుసుకుని మృతురాలి కుటుంబానికి పరిహారం అందించి న్యాయం చేయాలన్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.